

'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసీ గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 53

బుధవారం 15-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ ఆశలు పదిలం!

చివరి మ్యాచ్‌లో లక్నోపై గెలుపు. ఇతర జట్ల చేతుల్లో 'ప్లే ఆఫ్స్' అవకాశాలు - 12లో



మార్కెట్లకు బ్లూచిప్స్ దన్ను

సెన్సెక్స్ 328 పాయింట్లు అప్.. 22,218 వద్ద ముగిసిన నిఫ్టీ - 13లో



ముంబైలో హోర్డింగ్ విషాదం..

భారీ హోర్డింగ్ కూలిన ఘటనలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కి చేరుకుంది.

- వివరాలు 6లో



భోజనానికి ముందు, తర్వాత..

భోజనానికి గంట ముందు, తర్వాత టీ, కాఫీలు తాగొద్దని ప్రజలను భారత వైద్య పరిశోధనా మండలి హెచ్చరించింది.

- వివరాలు 6లో



నిందితుల జాబితాలో 'ఆప్'

ఢిల్లీ మద్యం పాలసీ స్కామ్.మనీ లాండరింగ్ కేసు తదుపరి చార్జ్‌షీటులో ఆప్‌ను నిందితుల జాబితాలో చేర్చుతామని ఈడీ తెలిపింది.

- వివరాలు 6లో



రఫాలో ఇజ్రాయెల్ సైన్యం దాడి

ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో భారతీయ మాజీ సైనికాధికారి కల్నల్ వైభవ్ బలయ్యారు. ఘటనపై ఇజ్రాయెల్ విచారం వ్యక్తం చేసింది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం



రాష్ట్రంలో బుధ, గురువారాల్లో తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీనికి తోడుగా రాష్ట్రానికి తూర్పు దిశ నుంచి బలమైన గాలులు వీస్తున్నాయి. దీని ప్రభావంతో రెండ్రోజులు కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

- వివరాలు 14లో


వానాకాలం సాగు @ 1.34 కోట్ల ఎకరాలు



ఖరీఫ్‌లో 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈసారి అత్యధికంగా 66 లక్షల ఎకరాల్లో వరి, 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతాయని, 19.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని తన పంటల ప్రణాళికలో పేర్కొంది.

- వివరాలు 14లో

బరిలో హేమాహేమీలు



ఉత్తరప్రదేశ్‌లో ఐదో విడతలో 14 నియోజకవర్గాల్లో ఈ నెల 20న పోలింగ్ జరగనుంది. పార్టీలన్నీ నువ్వా నేనా అనేలా తలపడుతున్నాయి. ప్రచారం ఫుల్ స్వింగ్‌లో సాగుతోంది. రాహుల్, రాజ్‌నాథ్, స్మృతి ఇరానీ వంటి హేమాహేమీలు బరిలో ఉన్నారు.

- వివరాలు 10లో

ఎవరి లెక్క వారిదే!

లోక్‌సభ పోలింగ్ సరళి తమకే అనుకూలం అంటున్న ప్రధాన రాజకీయ పక్షాలు

- మెజారిటీ సీట్లను సాధిస్తామంటూ ఎవరికి వారే ధీమాగా చెప్తున్న తీరు
- ప్రజాపాలన వైపే ఓటర్లు మొగ్గుచూపారంటున్న అధికార కాంగ్రెస్
- పోలింగ్ శాతం పెరిగింది కూడా అందుకే అనే ధీమాలో గాంధీభవన్ వర్గాలు
- త్రిముఖ పోటీలో తమకు మంచి ఫలితాలు వస్తాయంటున్న గులాబీ నేతలు
- కేసీఆర్ బస్సుయాత్రతో పోలింగ్ తీరే మారిపోయిందని వ్యాఖ్య
- ట్రెండ్స్ అన్నీ తమవైపే ఉన్నాయంటున్న కమలదళం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయన్నది ఉత్కంఠ రేపుతూనే ఉంది. ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ఎవరి అంచనాలు వారు వేసుకుంటుండటం, అన్ని పార్టీలూ తమకే ఎక్కువ సీట్లు వస్తాయని గట్టిగా వాదిస్తుండటంతో.. ఆసక్తి మరింత పెరుగుతోంది. సోమవారం జరిగిన పోలింగ్ సరళిని విశ్లేషించుకున్నాక కూడా కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మూడు పార్టీలు తమ అంచనాలను ఏమాత్రం తగ్గించుకోవడం లేదు. పైగా మరిన్ని స్థానాలు అదనంగా గెలిచినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నట్టు ప్రకటనలు చేస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే.. ఈసారి పెరిగిన పోలింగ్ శాతాన్ని ఎవరికి వారే తమకు అనుకూలమని అంచనా వేసుకుంటుండటం గమనార్హం. అయితే అన్ని పార్టీలు మహిళలు, గ్రామీణ, పట్టణ ఓటర్లు ఎలాంటి తీర్పు ఇచ్చారో అన్నది

మిగతా 2వ పేజీలో ▶

ఇక పాలనపైనే దృష్టి



- నేటి నుంచి సచివాలయానికి వెళ్తా.. విలేకరులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్ఠి
- ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి పనిచేస్తా
- 13 లోక్‌సభ సీట్లు గెలుస్తామని ధీమా

14 లో

10 పక్కా.. 12 వచ్చినా ఆశ్చర్యపోవద్దు!



- లోక్‌సభ ఓటింగ్ సరళిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమీక్ష
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై సన్నాహక భేటీ

- వివరాలు 2లో

ఆ రెండు పార్టీల కంటే ఎక్కువ సీట్లు సాధిస్తాం



- కేంద్రంలో ప్రాంతీయ శక్తులదే కీలక పాత్ర: కేటీఆర్
- ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రజల నమ్మకం కోల్పోయింది
- బీజేపీ, కాంగ్రెస్‌ది ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అని వ్యాఖ్య

2 లో



లోక్‌సభ పోలింగ్ 66.3 శాతం

3.32 కోట్ల మంది	2.20 కోట్లు
17 స్థానాల్లో మొత్తం ఓటర్లు	ఓటేసిన వారి సంఖ్య

తుది పోలింగ్ శాతం గణాంకాలు వెల్లడించిన సీఈవో వికాస్‌రాజ్

2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే 3.6 శాతం పెరిగిన పోలింగ్

అత్యధికం: భువనగిరి 76.78% అత్యల్పం: హైదరాబాద్ 48.48%

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సోమవారం జరిగిన సాధారణ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతంపై స్పష్టత వచ్చింది. దీనికి సంబంధించి తుది గణాంకాలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ మంగళవారం రాత్రి విడుదల చేశారు. మొత్తంగా రాష్ట్రంలో 66.3 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకు 2,20,24,806 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 2,18,14,035 మంది పోలింగ్ కేంద్రాల్లో ఓటేయగా.. 2,10,771 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు. ఇందులో 1,89,091 మంది ఎన్నికల సిబ్బంది, 21,680 మంది వయోవృద్ధులు/వికలాంగ/అత్యవసర సేవల ఓటర్లు ఉన్నారు. వీరిలో వయోవృద్ధులు, వికలాంగులు తమ ఇళ్ల వద్దే ఓటేశారు.

భువనగిరిలో అత్యధికం

2019 లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో 62.69 శాతం పోలింగ్ నమోదవగా.. ఈసారి 3.6శాతం అదనంగా పోలింగ్ నమోదైంది. అత్యధికంగా భువనగిరి లోక్‌సభ స్థానంలో 76.78 శాతం పోలింగ్, అత్యల్పంగా హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో 48.48శాతం పోలింగ్ నమోదయ్యింది.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు: సీఈఓ వికాస్‌రాజ్

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని.. అవాంఛనీయ ఘటనలు జరగలేదని సీఈఓ వికాస్‌రాజ్ తెలిపారు. పోలింగ్ శాతం పెంచడానికి ఎన్నికల యంత్రాంగం చేసిన కృషి ఫలించిందన్నారు. ప్రజలు ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ఓటర్లు, ఎన్నికల యంత్రాంగం, సిబ్బంది, పోలీసు బలగాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా మిగతా 5వ పేజీలో ▶

ఏపీలో 81.3% పోలింగ్

పోస్టల్ బ్యాలెట్ కలిపితే 82.5%: ఏపీ సీఈఓ 5 లో

కళ్లకు గంతలు కట్టుకున్న ఈసీ...

పచ్చ మూకా స్వైరవిహారం

అవ్వాతాతలను, మహిళలను హడలగొట్టడమే లక్ష్యం... ఏపీలో పచ్చ మూకల విధ్వంసకాండ



పద్మావతీ మహిళా వర్సిటీ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనాలను పెట్రోల్ పోసి తగలబెడుతున్న పచ్చ మూకలు

దౌర్జన్యాలకు దారి చూపిన ఎన్నికల కమిషన్

- చంద్రబాబు, పురందేశ్వరి కుట్రలకు తలొగ్గిన వైనం
- క్షేత్రస్థాయిలో పట్టున్న పోలీసు ఉన్నతాధికారుల ఆకస్మిక బదిలీ
- అవగాహనలేని అధికారులకు సమస్యాత్మక జిల్లాల్లో పోస్టింగ్‌లు
- చిన్నమ్మ జాబితా ప్రకారమే నియామకాలు
- ఫలితంగా యథేచ్ఛగా దాడులకు తెగబడ్డ పచ్చ మూకలు
- చోద్యం చూసిన అధికారులు.. రావణకాష్టంగా మారిన రాష్ట్రం
- ఎన్నికల నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణలో ఈసీ ఘోర వైఫల్యం

- వివరాలు 5లో



ప్రధాని నామినేషన్

వారణాసికి తరలివచ్చిన కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ పక్ష నేతలు

- వివరాలు 6లో

ఇక 'పట్టభద్రుల' పరీక్ష

మండలి ఉప ఎన్నికపై బీఆర్ఎస్ ఫోకస్



- 'వరంగల్ – ఖమ్మం – నల్లగొండ' ఎమ్మెల్సీ స్థానానికి 27న ఎన్నిక
- సిట్టింగ్ సీటును తిరిగి కైవసం చేసుకోవాలనే పట్టుదలతో గులాబీ దళం
- పార్టీ అభ్యర్థిగా ఇప్పటికే ఏనుగుల రాకేశ్‌రెడ్డి నామినేషన్
- ప్రచార వ్యూహంపై దృష్టి సారించిన నేతలు
- నేడు మూడు జిల్లాల ముఖ్య నేతలతో కేటీఆర్ భేటీ

- వివరాలు 2లో

ఊరకుక్క దాడిలో చిన్నారి దుర్మరణం

వికారాబాద్ జిల్లా తాండూరులో దారుణం

- ఐదు నెలల బాలుడి మెడ, కన్ను భాగంలో కరిచిన కుక్క
- తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో మృతి చెందిన చిన్నారి
- తల్లిదండ్రులు ఇంట్లో లేని సమయంలో ఘటన
- కుక్కను కొట్టి చంపిన కార్మికులు



సాయినాథ్ (ఫైల్)

- వివరాలు 3లో

ధాన్యానికి 'తేమ' కొర్రీ

కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల పాట్లు

- 17 శాతం తేమ వస్తేనే కాంటా వేస్తామంటున్న నిర్వాహకులు
- అకాల వర్షాలతో రెండు మూడుసార్లు తడిసిన ధాన్యం
- అమలుకు నోచుకోని పౌరసరఫరాల శాఖ హామీలు
- మళ్లీ వర్ష సూచనతో ఆందోళనలో రైతాంగం



ఈ చిత్రంలోని రైతు దంపతులు మీసా పరుశరాములు, రేణుక (రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్) 2.20 ఎకరాల సొంత భూమితో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశారు. పండిన ధాన్యాన్ని 17 రోజుల క్రితం ముస్తాబాద్‌లోని కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. కానీ ఇప్పటివరకు కొనుగోలు చేయలేదు. అప్పట్నుంచి ఇప్పటివరకు మూడుసార్లు వర్షాలతో ధాన్యం తడిసింది. ఇప్పుడు 17% తేమ వచ్చే వరకు కొనలేమని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టడం, ఈలోగా మళ్లీ వర్షం పడటం, మళ్లీ ఆరబెట్టడం నిత్యకృత్యంగా మారడంతో ఈ దంపతులు లబోదిబోమంటున్నారు.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



ఎందుకయ్యా అంత టెన్షన్! మర్చిపోయింది దూదేగా కత్తెర కాదుగా!

క్లుప్తంగా...

ఇండియా కూటమి అధికారం చేపట్టడం ఖాయం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధీమా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విక్రమార్క. చిత్రంలో శ్రీధర్‌బాబు తదితరులు

కాటారం: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించి ఇండియా కూటమి అధికారం చేపట్టడం ఖాయమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలింగ్ సరళిని బట్టి రాష్ట్రంలో 12 నుంచి 14 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడలో శ్రీదత్తాత్రేయ స్వామి ఆలయ వార్షికోత్సవంలో భట్టి పాల్గొన్నారు. అనంతరం శ్రీధర్‌బాబు ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో భట్టి మాట్లాడారు. దేశ సంపద, ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమని విశ్వసించి ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేశారన్నారు.

ఒడిశా ఎన్నికల ప్రచారానికి భట్టి

లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం ఢిల్లీ వెళ్లారు. బుధవారం ఉదయం ఆయన రాహుల్‌గాంధీతో కలిసి ఒడిశాలో ఎన్నికల ప్రచారానికి వెళ్తారు. ఒడిశాలోని బొలంగిర్ లోక్‌సభ పరిధిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో రాహుల్‌గాంధీతో కలిసి భట్టి వెళ్లనున్నారు.

కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనం ఖాయం

రుణమాఫీ చేయకపోతే ఆగస్టు సంక్షోభం తప్పదు: కె.లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ విలీనం కావడం ఖాయమని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్ జోస్యం చెప్పారు. ఇప్పుడు బీఆర్ఎస్ అనేది చచ్చినపాము అని, రిపేరుకు వెళ్లిన కారు గ్యారేజ్ నుంచి తిరిగి వచ్చే అవకాశం లేదన్నారు. మంగళవారం లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నేల విడిచి సాము చేసినా, పెద్ద ఎత్తున ఉచితాలు, గ్యారంటీలు ఇచ్చినా ప్రజలు నమ్మలేదని చెప్పారు. దేవుళ్లపై ఒట్టు పెట్టిన రేవంత్‌రెడ్డి ఆగస్టులోపు రైతులకు రుణమాఫీ చేయకపోతే కాంగ్రెస్ పార్టీకి ఆగస్టు సంక్షోభం తప్పదని హెచ్చరించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి తుందన్న సీఎం రేవంత్‌రెడ్డి చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదని చెప్పారు. హామీలు అమలు చేయకపోతే ప్రజలు కాదు, కాంగ్రెస్ నేతలే తిరగబడుతారని లక్ష్మణ్ హెచ్చరించారు.

లక్ష్మణ్ ఎంపీనా.. జోతిష్య పండితుడా?

ఐదేళ్లు మా పాలన ఖాయం: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని, బీఆర్ఎస్ కాంగ్రెస్‌లో విలీనం అవుతుందని మాట్లాడుతున్న బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్‌కు పొలిటికల్ చిప్ దొబ్బిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో ఆగస్టు సంక్షోభం వస్తుందని మూడు నెలల ముందే చెబుతున్న లక్ష్మణ్ ఎంపీనా, జోతిష్య పండితుడా అని ప్రశ్నించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, చరణ్ కౌశిక్ యాదవ్‌లతో కలిసి మాట్లాడారు. ఎవరెన్ని కుట్రలు చేసినా..ఎవరెన్ని మాట్లాడినా కాంగ్రెస్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు ప్రస్తుతం 65 సీట్లు ఉన్నాయని, బీఆర్ఎస్ నుంచి 20 మంది వచ్చే అవకాశముందని, బీజేపీ నుంచి నలుగురైదుగురు వస్తే తమ బలం 90 అవుతుందని, అప్పుడు ప్రభుత్వం ఎలా పడిపోతుందని ప్రశ్నించారు. లక్ష్మణ్ చిప్ బాగుచేసుకునేందుకు ఖర్చు తానే భరిస్తానని, అంతకంటే తానేం చేయలేనన్నారు.

అత్యధిక ఎంపీ సీట్లు మావే

బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి



సాక్షి, హైదరాబాద్: ఆదిలాబాద్ ఎంపీ సీటు సహా తెలంగాణలో బీజేపీ అత్యధిక ఎంపీ స్థానాలను గెలవబోతోందని ఆ పార్టీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చెప్పారు. ఈ విషయంలో తాను ఏ చర్చకైనా సిద్ధమేనన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ తర్వాత కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటల్లో మార్పు కనిపిస్తోందని, పోలింగ్‌కు ముందు 14 ఎంపీ సీట్లు గెలుస్తామ ని చెప్పిన వారే ఇప్పుడు 9 సీట్లు గెలుస్తామని అంటున్నారని చెప్పారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లిందని చెప్పారు. మరోసారి కేంద్రంలో బీజేపీకే అధికారం దక్కబోతోందన్నారు.

ఇక ‘పట్టభద్రుల’ పరీక్ష

మండలి ఉప ఎన్నికపై బీఆర్ఎస్ ఫోకస్

- ‘వరంగల్ – ఖమ్మం – నల్లగొండ’ ఎమ్మెల్సీ స్థానానికి 27న ఎన్నిక
- సిట్టింగ్ సీటును తిరిగి కైవసం చేసుకోవాలనే పట్టుదలతో గులాబీ దళం
- పార్టీ అభ్యర్థిగా ఇప్పటికే ఏనుగుల రాకేశ్‌రెడ్డి నామినేషన్
- ప్రచార వ్యూహంపై దృష్టి సారించిన నేతలు
- నేడు మూడు జిల్లాల ముఖ్య నేతలతో కేటీఆర్ భేటీ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ముగియడంతో ఈ నెల 27న జరిగే శాసనమండలి పట్టభద్రుల కోటా ఉప ఎన్నికపై బీఆర్ఎస్ దృష్టి సారించింది. ‘వరంగల్–ఖమ్మం–నల్లగొండ’ పట్టభద్రుల స్థానం అభ్యర్థిగా వరంగల్‌కు చెందిన ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ సిట్టింగ్ స్థానం కావడంతో తిరిగి కైవసం చేసుకోవడాన్ని బీఆర్ఎస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఈ నేపథ్యంలోనే లోక్‌సభ పోలింగ్ ముగిసిన వెంటనే రంగంలోకి దిగింది. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలు, పార్టీ ఎమ్మెల్యేలతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు బుధవారం కీలక భేటీ ఏర్పాటు చేశారు. పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు ఈ భేటీ జరుగుతుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

ప్రచార వ్యూహంపై దిశా నిర్దేశం



ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ నుంచి జనగామ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2027 ఏప్రిల్ వరకు అవకాశం ఉన్నా ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో 27న ఉప ఎన్నిక జరగనుంది. పోలింగ్‌కు కేవలం 12 రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో ముమ్మర ప్రచారం నిర్వహించేలా కేటీఆర్ బుధవారం జరిగే భేటీలో దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రచార, సమన్వయ బాధ్యతల్లో కీలకంగా వ్యవహరించనున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా ప్రచారాన్ని సమన్వయం చేస్తారు. మూడు జిల్లాల్లో సుమారు 4.61 లక్షల మంది పట్టభద్రులైన ఓటర్లు ఉన్నారు. వీరిలో ప్రభుత్వ ఉద్యోగులు, యువకులు, మహిళలు కీలకం కాబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయా వర్గాలను లక్ష్యంగా చేసుకుని సాగించాల్సిన ప్రచారంపై బీఆర్ఎస్ వ్యూహాన్ని ఖరారు చేస్తోంది. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీలకు గ్రామాలు, మండలాల వారీగా ఓటర్ల జాబితాను అందజేసి వారితో సమావేశాలు నిర్వహించాలని భావిస్తోంది.

లోక్‌సభ పోలింగ్ సరళిపై సమీక్ష

రెండురోజుల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సరళిపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంగళవారం కూడా సమీక్షించారు. ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో ఉన్న కేసీఆర్‌ను పలువురు బీఆర్ఎస్ అభ్యర్థులతో పాటు పార్టీ నేతలు కలిశారు. పార్లమెంటు సెగ్మెంట్ల వారీగా పోలింగ్ సరళిపై ఈ సందర్భంగా ఆయన ఆరా తీశారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓటర్లు ఎటు వైపు మొగ్గుచూపారనే కోణంలో చర్చ జరిగింది. కాగా మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తామనే ధీమా కేసీఆర్ వ్యక్తం చేసినట్లు నేతలు వెల్లడించారు.

ఆ రెండు పార్టీల కంటే ఎక్కువ సీట్లు సాధిస్తాం

- కేంద్రంలో ప్రాంతీయ శక్తులదే నిర్ణయాత్మక పాత్ర: కేటీఆర్
- తెలంగాణ ప్రయోజనాలకు బీఆర్ఎస్సే శ్రీరామరక్ష
- ఐదు నెలల్లో కాంగ్రెస్ ప్రజల నమ్మకం కోల్పోయింది
- బీజేపీ, కాంగ్రెస్‌లది ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అని వ్యాఖ్య



సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్

సిరిసిల్ల: జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల కంటే బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ సీట్లు వస్తాయని.. రేపు కేంద్రంలో ప్రాంతీయ శక్తులే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. మంగళవారం సిరిసిల్లలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని చెప్పారు. రైతుల రుణాలను మాఫీ చేయకుండా, రూ.500 బోనస్, మహిళలకు రూ.2,500, పెన్షన్లు రూ.4 వేలకు పెంపు, తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు తదితర హామీలు ఏమయ్యాయని నిలదీశారు. జనవరి నెల పెన్షన్లు కూడా ఇవ్వకుండా మింగేశారని ఆరోపించారు. కొత్త జిల్లాల రద్దు, మేడిగడ్డ కుంగుబాటు, శ్వేతపత్రం, ఫోన్ ట్యాపింగ్ అంటూ.. కాంగ్రెస్ ఐదు నెలల పాటు టైంపాస్ పాలన సాగించిందని మండిపడ్డారు. ఈనాడైనా, ఏనాడైనా.. తెలంగాణకు బీఆర్ఎస్ పార్టీయే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు.

వారిది ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ..

కాంగ్రెస్, బీజేపీ రెండూ ఢిల్లీలో కుస్తీ.. గల్లీలో దోస్తీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు. ఆ రెండు పార్టీలు తమ నేతలను చేర్చుకుని టికెట్లు ఇచ్చాయని.. ఒకదానికితోడుగా మరొకటి లోక్‌సభ ఎన్నికల్లో డమ్మీ అభ్యర్థులను బరిలో దింపాయని విమర్శించారు. జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కరీంనగర్‌లో పోటీ చేస్తానంటే నిజామాబాద్ బరిలో దింపారని.. కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో ఎవరికీ తెలియదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు కిషన్‌రెడ్డి కంటే ఎక్కువగా రేవంత్‌రెడ్డి కష్టపడ్డారని వ్యాఖ్యానించారు. ఎన్డీఏ, ఇండియా కూటముల కంటే ప్రాంతీయ పార్టీల కూటమి ఎక్కువ సీట్లు సాధిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రాంతీయ పార్టీల హవా కొనసాగుతుందని,. అందులో వైఎస్సార్‌సీపీ, బిజూ జనతాదళ్, బీఆర్ఎస్ పార్టీలు భాగస్వాములవుతాయని కేటీఆర్ చెప్పారు.

కేసీఆర్ బస్సుయాత్ర ఎన్నికలను మలుపు తిప్పింది

రాష్ట్రంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 17 రోజుల పాటు 30 చోట్ల చేసిన బస్సుయాత్ర, రోడ్ షోలు లోక్‌సభ ఎన్నికలను మలుపు తిప్పాయని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ రాష్ట్రంలో ఏ జిల్లాకు, ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. కేసీఆర్ కాలుపెట్టిన ప్రతి చోట ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు గులాబీ సైన్యం గుండెల నిండా ఆత్మవిశ్వాసం కనిపించిందన్నారు. కేసీఆర్ రెండు జాతీయ పార్టీలకు ముచ్చెమటలు పట్టించారని చెప్పారు. రుణమాఫీ చేయని రేవంత్‌రెడ్డి తారీకులు మార్చుతూ, దేవుళ్లపై ఒట్టు వేస్తూ.. కాంగ్రెస్‌పై నమ్మకం లేని పరిస్థితిని తెచ్చారని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరెంట్, తాగునీటి సమస్యలు మొదలయ్యాయని.. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండేది అనే పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి బాగుండదన్నారు. సమావేశంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

13 సీట్లు మాకే!

కాంగ్రెస్ పార్టీ ధీమా

- వివిధ స్థాయిల్లో సేకరించిన అభిప్రాయాల నేపథ్యంలో అంచనా
- అన్ని నియోజకవర్గాల్లో అనుకూల ఓటింగ్ జరిగిందన్న నేతలు
- పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులతో సీఎం రేవంత్ సమీక్ష

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల్లో అంచనాలకు అనుగుణంగా మెరుగైన ఫలితాలను సాధిస్తామని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. వివిధ స్థాయిల్లో అభిప్రాయ సేకరణ తర్వాత 13 లోక్‌సభ స్థానాల్లో విజయ కేతనం ఎగురవేస్తామనే తుది అంచనాకు వచ్చింది. మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తన నివాసంలో పార్టీ ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులు, నియోజకవర్గాల ముఖ్య నేతలతో మాట్లాడి పోలింగ్ సరళిని సమీక్షించారు. ఏయే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు బీజేపీ, బీఆర్ఎస్ పోటీ ఇచ్చాయో ఆరా తీశారు. అన్నిచోట్లా కాంగ్రెస్‌కు అనుకూలంగా ఓటింగ్ జరిగిందని, వంద రోజుల కాంగ్రెస్ ప్రజా పాలనకు ఓటేసేందుకు ప్రజలు మొగ్గుచూపారని నేతలు పేర్కొన్నట్టు తెలిసింది. మొత్తం మీద అన్నివర్గాల నుంచి సానుకూలత వ్యక్తమైందనే అంచనాకు వచ్చారు.

పెరగనున్న ఓట్ల శాతం!

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓట్ల శాతం పెరుగుతుందని పార్టీ నేతలు ధీమా వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 39.40 శాతం ఓట్లు రాగా, ఇప్పుడు 4 నుంచి 5 శాతం వరకు పార్టీ ఓటు బ్యాంకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషించారు. వివిధ సర్వే సంస్థల నుంచి అందిన ఫీడ్ బ్యాక్ ప్రకారం 13 సీట్లలో కాంగ్రెస్ అభ్యర్థులు పక్కాగా గెలిచే అవకాశాలున్నాయని పార్టీ అంచనాకు వచ్చింది. మిగతా నియోజకవర్గాల్లో ఫలితాలు అంచనాకు అందడం లేదనే అభిప్రాయానికి వచ్చింది.



గెలిచే స్థానాలు ఇవే..

నల్లగొండ, భువనగిరి, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, మెదక్, జహీరాబాద్, చేవెళ్ల, సికింద్రాబాద్ సీట్లలో పార్టీ అభ్యర్థులు గెలుస్తారని ముఖ్యమంత్రి రేవంత్ సహా నేతలు ధీమా వ్యక్తం చేశారు. మిగతా నియోజకవర్గాల్లో సానుకూలత ఉన్నప్పటికీ ఓటర్ల నాడి అంచనాకు చిక్కలేదనే అభిప్రాయానికి వచ్చారు. మల్కాజిగిరి, కరీంనగర్ వంటి చోట్ల బీజేపీ పోటాపోటీగా ఉందని, ఎవరు గెలిచినా స్వల్ప మెజారిటీతో గట్టెక్కుతారని పార్టీ నేతలు అభిప్రాయపడినట్లు తెలిసింది.

రెండో స్థానంలో బీజేపీ?

ఈ ఎన్నికల్లో కొన్ని నియోజకవర్గాల్లో బీజేపీ బలం పెరిగి అనూహ్యంగా రెండో స్థానానికి పోటీ పడిందని పార్టీ వర్గాలు తెలిపాయి. పెద్దపల్లి, వరంగల్, మెదక్, మహబూబాబాద్ లాంటి చోట్ల కూడా బీజేపీ రెండో స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నాయి. పలు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఓట్లే బీజేపీకి టర్న్ అయినట్లుగా పార్టీ నేతలు చెప్పినట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభావం అంతంత మాత్రమేనని వారు పేర్కొన్నట్లు తెలిసింది.

ఎమ్మెల్సీ ఉపఎన్నికపై సీఎం సమీక్ష

సాక్షి, హైదరాబాద్: నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరగనున్న ఉపఎన్నికపై సీఎం ఎ.రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. అందుబాటులో ఉన్న ఆ మూడు జిల్లాల ముఖ్య నాయకులతో మంగళవారం రాత్రి ఆయన తన క్యాంపు కార్యాలయంలో భేటీ అయ్యారు. క్షేత్రస్థాయిలో దృష్టి సారించి పనిచేయాలని, తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్లాలని సూచించారు. ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 34 అసెంబ్లీ స్థానాలుండగా, అందులో 33 చోట్ల కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఈ నేపథ్యంలో కీలకంగా వ్యవహరించి మంచి మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నను గెలిపించేందుకు కృషి చేయాలని సీఎం ఆయా జిల్లాల నేతలకు చెప్పారు.

10 పక్కా.. 12 వచ్చినా ఆశ్చర్యపోవద్దు!

- లోక్‌సభ ఓటింగ్ సరళిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సమీక్ష
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికపై సన్నాహక భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్ రెడ్డి. చిత్రంలో రామచంద్రరావు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి తక్కువలో తక్కువ పది సీట్లు గెలుస్తామని, ఓటర్ల నుంచి అంచనాలకు మించి స్పందన వ్యక్తమైనందున 12 స్థానాల్లో గెలిచినా ఆశ్చర్యం లేదనే ధీమా రాష్ట్ర బీజేపీలో వ్యక్తమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రధాని మోదీ ‘వేవ్’ స్పష్టంగా కనిపించిందని ముఖ్యనేతలు అభిప్రాయపడ్డారు. నాలుగు సిట్టింగ్ ఎంపీ సీట్లతోపాటు విజయావకాశాలు అంతగా లేదని మొదట్లో భావించిన సీట్లలోనూ బీజేపీ సత్తా చాటుతుందని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్, వరంగల్, పెద్దపల్లి వంటి సీట్లు కూడా వస్తాయని, ఎన్నడూ ఊహించనంత స్థాయిలో ఫలితాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ సందర్భంగా ప్రజలు బీజేపీని, మోదీని చూశారని, అభ్యర్థులు ఎవరనేది కూడా చూడలేదన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్యనేతలతో నిర్వహించిన సమావేశంలో ఓటింగ్ సరళిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లోని పరిస్థితులను నాయకులు వివరించారు. ఈ భేటీలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్, బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్ తివారీ (సంస్థాగత), బంగారు శ్రుతి, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేట్ ఎన్నికలపై చర్చ

పార్టీ కార్యాలయంలో నల్లగొండ–వరంగల్ – ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 27న జరగనున్న ఉపఎన్నికపై సన్నాహక సమావేశం జరిగింది. పోలింగ్‌కు సమయం తక్కువగా ఉన్నందున ఈ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో ఇన్‌చార్జీలను నియమించుకుని, అన్ని మండలాల్లో పార్టీ నాయకులు పర్యటించేలా కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ ఎన్నిక కోసం ఎన్.రామచంద్రరావును ఇన్‌చార్జీగా నియమించారు. పార్టీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి బరిలో ఉన్న ఈ ఎన్నికకు సంబంధించిన కసరత్తు అంతా ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంగా నిర్వహించాలని నిర్ణయించారు.

మన పెళ్లికి ఒప్పుకోరు.. ఇద్దరం చనిపోదాం

- బాలికకు పురుగు మందు తాగించి.. తాను తాగినట్టు నటించిన యువకుడు
- చికిత్స పొందుతూ బాలిక మృతి.. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన


బల్మూర్: బాలికను ప్రేమ పేరుతో వంచించాడు. పెళ్లికి పెద్దలు అడ్డు చెబుతారని ఆమెను నమ్మించి ఆత్మహత్యకు ప్రేరేపించాడు. చివరకు ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ ఘటనకు సంబంధించి బాలిక కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. బల్మూర్‌కు చెందిన రాఘవేందర్ అదే గ్రామానికి చెందిన బాలిక(15) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. అయితే పెళ్లికి కుటుంబసభ్యులు అడ్డు చెబుతున్నారని రాఘవేందర్ ఈ నెల 11న గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్దకు బాలికను తీసుకెళ్లాడు. నువ్వు మైనర్.. పెళ్లికి మా ఇంట్లో ఒప్పుకోవడం లేదు. ఇద్దరం కలిసి పురుగు మందు తాగి చనిపోదామని చెప్పాడు. వెంట తెచ్చిన పురుగు మందును మొదటగా ఆమెకు తాగించి, తాను కూడా తాగినట్టు నటించాడు. బాలిక అపస్మారక స్థితికి చేరుకోగానే మరో యువకుడి సహాయంతో బాలికను బైక్‌పై అచ్చంపేట ఆస్పత్రికి తరలించాడు. ఆపై బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంలో మెరుగైన వైద్యం కోసం ఆమెను నిమ్స్‌కు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ ఆ బాలిక సోమవారం రాత్రి మృతి చెందింది. అయితే తమ కూతురుతో బలవంతంగా పురుగు మందు తాగించాడని బాలిక కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

పరిహారంగా రెండెకరాల భూమి

బాలిక మృతిపై బల్మూర్‌లో పంచాయితీ పెట్టిన గ్రామపెద్దలు, కులస్తులు రెండెకరాల భూమి పరిహారంగా ఇవ్వాలని తీర్మానించినట్టు తెలిసింది. రాఘవేందర్ తండ్రికి ఉన్న భూమిలో రెండు ఎకరాలు బాలిక తరపున బంధువు పేరుపై రిజిస్ట్రేషన్ చేయాలని కాగితాలు రాసుకొని ధరణిలో స్లాట్ కూడా మంగళవారం బుక్ చేసినట్టు సమాచారం. భూమి మార్పిడి జరిగిన వెంటనే ఆస్పత్రిలో ఉన్న మృతదేహానికి ఆత్మహత్య కేసుగా నమోదు చేయించి ఇంటికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించాలని ఒప్పందం చేసుకున్నట్టు తెలిసింది. ఈ విషయమై ఎస్‌ఐ బాలరాజును వివరణ కోరగా బాలిక ఆత్మహత్యపై తమకు ఫిర్యాదు అందలేదని చెప్పారు.

జూన్ 4న కేసీఆర్ డాక్టర్లను పక్కన పెట్టుకోవాలి

- కరీంనగర్ ఫలితాలు షాక్ ఇవ్వబోతున్నయ్
- ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు అడ్డదారులు తొక్కారు: బండి సంజయ్



కరీంనగర్ టవర్‌సర్కిల్‌లో టీ తాగుతున్న సంజయ్

కరీంనగర్ టౌన్: జూన్ 4న వెలువడే ఫలితాలు కరీంనగర్‌లో కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు షాక్ ఇవ్వబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంగళవారం రాత్రి కరీంనగర్‌లోని టవర్ సర్కిల్ వద్ద ఆయన పర్యటించారు. అక్కడున్న వ్యాపారులతో కాసేపు ముచ్చటించారు. సమీపంలోని టీస్టాల్ వద్ద కార్యకర్తలతో కలిసి టీ తాగారు. అనంతరం మాట్లాడుతూ, తనను ఓడించేందుకు ముస్లింలంతా ఏకం కావాలంటూ కేసీఆర్ పిలుపునిచ్చారని, హిందువులంతా ఏకమైతే ఏ విధమైన ఫలితాలు వస్తాయో జూన్ 4న తేలుతుందన్నారు. ఆ ఫలితాలను చూసి తట్టుకునే శక్తి కేసీఆర్‌కు ఉండాలని కోరుకుంటున్నానని, ఆరోజు ఆయన ఇద్దరు డాక్టర్లను పక్కన పెట్టుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ఎన్నికల్లో గెలవడం కోసం కాంగ్రెస్ అడ్డదారులు తొక్కిందని, మోదీపైనా, బీజేపీపైనా విషం చిమ్మడం ద్వారా ప్రజలను తీవ్రమైన భయాందోళనలకు గురిచేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

ఎవరి లెక్క వారిదే!

▶ మొదటి పేజీ తరువాయి

తేల్చుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

పెరిగినది పాజిటివ్ ఓటింగేనంటున్న కాంగ్రెస్

ఐదు నెలల కిందటి అసెంబ్లీ ఎన్నికల్లో తమకు పాజిటివ్ ఓటింగ్ జరిగిందని.. ప్రస్తుతం పెరిగిన ఓటింగ్ శాతం కూడా ప్రభుత్వ అనుకూల ఓటేనని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఆరు గ్యారంటీల్లో ఐదింటిని అమలు చేశామని అంటున్నాయి. ప్రధానంగా మహిళలకు ఉపయోగపడే ఉచిత బస్సు, రూ.500కే సిలిండర్లతోపాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ.10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ పెంపు, ఎన్నికలకు ముందే రైతుభరోసా నిధులు వెళ్లడం, రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి ఒట్టు వేసి మరీ ప్రకటించడం వంటివి పాజిటివ్ టాక్ తెచ్చాయని.. అవి ఓట్ల రూపంలో కాంగ్రెస్‌కే దక్కాయని నేతలు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే.. లోక్‌సభ ఎన్నికల్లో తమకు ఓటింగ్ శాతం పెరుగుతుందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీనిచ్చిన బీఆర్ఎస్.. లోక్‌సభ ఎన్నికల్లో పోటీలో లేకుండా పోయిందని చెప్తున్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్న ప్రచారం బాగానే ప్రభావం చూపిందని అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌కు పన్నెండు నుంచి 13 సీట్లు లభిస్తాయని పేర్కొంటున్నారు.

బాగా బలోపేతం అయ్యామంటున్న బీజేపీ..

లోక్‌సభ ఎన్నికలతో రాష్ట్రంలో మరింతగా బలోపేతం అయ్యామని, ప్రధాన రాజకీయ శక్తిగా ఎదిగామని బీజేపీ నేతలు చెప్తున్నారు. ప్రధాని మోదీపై అభిమానం, కేంద్రం గత పదేళ్లుగా అందించిన నీతివంతమైన పాలనకు తగిన ప్రతిఫలం తమకు లభిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మారుస్తుందని, రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్‌రెడ్డి, ఇతర కాంగ్రెస్ నేతలు ఎంతగా ప్రచారం చేసినా ప్రజలు నమ్మలేదని అంటున్నారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న తాము రాజ్యాంగం జోలికి కానీ, రిజర్వేషన్ల జోలికి కాని వెళ్లని విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని వివరిస్తున్నారు. ఈసారి రాష్ట్రంలో మోదీ మేనియా బాగా వర్కౌట్ అయిందన్న ధీమా వ్యక్తం చేస్తున్నారు. మోదీ, అమిత్ షా సహా జాతీయ నాయకులు విస్తృతంగా ప్రచారంలో పాల్గొనడం.. క్షేత్రస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయడం కలసి వచ్చిందని అంటున్నారు. ఈసారి రాష్ట్రంలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లు ఖాయమని ధీమాగా చెప్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్‌కు బీజేపీకి అనుకూలంగా ఉందని.. అసెంబ్లీ ఎన్నికల్లోకు ఓటేయని వర్గాలు కూడా లోక్‌సభ ఎన్నికల్లో ముందుకు వచ్చి తమకు ఓటు వేశాయని అంటున్నారు.

కేసీఆర్ బస్సుయాత్ర ఊపుతో..

లోక్‌సభ ఎన్నికల్లో త్రిముఖ పోటీ తమకు లాభిస్తుందని బీఆర్ఎస్ పార్టీ అంచనా వేస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రకు ప్రజల్లో విశేష స్పందన లభించిందని ఆ పార్టీ ముఖ్యులు చెప్తున్నారు. రాష్ట్రంలో కరెంటు కోతలు, సాగునీటి ఇబ్బందులు, జిల్లాల రద్దు వంటి అంశాలతోపాటు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమల్లో కాంగ్రెస్ వైఫల్యం ఆ పార్టీపై వ్యతిరేకతను పెంచిందని అంటున్నారు. ప్రజలు కేసీఆర్ ప్రభుత్వం ఉంటేనే బాగుండేదన్న అభిప్రాయానికి వచ్చారని, ఇది తమకు సానుకూలంగా మారిందని అంటున్నారు. రెండు జాతీయ పార్టీలకు నేరుగా తమతోనే పోటీ జరిగిందని చెప్తున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ స్థానం ఎక్కడికీ పోలేదని, కాంగ్రెస్, బీజేపీలకు ముచ్చెమటలు పట్టించామని పేర్కొంటున్నారు. ఆ రెండు పార్టీలు పారాచూట్ లీడర్లకే ఎక్కువ టికెట్లు ఇవ్వడం కూడా.. కార్యకర్తలు, నేతల్లో అసంతృప్తిని రగిలించిందని అంటున్నారు.

సర్వేలకు అందని ఫలితాలొస్తాయి

బీజేపీ అఖండ విజయం ఖాయం: ఈటల



సాక్షి, హైదరాబాద్: జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాల్లో సర్వే సంస్థల అంచనాలకు కూడా అందని విధంగా, ఊహించని రీతిలో బీజేపీ అఖండ విజయం సాధించబోతోందని బీజేపీ నేత, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. నరేంద్రమోదీని మరోసారి ప్రధానిని చేయాలనే లక్ష్యంతో అన్ని వర్గాల ప్రజలు ఈ ఎన్నికలలో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ శక్తివంతంగా రూపుదిద్దుకుందన్నారు. తాను మల్కాజిగిరి నుంచి కచ్చితంగా గెలుస్తాననే విశ్వాసాన్ని ఆయన వెలిబుచ్చారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, ఎక్కడా బాంబు పేలుళ్లు, ఉగ్రదాడులు లేకుండా అందరూ ప్రశాంతంగా జీవిస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి తెలంగాణలో బీజేపీ 12 ఎంపీ స్థానాలను గెలుచుకుంటుందని చెప్పిన విషయాన్ని ఈటల గుర్తుచేశారు. ఇది వందకు వందశాతం నిజం కాబోతోందన్నారు. విపక్ష కూటమిలో చేరి కీలకపాత్ర పోషిస్తామంటూ మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని ఈటల పేర్కొన్నారు. ఇకపై రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు ఎలాంటి భవిష్యత్ లేదని తెలిపారు.

క్లుప్తంగా...

సగర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి: ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): సగర ఫెడరేషన్‌ను కార్పొరేషన్‌గా మార్చి రూ.500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ప్రతి సగర కుటుంబానికి రూ.20 లక్షలు ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం భగీరథ జయంత్యుత్సవాలను బీసీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సగరులను బీసీ–డీ గ్రూప్ నుంచి ఏ గ్రూప్‌కు మార్చాలని సగర, ఉప్పర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేశ్‌సాగర్, బీసీ జాతీయ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, విజయేంద్రసాగర్ డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణలో 8 లక్షలకు పైగా సగరులు ఉన్నారని, వారిని బీసీ–ఏ గ్రూప్‌లోకి మార్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు సాగర్, పార్థ సారథి, జనార్దన్ పాల్గొన్నారు.

వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: వీఐటీ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ విశ్వనాథన్‌ను న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన విశ్వనాథన్ ఎంపీగా, మంత్రిగా పలు పదవులు చేపట్టారు. విద్యారంగంలో పలు ఉన్నత పదవుల్లో సేవలందించారు. ఈనెల 10వ తేదీన బింగమ్టన్ వర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ వర్సిటీ చాన్స్‌లర్ హార్వే స్టింగర్ చేతులమీదుగా విశ్వనాథన్ డాక్టరేట్ స్వీకరించారు. కార్యక్రమంలో వీఐటీ వైస్ ప్రెసిడెంట్స్ శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వం, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథన్, శ్రీనివాసన్ పాల్గొన్నారు.

సీఎంకు లీగల్ సెల్ కృతజ్ఞతలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించినందుకు కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పొన్నం అశోక్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. త్వరలోనే సీఎం నిధులు విడుదల చేసే అవకాశం ఉందన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందనడానికి సీఎం నిర్ణయమే నిదర్శనమని స్పష్టం చేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో 14 మంది మావోయిస్టుల అరెస్ట్

మరో ఘటనలో 30 మంది లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 14 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. బీజాపూర్ జిల్లా గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్వాండి–పిడియా అటవీ ప్రాంతాల్లో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా చూసి పారిపోయేందుకు యత్నించిన వారిని పట్టుకుని విచారించగా, వారంతా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నట్లు అంగీకరించారు. దీంతో అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 30 మంది మావోయిస్టులు మంగళవారం లొంగిపోయారని జితేంద్రకుమార్ తెలిపారు. లొంగిపోయిన 30 మందిలో 9 మందిపై రూ.39 లక్షల రివార్డులు ఉన్నాయని వెల్లడించారు.

ధాన్యానికి 'తేమ' కొర్రీ

కొనుగోలు కేంద్రాల్లో రైతన్నల పాట్లు

సాక్షి, హైదరాబాద్: తడిచిన ధాన్యాన్ని సైతం కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఆ శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఇచ్చిన హామీలు క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటూ రైతులు రోజుల తరబడి వేచి చూస్తున్నా.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు 17 శాతం తేమ వచ్చేదాకా ధాన్యం కాంటా వేయలేమని కరాఖండిగా చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం ఇప్పటికే చాలాసార్లు తడిచింది. ధాన్యం తడవడం, రైతులు ఆరబెట్టేందుకు అష్టకష్టాలూ పడటం నిత్యకృత్యమైంది. మరోవైపు రాష్ట్రంలో వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ చేస్తున్న సూచనలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.



45 రోజుల్లో 27 ఎల్‌ఎంటీలే సేకరణ

రాష్ట్రంలో గత 15 రోజుల నుంచి అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. అకస్మాత్తుగా కురుస్తున్న వర్షాలు రైతుల పంటను నీళ్లపాలు చేస్తున్నాయి. వర్షం పడిన ప్రతిసారీ పౌరసరఫరాల శాఖ తడిచిన ధాన్యం కొంటామనే హామీ ఇవ్వడమే తప్ప అమలుపై శ్రద్ధ చూపించడం లేదు. దీంతో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటికే రైతుల వడ్లు పలుమార్లు నీళ్లలో తడిశాయి. చాలాచోట్ల ధాన్యం వరదల్లో కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్లు మొదలై 45 రోజులు దాటినప్పటికీ, ఇప్పటివరకు 27 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించింది. నల్లగొండ, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలతో పాటు ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో సైతం కోతలు దాదాపుగా ముగిశాయి. వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో కోతలు కొంత ఆలస్యం అయ్యాయి. అయితే వరి కోసి ధాన్యాన్ని

> అకాల వర్షంతో తడిచిన ధాన్యం గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తాం. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటాం.
>
> – ఇటీవల హైదరాబాద్‌లో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మరోవైపు కొంచెం తేమ శాతం ఎక్కువగా ఉన్నా మిల్లర్లు ధాన్యాన్ని తీసుకోవడం లేదు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత ధాన్యం రంగు మారినా తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. అలాంటి ధాన్యం లోడ్‌లు

మిల్లర్ల కొర్రీలు

మిల్లులకు వస్తే నేరుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైతులకు ఫోన్లు చేసి వచ్చి ధాన్యాన్ని తీసుకోబోమని తేల్చిచెబుతున్నారు. తీసుకునే పక్షంలో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల తరుగు తీయాల్సి ఉంటుందంటూ మెలిక పెడుతున్నారు. ధాన్యం కాంటాకే ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు విధిలేని పరిస్థితుల్లో మిల్లర్లు చెప్పినట్లు వింటూ దోపిడీకి గురవుతున్నారు. ఇప్పటికైనా పౌర సరఫరాల శాఖ ఈ అంశంపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

నేరుగా కొనుగోలు కేంద్రాలకు తెస్తున్న రైతులు అక్కడే ఆరబెట్టి, తమ వంతు వచ్చేంత వరకు కాంటా కోసం వేచిచూస్తున్నారు. రైతుల పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ ఫోన్ నంబర్‌తో లింక్ అయితేనే కొనుగోళ్లు జరుపుతుండడంతో కొందరు రైతులతో పాటు కౌలు రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముఖ్యంగా తేమ 17 శాతానికి చేరుకునే వరకు వేచి ఉండాలని చెబుతుండటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

నేడు కడెం ప్రాజెక్టుకు అధికారుల బృందం

పనుల పరిశీలన, ఆపై సమీక్ష

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం బుధవారం కడెం ప్రాజెక్టును సందర్శించనుంది. ముందుగా పనులను పరిశీలించి, ఆ తర్వాత అక్కడే సమీక్ష నిర్వహించి అవసరమైన ఆదేశాలు జారీ చేస్తారు. గతేడాది కడెంనదికి భారీ వరదలు రావడంతో ప్రాజెక్టు తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ప్రాజెక్టు నుంచి నీటివిడుదల చేసే స్పిల్‌వే సామర్థ్యానికి మించి వరదలు రాగా, 18 గేట్లకుగాను 14 గేట్లు మాత్రమే పైకి లేపి నీళ్లను కిందికి విడుదల చేయగలిగారు. రెండు గేట్ల రోప్స్ తెగిపోగా, మరో రెండు గేట్ల కౌంటర్ వాల్స్ కొట్టుకుపోయాయి. దీంతో కడెం ప్రాజెక్టు గేట్లపై నుంచి వరదనీళ్లు పొంగిపొర్లాయి. త్వరలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో దెబ్బతిన్న ఐదు గేట్లకు ప్రభుత్వం మరమ్మతులు చేపట్టింది.

యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధాన్యం బస్తాలతో ఆందోళన

మిల్లులకు తరలించలేదని రైతుల ఆగ్రహం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

భువనగిరి రూరల్: ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మండలంలోని ఆకుతోటబావి తండాకు చెందిన గిరిజన రైతులు వడ్ల బస్తాలతో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. 10 రోజులుగా ధాన్యం కొనుగోలు చేయకపోవడం, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీలు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఆగ్రహించారు. దీంతో మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధాన్యం బస్తాలతో మహిళా సంఘాల సభ్యులు, మహిళా రైతుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్పందించిన అధికారులు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నెలాఖరు నుంచి ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాలు

- సీపేజీ కట్టడికి కసరత్తు ముమ్మరం
- నవంబర్‌లో రెండు వైపుల నుంచీ తవ్వకాలు
- నిర్మాణ సంస్థకు రూ.50 కోట్లు చెల్లించిన సర్కారు
- జాప్యంతో అంచనా వ్యయం పెంపునకు ప్రతిపాదనలు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమగట్టు కాల్వ (ఎస్‌ఎల్‌బీసీ) సొరంగం తవ్వకాల పనులను జలాశయం వైపు నుంచి నెలాఖరులోగా పునః ప్రారంభిస్తామని నిర్మాణ సంస్థ నీటిపారుదల శాఖకు తెలిపింది. తవ్వకాలకు అడ్డంకిగా ఉన్న సీపేజీ కట్టడికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) సహకారం తీసుకుంటున్నారు. సీపేజీ ఎంత దూరం ఉందనే విషయాన్ని గుర్తించి, దాన్ని కట్టడి చేసే పనులను ప్రస్తుతం చేస్తున్నారు. ఇది పూర్తికాగానే ఇన్‌లెట్ వైపు నుంచి సొరంగం తవ్వకాలను నెలాఖరులోగా ప్రారంభిస్తామని నిర్మాణ సంస్థ తెలిపింది. ఇక ఔట్‌లెట్ వైపు ఉన్న టన్నెల్ బోరింగ్ మిషన్ (టీబీఎం)లో పాడైపోయిన బేరింగ్‌లను మార్చడానికి కొత్తవాటిని తెప్పించారు. మరమ్మతులు పూర్తిచేసి, నవంబర్‌లో ఔట్‌లెట్ వైపు (మన్నెవారిపల్లి–అచ్చంపేట) నుంచి సొరంగం తవ్వకాలు ప్రారంభిస్తామని నిర్మాణ సంస్థ తెలిపింది. నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్ కుమార్ నేతృత్వంలోని కమిటీ సిఫారసులకు అనుగుణంగా ప్రభుత్వం రూ.50 కోట్లను నిర్మాణ సంస్థకు విడుదల చేసింది. పనుల్లో జాప్యం కారణంగా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.3,150 కోట్ల నుంచి రూ.4,468 కోట్లకు పెంచాలని నీటిపారుదల శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. త్వరలో అంచనా వ్యయం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉంది.

టార్గెట్ 33 నెలలు..

నవంబర్ నాటికి రెండు వైపుల నుంచి సొరంగం తవ్వకాలు ప్రారంభమైతే నెలకు 300 మీటర్ల చొప్పున 33 నెలల్లో సొరంగం తవ్వకాలు పూర్తి చేయగలమని నిర్మాణ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. 2005లో నాటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం 43.93 కిలోమీటర్ల ఎస్‌ఎల్‌బీసీ సొరంగం తవ్వకాలను ప్రారంభించగా, తెలంగాణ ఏర్పడిన తర్వాత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. రెండేళ్లుగా పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు 516 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలకు తాగునీరు గ్రావిటీతో లభించనుంది.

ఊరకుక్క దాడిలో చిన్నారి దుర్మరణం

వికారాబాద్ జిల్లా తాండూరులో దారుణం

తాండూరు రూరల్: దగ్గర్లోనే పనిచేస్తున్న భర్తకు మంచినీళ్లు ఇచ్చొద్దామని వెళ్లిందా తల్లి. ఇంతలోనే అంత ఘోరం జరిగిపోతుందని ఊహించలేదు. ఇంటికి తిరిగి వచ్చేసరికి తన ఐదు నెలల చిన్నారి రక్తపు మడుగులో కన్పించాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శిశువుపై ఊరకుక్క దాడి చేసింది. మెడ, కన్ను భాగంలో కరవడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆస్పత్రికి తరలించినా ఫలితం దక్కలేదు. వైద్యులు చికిత్సకు ఏర్పాట్లు చేస్తుండగానే బాలుడు మరణించాడు. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. మరోవైపు కోపోద్రిక్తులైన చుట్టుపక్కల ఉండే కార్మికులు కుక్కను కొట్టి చంపేశారు. మంగళవారం ఉదయం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని బసవేశ్వర్‌నగర్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. రూరల్ సీఐ అశోక్, ఎస్ఐ విఠల్‌రెడ్డి, బాధిత కుటుంబసభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

గదిలో బాలుడు ఒంటరిగా ఉండటంతో..

కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన నీలం మధు, మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తి సమీపంలోని దుప్పల్లికి చెందిన లావణ్యల వివాహం నాలుగేళ్ల క్రితం జరిగింది. వీరికి ఐదు నెలల క్రితం సాయినాథ్ పుట్టాడు. కాగా స్టోన్ పాలిషింగ్



బాబు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

పనిచేసే మధు వారం క్రితమే బసవేశ్వర్‌నగర్‌లోని సంగెం కలాన్ గ్రామానికి చెందిన నాగభూషణం పాలిషింగ్ యూనిట్లో చేరాడు. సమీపంలోనే ఓ అద్దె గదిలో దంపతులు నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం చిన్నారిని ఇంట్లో పడుకోబెట్టిన లావణ్య పక్కనే వంద అడుగుల దూరంలో పనిచేస్తున్న మధుకు మంచినీళ్లు ఇవ్వడానికి వెళ్లింది. బాబుకు ఉక్కపోస్తుందని, వెంటనే తిరిగొస్తాను కదా అన్న ఉద్దేశంతో గది తలుపు వేయలేదు. లావణ్య అలా బయటకు వెళ్లగానే పరిసర ప్రాంతంలో తిరుగుతున్న ఓ ఊరకుక్క ఇంట్లోకి చొరబడింది.



ఒంటరిగా ఉన్న సాయినాథ్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. నాలుగేళ్లుగా సంతానం కోసం ఎదురు చూసి, ఎన్నో మొక్కులు మొక్కగా పుట్టిన ఒక్కగానొక్క కొడుకు కళ్ల ముందే చనిపోవడంతో తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. 'నాన్నా లే నాన్నా' అంటూ లావణ్య రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఈ నెల 24న తిరుపతి వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నామని, ఇంతలోనే ఇలా జరిగిందని మధు విలపించాడు.

అందరూ ఎన్నికలకు వెళ్లడంతో..

సాధారణ రోజుల్లో పాలిషింగ్ యూనిట్ సమీపంలోని కార్మికుల గదుల వద్ద సందడి ఉంటుంది. అయితే ఎన్నికల నేపథ్యంలో చాలావరకు కుటుంబాలు ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు వెళ్లడంతో పెద్దగా మనుషుల అలికిడి లేకుండాపోయింది. దీనికి తోడు మధు కుటుంబం నివాసం ఉంటున్న గది ఒక్కటే విడిగా ఉండటం, పక్కన ఇతర నివాసాలు లేకపోవడంతో కుక్క దాడి చేసేందుకు అవకాశం ఏర్పడింది.



జ్ఞానము కలవాడు తన శత్రువులను ప్రేమించటమే కాకుండా, తన స్నేహితులను ద్వేషించనూ గలడు.
– ఫ్రెడరిక్ నీషే

సాక్షి
బుధవారం, 15 మే 2024

నేపాల్ కొత్త లడాయి


తీరి కూర్చుని సమస్యలు సృష్టించుకోవటంలో నేపాల్ ప్రధాని ప్రచండను మించినవారెవరూ ఉండరు. కనుకనే భారత్‌లోని ప్రాంతాలతో కూడిన వివాదాస్పద మ్యాప్‌తో కొత్త వంద రూపాయల నోటు విడుదల చేసి మరో గొడవకు తెరతీశారు. మన ఉత్తరాఖండ్‌లో భాగంగా... 372 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించివున్న లింపియాధుర, కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలను తనవిగా చెప్పుకుంటూ లడాయికి దిగడం నేపాల్‌కు కొత్త కాదు. నాలుగేళ్లక్రితం ఆ ప్రాంతాలతో కూడిన భౌగోళిక చిత్రపటాన్నీ, దానికి సంబంధించిన బిల్లునూ పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదం కూడా పొందింది. నిజానికి అంతకుముందే 2014లో ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్‌లో పర్యటించి సరిహద్దు వివాదాల పరిష్కారానికి ఉభయ దేశాల ప్రతినిధులతో ఒక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రతిపాదించారు. అందుకు నేపాల్ కూడా ఆమోదం తెలిపింది. దానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవటంలో ఇరు దేశాలూ చొరవ తీసుకోలేదన్నది వాస్తవం. ఆ పని తక్షణం మొదలుకావాలని భారత్‌ను డిమాండ్ చేయటంలో తప్పులేదు. అందుకు దౌత్యమార్గంలో నిరంతర చర్చలు జరపటం కూడా అవసరం. కానీ దీన్ని వదిలి 2020లో ఏకపక్షంగా మ్యాప్‌ను విడుదల చేసి సమస్యను మరింత జటిలం చేయటానికే నేపాల్ మొగ్గుచూపింది. పాలక కూటమిలో అంతర్గత విభేదాలు వచ్చిన ప్రతిసారీ ప్రజల దృష్టి మళ్లించేందుకు భారత్‌తో వున్న సరిహద్దు సమస్యను ఎజెండాలోకి తీసుకురావటం తప్ప ఆ వివాదాన్ని చిత్తశుద్ధితో పరిష్కరించుకుందామన్న ఆలోచన పాలకులకు లేదనే విమర్శలు తరచు రావటానికి ఇదే కారణం. వంద రూపాయల నోటుపై వివాదాస్పద మ్యాప్ ఉండాలనుకోవటం వెనక కూడా ఇలాంటి ఉద్దేశమే ఉందన్నది విపక్షాల విమర్శ. తన ఏలుబడిలోని కూటమిలో భాగస్వామిగా వున్న జనతా సమాజ్‌వాదీ పార్టీ–నేపాల్ (జేఎస్‌పీ–ఎన్)లో కుమ్ములాట మొదలైన మరుక్షణమే ప్రచండ వివాదాస్పద మ్యాప్‌ను బయటకు తీశారు. భారత్ మద్దతున్న మాధేసి తెగల సమూహానికి ప్రాతినిధ్యంవహించే ఆ పార్టీలో అంతర్గత తగాదాలు బయల్దేరితే నేపాల్ రాజకీయాలపై వాటి ప్రభావం ఎక్కువేవుంటుంది. 2020లో సరిహద్దు సమస్యపై నేపాల్ పార్లమెంటులో బిల్లుపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించేలా చేయటంలో కీలకపాత్రపోషించిన అప్పటి ప్రధాని, సీపీఎన్ (యూఎంఎల్) నాయకుడు కేపీ శర్మ ఓలి రెండు నెలలక్రితం పాలక కూటమిలో చేరటం కూడా కొత్త కరెన్సీనోటు ముద్రణకు కారణమంటున్నారు. 'దురాక్రమణలోవున్న నేపాల్ భూభాగాలను తిరిగి తీసుకురావటమే తమ కర్తవ్యమని సీపీఎన్(యూఎంఎల్) తన మేనిఫెస్టోలో ఇప్పటికే ప్రకటించివుంది. అయితే నేపాల్ పార్లమెంటు కొత్త మ్యాప్‌ను ఆమోదించినప్పుడు ప్రజల్లో కనిపించిన ఉత్సాహం, ఉద్వేగం ఇప్పుడు లేవు సరికదా...ప్రచండపై విమర్శలే అధికంగా వినిపిస్తున్నాయి.

ఇలా అత్యుత్సాహంతో సొంత మ్యాప్‌లు రూపొందించుకోవటం ఒక్క నేపాల్‌కే కాదు...చైనా, పాకిస్తాన్‌లకు కూడా అలవాటే. మన అరుణాచల్ ప్రదేశ్‌లోని భౌగోళిక ప్రాంతాలకు తనవైన పేర్లు పెట్టుకుని, మ్యాప్‌లలో చూపుకోవటం చైనాకు అలవాటు. పాకిస్తాన్‌దీ అదే సంస్కృతి. అది జమ్మూ, కశ్మీర్‌లో కొంత ప్రాంతాన్ని ఏనాటినుంచో తన మ్యాప్‌లలో చూపుతోంది. దేశాలమధ్య సరిహద్దులకు సంబంధించి తలెత్తే వివాదాలు ప్రజలను రెచ్చగొడితే పరిష్కారం కావు. వాటిని దౌత్యస్థాయిలో అవతలి దేశంతో ఓపిగ్గా చర్చించి, చారిత్రక, సాంస్కృతిక ఆధారాల పరిశీలనకు నిపుణులతో ఉమ్మడి కమిటీలు ఏర్పాటుచేసుకోవాలి. ఆ మార్గాన్ని వదిలి ఇష్టానుసారం జనం భావోద్వేగాలను రెచ్చగొట్టాలనుకుంటే పరిష్కారానికి అందనంత జటిలంగా వివాదాలు మారతాయి. నిజానికి సరిహద్దు తగాదాలన్నీ మన దేశాన్ని పాలించిన బ్రిటిష్ వలసపాలకులు వదిలిపెట్టిపోయినవే. 1814–16 మధ్య సాగిన ఆంగ్లో–నేపాలీ యుద్ధంలో ఈస్టిండియా కంపెనీకి నేపాల్ ధారాదత్తం చేసిన ప్రాంతమే ప్రస్తుత వివాదానికి మూలం. వలసపాలకులు పోయిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆ భూభాగంపై ఇరు దేశాల మధ్యా అవగాహన కుదరకపోవటం విచారించదగ్గదే. నిజానికి నేపాల్‌తో సరిహద్దు వివాదాలు అసలు పరిష్కారం కాలేదని చెప్పలేం. గత మూడు దశాబ్దాల్లో ఇరు దేశాలూ పరస్పరం చర్చించుకుని దాదాపు 98 శాతం సమస్యలను పరిష్కరించుకోగలిగాయి. మిగిలిన సమస్యల్ని సైతం ఈ దోవలోనే పరిష్కరించుకోవచ్చన్న ఇంగితజ్ఞానం నేపాల్ నేతలకు లేదు. దేశాధ్యక్షుడు రామచంద్ర పోద్వాల్‌కు ఆర్థిక సలహాదారుగా వున్న చిరంజీవి నేపాల్ సైతం కొత్త నోటు విడుదల తెలివితక్కువ నిర్ణయమని, రెచ్చగొట్టే చర్యని బాహాటంగా విమర్శించటం గమనించదగింది. అందువల్ల ఆయన తన పదవి పోగొట్టుకోవాల్సివచ్చినా ప్రభుత్వ నిర్ణయంపై జనంలో వున్న అసంతృప్తికి ఆ వ్యాఖ్యలు అద్దంపట్టాయి.

ఇరుగు పొరుగు దేశాలతో వున్న సరిహద్దు తగాదాలను పరిష్కరించుకోవటంలో అలసత్వం చూపితే వాటిని చైనా తనకు అనుకూలంగా మలుచుకుంటుందని గుర్తించటంలో మన పాలకులు విఫలమవుతున్నారు. ఎప్పుడో 2014లో ఉమ్మడి కార్యాచరణ బృందం ఏర్పాటుకు ఇరుదేశాల మధ్యా ఒప్పందం కుదిరినా ఇంతవరకూ సాకారం కాకపోవటంలో నేపాల్‌తోపాటు మన బాధ్యత కూడా వుంది. ఈ విషయంలో నేపాల్ పాలకులకు ఎలాంటి స్వప్రయోజనాలున్నాయన్న అంశంతో మనకు నిమిత్తం లేదు. మన వంతుగా ఏం చేస్తున్నామో గమనించుకోవాలి. అటు నేపాల్ కూడా ఏకపక్ష చర్యలతో సాధించేదేమీ ఉండదని గ్రహించాలి. వివాదాలకు భావోద్వేగాలు జోడించటం ఎప్పటికీ పరిష్కారమార్గం కాదని గుర్తించాలి.

'రక్షణ'కు ఒక దిగ్దర్శనం అవసరం!

విశ్లేషణ



మేజర్ జనరల్ అశోక్ కె. మెహతా (రిటైర్డ్)

బీజేపీ, కాంగ్రెస్ మేనిఫెస్టోలు జాతీయ భద్రతకు భిన్న మార్గాల్లో ప్రాధాన్యం ఇచ్చాయి. అయితే రెండూ కూడా అత్యాధునిక మిలటరీ ఆయుధాలను సమకూర్చుకోవటానికి ఏమంత ప్రాముఖ్యం ఇవ్వలేదు. దేశంలోని ఈ రెండు ప్రధాన జాతీయ పార్టీల మేనిఫెస్టోలు పరిశీలించిన తరువాత రక్షణ, భద్రత అంశాల విషయంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కొంత మెరుగ్గా ఉన్నట్లు తోస్తోంది కానీ... త్రివిధ దళాల అధిపతులు, జాతీయ భద్రతా సలహాదారులు కలిసి ఉన్న డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ... జాతీయ భద్రత వ్యూహం ఒకదాన్ని రూపొందించే విషయం రెండు మేనిఫెస్టోల్లోనూ స్పష్టంగా లేదు. అంతేకాదు, మన రక్షణ రంగానికి ఇప్పుడు దిగ్దర్శనం చేసే ఒక 'ప్రొఫెషనల్' అవసరం కూడా ఎంతైనా ఉంది.

బీజేపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆత్మ నిర్భర్ భారత్'లో స్వావలంబనకు పెద్ద పీట వేశారు కానీ... అత్యాధునిక మిలిటరీ ఆయుధాలను సమకూర్చుకోవడంపై మాత్రం దృష్టి పెట్టలేదు. జాతీయ భద్రత, రక్షణ వంటి విషయాల్లో భారతీయ జనతా పార్టీ తన మేనిఫెస్టోలో చాలా అంశాలను ప్రస్తావించింది కానీ... ఏవీ అంత సమగ్రంగా ఉన్నట్టు కనిపించవు. 'మోదీకి గ్యారెంటీ ఫర్ సురక్షిత్ భారత్' పేరుతో మోదీ ప్రభుత్వం తను సాధించిన విజయాలను వెల్లడించింది, భవిష్యత్తు కోసం కొన్ని హామీలను ఇచ్చింది.

2014 తరువాత దేశంలోని ఏ నగరంలోనూ ఉగ్రదాడి ఏదీ జరగలేదని బీజేపీ చెప్పుకుంటోంది. ఇందులో కీలకం 'నగరం' అన్న పదం. 2016లో పఠాన్‌కోట వైమానిక స్థావరం, యూరీలు; 2019లో పుల్వామా ఘటనల్లో 'నగరాల'పై దాడులు జరగలేదు కాబట్టి తాము తప్పుగా ఏమీ చెప్పలేదని బీజేపీ సమర్థించుకోవచ్చు.

దీంతోపాటే ఆర్టికల్ 370 రద్దు ప్రభావం జమ్మూ కశ్మీర్‌లో ఎలా ఉందో కూడా మేనిఫెస్టోలో ప్రస్తావించారు. వామపక్ష తీవ్రవాద సంబంధిత హింస 52 శాతం వరకూ తగ్గిందనీ, ఈశాన్య భారతదేశంలో చొరబాటుదారుల సమస్య 71 శాతం నెమ్మదించిందని కూడా ఇందులో వివరించారు. ఉగ్రవాదాన్ని అస్సలు సహించేది లేదని చెబుతూ మేనిఫెస్టోలో 2016 నాటి సర్జికల్ స్ట్రైక్స్, 2019 నాటి బాలాకోట్ దాడి గురించి చెప్పారు. చైనా, పాకిస్తాన్, మయన్మార్ సరిహద్దుల్లో అత్యాధునికమైన రీతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామనీ, కార్యక్రమాలను వేగవంతం చేస్తామనీ, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్మార్ట్ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేస్తామని కూడా బీజేపీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. అయితే.. మణిపుర్ కూడా మన దేశ సరిహద్దులో ఉన్నా దాని ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

'మోదీకి గ్యారెంటీ ఫర్ గ్లోబల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్' విభాగంలో రక్షణ రంగ ఉత్పత్తులను మరింత విస్తృత స్థాయిలో తయారు చేస్తామనీ, 'మేడిన్ భారత్' ఎగుమతులకు ఊతమిస్తామని కూడా చెప్పుకున్నారు. ఈ ప్రయత్నాల వల్ల వాయు, పదాతిదళాలకు అవసరమైన ఆయుధాలు, వ్యవస్థలను దేశీయంగానే తయారు చేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. గత ఏడాది అంటే బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అయిన తరువాత 'నేషన్ ఫస్ట్: ఫారిన్ పాలసీ అండ్ నేషనల్ సెక్యూరిటీ' పేరుతో బీజేపీ ఒక బుక్‌లెట్ విడుదల చేసి. అందులో తాము సాధించిన ఘనతలను ప్రస్తావించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో రక్షణ, అంతర్గత భద్రతను, బయటి నుంచి రాగల సవాళ్లను వేర్వేరుగా సమీక్షించారు. లద్దాఖ్ ప్రాంతంలో సుమారు రెండు వేల కిలోమీటర్ల వైశాల్యమున్న భారత భూభాగాన్ని, మొత్తం 65 పెట్రోలింగ్ పోస్టుల్లో 25 పోస్టులపై పట్టు కోల్పోయామన్న



విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. అధికారంలోకి వస్తే జాతీయ భద్రతా వ్యూహం (ఎన్‌ఎస్‌ఎస్) ఒకదాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించింది. అలాగే ఎప్పుడో 2009లో రక్షణ మంత్రి జారీ చేసిన ఆపరేషనల్ డైరెక్టివ్‌లను సమీక్షిస్తామనీ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామక ప్రక్రియను పారదర్శకంగా, వ్యవస్థీకృతంగా చేస్తామని కూడా హామీలు ఇచ్చింది. రక్షణ శాఖకు తగినన్ని నిధులు కేటాయించడమే కాకుండా ఈ రంగంలో తిరోగమిస్తున్న అంశాలను మళ్లీ పట్టాలెక్కిస్తామని తెలిపింది. 'అగ్నిపథ్' పథకం రద్దుతో పాటుగా, జాతీయ భద్రతా కౌన్సిల్, నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్లను పార్లమెంటు పర్యవేక్షణలో పనిచేసేలా మార్పులు చేస్తామనీ, వ్యూహాత్మక అవసరాలకు అంతర్జాతీయ స్థాయి సరుకు రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామనీ 'వన్ ర్యాంక్– వన్ పెన్షన్' అమల్లోని లోపాలను సవరిస్తామనీ వివరించింది. వైకల్యం కారణంగా లభించే పెన్షన్‌పై పన్నులు రద్దు చేస్తామని కూడా చెప్పింది. అంతర్గత భద్రత విషయాలను ప్రస్తావిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలు, హింసలకు తావు ఇవ్వమనీ, ఇతర మతాల నిరాదరణనూ సహించబోమనీ స్పష్టం చేసింది. 'నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్'ను ఆచరణలోకి తేవడం, ఏడాది లోపు 'నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్' ఏర్పాటు తమ లక్ష్యాలని వివరించింది.

దేశంలోని రెండు ప్రధాన జాతీయ పార్టీల మేనిఫెస్టోలు పరిశీలించిన తరువాత కాంగ్రెస్ మేనిఫెస్టో రక్షణ, భద్రత అంశాల విషయంలో కాస్త మెరుగ్గా ఉన్నట్లు తోస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... మన ప్రభుత్వం రక్షణ రంగానికి జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో రెండు శాతం కంటే తక్కువ నిధులు కేటాయిస్తూండటం! ఫలితంగా మన మిలటరీ సామర్థ్యాలను చైనాకు దీటుగా మార్చుకునే విషయంలో వెనుకబడిపోయాం. త్రివిధ దళాల ఆధునికీకరణకు మరిన్ని నిధుల కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతున్నా అగ్నిపథ్ లాంటి పథకాల పుణ్యమా అని ఈ ఆధునికీకరణ మరో పదేళ్లకు కానీ పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. వన్ ర్యాంక్– వన్ పెన్షన్ బకాయిలు 2002–23లో మిలటరీ ఆధునికీకరణకు కేటాయించిన నిధుల కంటే ఎక్కువ కావడం, మిలటరీ సిబ్బంది సంఖ్యను మదింపు చేయడం ద్వారా ఈ లోటును అధిగమిస్తామని బీజేపీ చెప్పడం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయాలు.

ఈ చర్యల కారణంగా మన యుద్ధ సన్నద్ధత, సామర్థ్యం తగ్గిపోయాయి. 2022లో కేవలం ఒక్క ఆర్మీలోనే 1.18 లక్షల ఖాళీలు ఉన్నాయంటే పరిస్థితి ఏమిటన్నది అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆత్మ నిర్భరత' కార్యక్రమం కూడా స్వావలంబనపై ఎక్కువ దృష్టి పెట్టింది కానీ... అత్యాధునిక ఆయుధాలనూ, వ్యవస్థలనూ ఏర్పాటు చేసుకోవడంపై కాదు. ఈ విషయాన్ని దేశ తొలి సీడీఎస్, దివంగత జనరల్ బిపిన్ రావత్ గతంలోనే కచ్చితంగా అంచనా కట్టారు. తగినన్ని, నాణ్యమైన ఆయుధ వ్యవస్థలు లేకపోయేందుకు ప్రస్తుతం అవలంబిస్తున్న 'ఎల్1' టెండర్ వ్యవస్థ కారణం. మిత్ర దేశాలకు లైన్ ఆఫ్ క్రెడిట్ ఇవ్వడంతో రక్షణ రంగ ఎగుమతులు పెరిగాయి. ఈ దేశాలన్నీ ప్రాణాంతకమైనవి కాకుండా ఇతర పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాయి.

త్రివిధ దళాల అధిపతులు, జాతీయ భద్రతా సలహాదారులు కలిసి ఉన్న డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ జాతీయ భద్రత వ్యూహం ఒకదాన్ని ఇంకా రూపొందించాల్సి ఉంది. ముసాయిదా ఒకదాన్ని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ 2021లోనే భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు ఇచ్చిన విషయం ప్రస్తావనార్హం. అప్పటి నుంచి ఇప్పటివరకూ దాన్ని అప్‌డేట్ చేస్తూనే ఉన్నారు.

ఆర్మీ దళాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద, ముఖ్యమైన సమస్య వనరుల కొరత. దీంతోపాటే కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించక పోవటం కూడా. జాతీయ భద్రత విషయంలో 1980 మధ్య కాలం మిలటరీకి స్వర్ణయుగం అని చెప్పాలి. త్రివిధ దళాలు 15 ఏళ్ల రక్షణ ప్రణాళికను 1988లో పార్లమెంటులో ప్రస్తావించడం గమనార్హం.

పదేళ్లలో బీజేపీ ఐదుగురు రక్షణ మంత్రులను నియమించింది. వీరిలో ఒకరు ఆర్థిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. రెండుసార్లు రక్షణ మంత్రిత్వ శాఖను అదనపు బాధ్యతగా చేపట్టారు కూడా! మాజీ విదేశీ వ్యవహారాల కార్యదర్శి ఎస్.జయశంకర్‌ను ఆ శాఖ మంత్రిగానూ నియమించింది ఈ ప్రభుత్వం. జయశంకర్ అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రభను వెలిగించారనడంలో సందేహం లేదు. అయితే దేశ రక్షణ రంగం కూడా ఇలాంటి ప్రొఫెషనల్ ఏర్పాటును కోరుకుంటోంది. రక్షణ మంత్రి లేదా ఆ శాఖ సహాయ మంత్రికైనా మిలటరీ విషయాలపై ఎంతో కొంత పట్టు ఉండాలి. దీనివల్ల నిర్ణయాలు తీసుకోవడం సులువు అవుతుంది. పథకాల అమలు వేగవంతమవుతుంది. ఆత్మ నిర్భరత సాధ్యమవుతుంది.

– వ్యాసకర్త మిలటరీ వ్యవహారాల వ్యాఖ్యాత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా



నమ్మకం పోతుంది

ఎన్డీయేకి 400కి పైగా సీట్లు వస్తాయన్న నమ్మకంతో ఉన్న బీజేపీ బ్రిజ్ భూషణ్ కుమారుడిని అభ్యర్థిగా నిలబెట్టకుండా ఉండాల్సింది. ఇలా చేయటం వల్ల... సామాజిక కళంకాన్ని సైతం ఎదుర్కొంటూ బ్రిజ్ భూషణ్‌పై ఎంతో కాలంగా న్యాయ పోరాటం చేస్తూ ఉన్న మన మహిళా ఒలింపిక్ విజేతల మనో ధైర్యాన్ని దెబ్బతీసినట్లయింది.
– ప్రీతిష్ నంది, మాజీ ఎంపీ, జర్నలిస్ట్

జాప్యమైతే అప్రతిష్ఠ



రేవణ్ణ విషయమై దేశ ప్రతిష్ఠ భారీ మూల్యం చెల్లించుకోనుంది. తుపాకీతో బెదిరించి అత్యాచారం చేయటం నపుంసకత్వానికి సంకేతం. సత్వర విచారణ జరిపించి, శిక్షించటంలో జాప్యం తగని కేసు ఇది. రేపిస్టు కొడుకు, కిడ్నాపర్ తండ్రి.
– శోభా డే, సామాజిక వ్యాఖ్యాత

మాయదారి ఒప్పందం



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలన్నీ 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్' (హూ) ప్రతిపాదించిన 'మహమ్మారి' ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఈ ఒప్పందంపై సంతకం చేయటం అంటే మహమ్మారులు, లాక్‌డౌన్‌లు, వాక్సిన్‌ల విషయంలో ప్రభుత్వాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినట్లు చేయటమే! అంటే తమ సార్వభౌమత్వాన్ని కోల్పోవటమే!
– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది, యాక్టివిస్టు

మంచే జరిగింది



మణిపుర్‌లోని ఒక్క కామ్‌జోంగ్ జిల్లాలోనే 5,457 మంది అక్రమ వలసదారులను గుర్తించారు. వారిలో 5,173 మంది బయోమెట్రిక్ డేటాను ప్రభుత్వం సేకరించింది. ఇది సాధ్యమవటానికి కారణం... అక్రమ వలసదారులను బహిష్కరించాలనీ, రాష్ట్రంలో ఎన్.ఆర్.సి. (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్) ని అమలు చేయాలనీ మణిపుర్ ప్రజలు డిమాండ్ చేయటమే!
– అన్షుల్ సక్సేనా, న్యూస్ ఎనలిస్ట్

ఇన్ బాక్స్

ప్రైవేటు రైలు వచ్చేస్తోంది!

పూర్తిగా ప్రభుత్వ రంగంలో నడుస్తున్న వ్యవస్థల్లో భారత రైల్వేస్ ఒకటి. కానీ ఈ జూన్‌లో దానిలోనూ ప్రైవేటు రైలు ప్రవేశిస్తోందనే సమాచారం పెద్దగా ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే ఇప్పటికే అనేక రంగాలు ప్రైవేటైజేషన్‌కు గురవుతున్న సంగతి తెలిసిందే.

ఈ ప్రైవేట్ రైలు ప్రధాన లక్ష్యం పర్యాటకులను ఆకర్షించడమే. సౌకర్యాలు బాగుంటే దీనికి తిరుగుండదు. సాధారణంగా మన రైళ్లు కిక్కిరిసి ఉంటాయి. కాలు పెట్టడానికి సందు ఉండదు. విజ్ఞానం, వినోదం, ఆహ్లాదం కోరుకునే పర్యాటకులు ఇటువంటి రైళ్లలో ప్రయాణం చేయరు. ఎంచక్కా కూర్చోవడానికే కాక పండుకొని సౌకర్యవంతంగా ప్రయాణించడానికి వీలున్న విశాలంగా ఉన్న కంపార్ట్‌మెంట్లను పర్యాటకులు కోరుకుంటారు. ముఖ్యంగా పరి శుభ్రత ఉండాలి. నాణ్యమైన తినుబండారాలు ఉండాలి. సిబ్బంది పర్యాటకుల పట్ల మర్యాద, మన్నన చూపాలి. తాజా ప్రైవేట్ రైలును ప్రయోగాత్మకంగా కేరళ లోని తిరువనంతపురం నుంచి గోవా వరకు నడుపుతారు. ఈ మార్గంలో చక్కటి ప్రకృతి దృశ్యాలు ఎక్కువ.

త్రివేండ్రం, కొల్లాం, కొట్టాయం, ఎర్నాకుళం, కన్నూర్, కాసర్‌గోడ్ వంటివి పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయి. ఈ రైలులో దాదాపుగా 700 మంది ప్రయాణం చేయవచ్చని తెలుస్తోంది. ఇందులో ప్రయాణికులకు ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సిబ్బంది కూడా ఉంటారు. ప్రయాణికుల రక్షణకూ సిబ్బంది ఉంటారు. దీనిని ఎస్ఆర్ఎమ్‌పీఆర్ గ్లోబల్ రైల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నిర్వహిస్తుందని సమాచారం. క్రమంగా ప్రైవేట్ రైళ్లు అన్ని ప్రధాన చారిత్రక, ఆధ్యాత్మిక సుందర ప్రదేశాలను చుట్టి రావడానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తాజ్‌మహల్ వంటి అద్భుత కట్టడాలు ఎన్నో మనదేశంలో ఉన్నాయి. విదేశీయులూ ఇటువంటి సుందర కట్టడాలను దర్శిస్తూ ఉంటారు. మంచి ప్రమాణాలతో పర్యాటక ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తే దేశ, విదేశీ పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను కలుపుతూ సీనియర్ సిటిజన్స్ కోసమే ప్రత్యేక పర్యాటక రైళ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ప్రైవేట్ రైళ్లు రావడం వలన అటు ప్రభుత్వానికి కూడా ఆదాయం ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రైళ్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి అంతిమంగా ప్రయాణికులు లాభపడే అవకాశం ఉంది. కాబట్టి ప్రైవేటు రైళ్లను గుడ్డిగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.

– కనుమ ఎల్లారెడ్డి, అమెరికా

ప్రతి ఓటూ ఎంతో విలువైనదే!

సందర్భం



జిల్లా గోవర్ధన్

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనది. అది ఎన్నికల్లో వేసే ఓటు కావచ్చు లేదా చట్టసభల్లో బలపరీక్ష జరిపేటప్పుడు ప్రజాప్రతినిధులు వేసే ఓటు కావచ్చు. ఒకటి రెండు ఓట్ల తేడాతో అభ్యర్థులు లేదా ప్రభుత్వాలు ఓటమిపాలయిన ఉదాహరణలు ఉన్నాయంటే ఆశ్చర్యపోవలసిన పనిలేదు. పన్నెండవ లోక్‌సభలో జరిగిన సంఘటన ఇందుకు ఒక ఉదాహరణ.

1998 మార్చిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ మెజారిటీ పొందలేకపోవటంతో అత్యధిక సీట్లు (182) సాధించిన భారతీయ జనతా పార్టీ, పన్నెండు ప్రాంతీయ పార్టీల (ఎన్డీఏ) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అటల్ బిహారీ వాజ్‌పేయి 1998 మార్చి19న 10వ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాని ఇది మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. 18 మంది లోక్‌సభ సభ్యులతో, ఆ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వచ్చిన అన్నా డీఎమ్‌కే అధినేత్రి జయలలిత రోజుకొక గొంతెమ్మ కోరికతో ప్రధాని కంటి మీద కునుకులేకుండా చేసింది అప్పట్లో. ఓ రోజు 'అమ్మ'... నేవల్ అధికారినే మార్చి తనకు అనుకూలమైన ఆఫీసరును నియమించవలసిందిగా కోరటంతో విసిగిపోయిన ప్రధాని వాజ్‌పేయి ససేమిరా అన్నారు. అంతే, ఏప్రిల్ 14న ఆయన ప్రభుత్వానికి మద్దతు విరమించుకుంటున్నట్లు చెన్నై నుండి ఢిల్లీ కెళ్ళి రాష్ట్రపతికి వినతి పత్రం అందజేశారు జయలలిత. 543 సభ్యుల పార్లమెంటులో 'నాజూకు' బలంతో సాగుతున్న వాజ్‌పేయి ప్రభుత్వం, మైనారిటీకి చేరింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి తెర లేపింది ప్రతిపక్ష కాంగ్రెస్.

ప్రధానికి 'మ్యాన్ ఫ్రైడే'గా చలామణీ అవుతున్న బీజేపీ యువనేత ప్రమోద్ మహాజన్ రంగంలోకి దిగి తనదైన శైలిలో చకచకా పావులు కదిపి, అవిశ్వాసాన్ని ఎదుర్కోవటానికి, ఎన్డీఏకి అనుకూలంగా తిరిగి సంఖ్యా బలాన్ని సమకూర్చారు. అదే రోజు రాత్రి... బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకురాలు మాయావతి ఇంటి ముందు ఒక తెల్ల అంబాసడర్ ఎర్ర బుగ్గ కారు ఆగింది. కారులోని వీఐపీని చూసిన సెక్యూరిటీ గార్డ్, సెల్యూట్ చేసి గేటు తెరిచి, మేడం మాయవతికి ఫోన్ ద్వారా ఆయన రాకను చేరవేశాడు. సుమారు అరగంట సేపు ఆమెతో సీరియస్‌గా చర్చించి వెళ్ళిపోయాడు. ఆయన మరెవరో కాదు, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ లీడర్ శరద్ చంద్ర పవార్.

మరుసటి రోజు (17 ఏప్రిల్) ఉదయం. పార్లమెంటు సెంట్రల్ హాలులోకి ఎంపీలు రావటం మొదలెట్టారు. వారిలో ఒకరు ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయనను చూడగానే, దగ్గరకు వస్తూ పాదాభివందనం చేసింది మాయావతి. ఎప్పటిలాగే చిరునవ్వుతో ఆమెను ఆశీర్వదిస్తూ ముందుకు నడిచారు ఆయన. ఆ తర్వాత శరద్ పవార్ ఆమె దగ్గరకు వెళ్లి చెవిలో ఏదో చెబుతున్నారు. ఈ దృశ్యం చూసిన బీజేపీ నేత ప్రమోద్ మహాజన్ మనసు ఏదో కీడును శంకించింది. సుదీర్ఘ చర్చల తర్వాత మధ్యాహ్నం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీ. మాయావతి పార్టీ ఐదుగురు సభ్యులు అవిశ్వాస బిల్లుకు, ఊహించని రీతిలో ఆమోదం తెలపటంతో వాజ్‌పేయి ప్రభుత్వం ఒకే ఒక్క ఓటు తక్కువ అవ్వడంతో మెజారిటీ కోల్పోయింది. మాయావతి వైపు పవార్ విసిరిన పాచిక ప్రభావం అప్పుడు అర్థమైంది ప్రమోద్ మహాజన్‌కు. అవాక్కయి పోయారు ట్రెజరీ బెంచ్ సభ్యులు.



1999లో అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్లమెంట్‌లో వాజ్‌పేయి

ఇక 1999 ఏప్రిల్ 21 నాడు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాష్ట్రపతి భవన్ చేరుకుని, ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. వాస్తవానికి ఈ విన్నపం, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ లీడరుగా శరద్ పవార్ చేయాల్సింది. పరిస్థితిని ఆకళింపు చేసుకున్న పవార్, వెంటనే తన 'ప్లాన్ బి' బటన్ ఆన్ చేయటంతో, ఏప్రిల్ 22 నాడు ఆయన మిత్రుడు సమాజ్‌వాది పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్, 'రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వానికి తన పార్టీ 19 మంది ఎంపీల మద్దతు ఉండబోదని' వెల్లడించారు. అలా మ్యాజిక్ సంఖ్య (272)ను చేరుకోలేక పోయింది కాంగ్రెస్. చివరకి 12వ లోక్‌సభ త్రిశంకు స్వర్గంలో ఉండిపోవడంతో 1999 ఏప్రిల్ 26న దాన్ని రద్దు చేశారు రాష్ట్రపతి కేఆర్ నారాయణన్.


కనివిని ఎరుగని మండుటెండలు, అటు రాజకీయ నాయకుల ఊకదంపుడు ప్రచారాలతో 18వ పార్లమెంటు ఎన్నికలు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత దశలో విసిగి పోయిన దేశంలో పలుచోట్ల ఓటర్లు ఎందుకో ఈసారి ఓటు హక్కుపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మూడో విడత ఎన్నికలు (283 సీట్లు) ముగిసేసరికి ఓటింగ్ శాతం తగ్గిపోవటంతో స్టాక్ మార్కెట్‌లో ప్రకంపనలు మొదలయ్యాయి. ఒక వేళ 4 జూన్ నాటి ఫలితాలు 12వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల మాదిరి పునరావృతమైతే, దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితి ఎలా ఉంటుందో! అదే జరిగితే, మరి బాధ్యులు ఎవరు? ఓటర్లా లేక ప్రజా విశ్వాసం చూరగొనలేని రాజకీయపక్షాలా?

(శరద్ పవార్ రాజకీయ ఆత్మకథ, మరాఠీ పుస్తకం, 'లోక్ మాఝే సాంగతి' ఆధారంగా)

– విశ్రాంత పీఎఫ్ కమిషనర్, 9819096949

మన లోపలే ఉంది!

అదొక పెద్ద సంత. అక్కడ ఓ బిచ్చగాడు నిల్చునేవాడు. కానీ అతను ఎవరినీ నోరు తెరచి ఏమీ అడగడు. ఇస్తే తీసుకుంటాడు. రోజూ ఉదయమే వస్తాడు. ఒకే చోట నిల్చుంటాడు. కుడి చేతిని మాత్రం ముందుకు చాస్తాడు. ఏమీ మాట్లాడడు. ఆ దారిన వచ్చి పోయే వాళ్ళు అతని చేతిలో చిల్లర నాణేలు వేసి పోతుంటారు. అతను దాదాపు యాభై ఏళ్లుగా అదే చోట నిల్చుని యాచన చేస్తున్నాడు. ఉన్నట్టుండి ఒక రోజు బిచ్చమెత్తుకుంటున్న చోటే పడి చనిపోయాడు. ఊరివారంతా అయ్యో పాపం అనుకున్నారు. ఊరి ప్రజలందరూ ఏకమై ఆ బిచ్చగాడు అడుక్కునే చోట అతనికి ఓ విగ్రహం పెట్టాలనుకున్నారు. వెంటనే విరాళాలు సేకరించారు. బోలెడంత డబ్బు జమైంది. ఆ బిచ్చగాడు ఎప్పుడూ నిల్చున్న చోటే తవ్వడం మొదలుపెట్టారు. ఓ రెండు అడుగులు తవ్వారో లేదో ఓ బిందె బయటపడింది. అందులో బంగారు నాణేలు, వెండి నాణేలు ఉన్నాయి. వాటిని చూసి ఆశ్చర్యపోయారు. ఒకరన్నారు... 'చూశారా.! ఈ బిచ్చగాడు తన కాళ్ళ కింద ఇంతటి విలువైన సంపద పెట్టుకుని చిల్లర పైసల కోసం అడుక్కున్నాడు కదా' అని.



జ్యోతిర్మయం

అప్పుడు అటువైపుగా వచ్చిన ఓ సాధువు అక్కడున్న వారిని చూసి 'అవును, ప్రతి మనిషీ ఇలాగే ఉన్నాడు. తన బుర్రలో ఉన్న తెలివితేటలనూ, శక్తిసామర్థ్యాలనూ, సంతోషాన్నీ అతను గ్రహించడు. బయటెక్కడో అవన్నీ ఉన్నాయనుకుని వెతుకుతుంటాడు' అని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

సాధువు వెళ్ళాక అక్కడున్న వారందరూ ఆలోచనలో పడ్డారు. ఇదంతా ఎందుకు చెప్పడమంటే, మన దగ్గర ఏమేమి ఉన్నాయో సరిగ్గా తెలుసుకోం. కానీ అవన్నీ వెతుకుతూ ఎక్కడెక్కడికో పోతుంటాం. వీధి చివర ఉన్న కిరాణా దుకాణానికి వెళ్ళి ఓ అర కిలో సంతోషాన్ని కొనుక్కోగలమా?

పూర్వం ఓ జ్ఞాని ఉండేవారు. ఆయన వద్దకు ఓ శిష్యుడు వచ్చాడు. 'మీ వద్ద జ్ఞానమనే ముత్యాలు ఉన్నాయని అంటున్నారు. నాకందులో కొంత అమ్మగలరు'అని అడిగాడు. అప్పుడు ఆ జ్ఞాని 'నీకది అమ్మడం కుదరదు. ఎందుకంటే దాని ఖరీదు నువ్వివ్వలేవు. పోనీ ఉచితంగా ఇద్దామంటే నువ్వు దానిని నిర్లక్ష్యం చేస్తావు. కనుక నాలాగా నువ్వు కూడా జ్ఞానమనేసాగరంలో మునిగి తేలాలి. అప్పుడు నువ్వూ ఓ ముత్యాన్ని పొందవచ్చు. అంతేతప్ప బయటెక్కడో కొనే విషయం కాదు. దేనికైనా కృషి అనేది ముఖ్యం. అందులో ప్రయత్నలోపం తగదు' అన్నారు జ్ఞాని.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.5.56 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఆశ్లేష సా.4.58 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.19 వరకు, **అమృతఘడియలు:** ప.3.12 నుండి 4.55 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.32, **సూర్యాస్తమయం:** 6.19.

విశాఖలోనే సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం

- రెండు మూడు రోజుల్లో తేదీ ప్రకటిస్తాం
- రాష్ట్రంలో ఫ్యాన్ గాలి బలంగా వీచింది
- మహిళలంతా వైఎస్సార్‌సీపీ వైపే
- చంద్రబాబు కుయుక్తులు పనిచేయలేదు
- మంత్రి బొత్స సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పోలింగ్ సరళి చూస్తుంటే ఫ్యాన్ గాలి బలంగా వీచిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రెండు మూడు రోజుల్లో ప్రమాణ స్వీకారానికి తేదీ కూడా ప్రకటిస్తామని చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే నెల 4వ తేదీన ఊహించని ఫలితాలు రానున్నాయని చెప్పారు. రాజకీయాల్లో నిజాయితీ, హామీల అమలు ముఖ్యమని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఇలాంటి ప్రమాణాలు పాటిస్తూ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ చేసిన సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీని విజయం వైపు తీసుకెళ్తోందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరి మద్దతు సీఎం వైఎస్ జగన్‌కే ఉందని, వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని తెలిపారు. లబ్ధి పొందిన ప్రతి మహిళా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ కావాలని కోరుకుంటున్నారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, వృద్ధులకు ఇంటికే పింఛన్ అందుతుందని, అవినీతి లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల ఆర్థిక సహాయం అందుతుందని భావించి ఓట్లు వేశారన్నారు. చంద్రబాబు అధికార దాహంతో అనేక రకాల కుయుక్తులకు పాల్పడ్డాడని, స్థాయికి తగని తప్పుడు భాష వాడారని తెలిపారు. వ్యక్తిగతంగా కుటుంబంపై దూషణలు చేశాడన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు తాను వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించిన దౌర్భాగ్యుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్లో ఆందోళన కలిగించేందుకు కుటిల యత్నాలు చేశాడని తెలిపారు. చివరికి పోలింగ్ రోజు కూడా వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు చేయించాడన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా చంద్రబాబు ఓటమి ఖాయమైందని, ఆయనకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు.

మన సుపరిపాలన మరింత మెరుగ్గా కొనసాగుతుంది

నాకు ఆశీస్సులు ఇవ్వడానికి సునామీలా తరలివచ్చిన అందరికీ కృతజ్ఞతలు: ఏపీ సీఎం వైఎస్ జగన్ ట్వీట్



సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికల కోసం పెద్ద ఎత్తున తరలివచ్చి పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లందరికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సీఎం జగన్ మంగళవారం ట్వీట్ చేశారు. ''నిన్న జరిగిన ఎన్నికల్లో మండుటెండలు సైతం లెక్కచేయకుండా నాకు ఆశీస్సులు ఇవ్వడానికి సునామీలా తరలివచ్చిన నా అవ్వాతాతలకు, నా అక్కచెల్లెమ్మలకు, నా అన్నదమ్ములకు, నా రైతన్నలకు, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీలకు, నా యువతీయువకులందరికీ పేరుపేరునా శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం చెమటోడ్చి శ్రమించిన నా కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇప్పటివరకు సాగిన మన సుపరిపాలన, మరింత మెరుగ్గా కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను'' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

ఏపీలో 81.3 శాతం పోలింగ్!

- పోస్టల్ బ్యాలెట్ కలిపితే 82.5 శాతం!
- వెల్లడించిన సీఈవో కార్యాలయం వర్గాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 81.3% పోలింగ్ జరిగింది. పోస్టల్ బ్యాలెట్ 1.2 శాతాన్ని కలుపుకొంటే ఇది 82.5 శాతమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈవో) కార్యాలయం వర్గాలు మంగళవారం రాత్రి వెల్లడించాయి. ఈ వివరాలను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ధృవీకరించాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ 0.6 శాతంతో కలుపుకొని 79.8 శాతం నమోదైంది. ఈసారి ఎన్నికల్లో రాత్రి 12 గంటల వరకు 79.40 శాతం నమోదైనట్లు మంగళవారం మధ్యాహ్నం సీఈవో ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 2 గంటల వరకు ఓటింగ్ జరిగినందున ఎక్కడ ఎంత ఓటింగ్ జరిగిందో పూర్తి వివరాలు రావడానికి ఆలస్యమవుతోందని వివరించారు.

మంగళవారం రాత్రి అందిన సమాచారం ప్రకారం జిల్లాలవారీగా పోలింగ్ (శాతాల్లో)

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	83.19	తూర్పు గోదావరి	79.31
అల్లూరి సీతారామరాజు	63.19	అనంతపురం	79.25
ఏలూరు	83.04	ఎన్టీఆర్	78.76
సత్యసాయి	82.77	కడప	78.72
చిత్తూరు	82.65	పల్నాడు	78.70
ప్రకాశం	82.40	నెల్లూరు	78.10
బాపట్ల	82.33	తిరుపతి	76.83
కృష్ణా	82.20	కాకినాడ	76.37
అనకాపల్లి	81.63	అన్నమయ్య	76.12
పశ్చిమ గోదావరి	81.12	కర్నూలు	75.83
నంద్యాల	80.92	గుంటూరు	75.74
విజయనగరం	79.41	శ్రీకాకుళం	75.41
		మన్యం	75.24
		విశాఖ	65.50

పచ్చ ముఠా స్వైరవిహారం

అవ్వాతాతలను, మహిళలను హడలగొట్టడమే లక్ష్యం.. రాష్ట్రవ్యాప్తంగా పచ్చ మూకల విధ్వంసకాండ



తాడిపత్రిలో ట్రాక్టరులో రాళ్లు తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దారెడ్డి ఇంటిపైకి విసురుతున్న టీడీపీ మూకలు



పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్

సాక్షి, అమరావతి: ఈసీ చేష్టలుడిగి చూస్తుండటంతో పచ్చముఠాలు ఆయుధాలు చేతబట్టి వీధుల్లో వీరంగం వేస్తున్నాయి! ఎన్నికల వేళ తమ మాట వినలేదనే ఉక్రోషంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్లపై దాడులకు తెగబడుతున్నాయి. టీడీపీ రౌడీ మూకల మారణకాండతో మహిళలు, వృద్ధులు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించి కఠిన చర్యలు చేపట్టాల్సిన ఈసీ ఈ అరాచకాలకు పరోక్షంగా కొమ్ముకాస్తుండటం విస్మయపరుస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలను నిర్దేశించేది గ్రామీణ ప్రజలు, మహిళలు, అవ్వాతాతలేనని పసిగట్టిన పచ్చ ముఠాలు వారిని ఇంటి నుంచి బయటకు రాకుండా చేయడమే లక్ష్యంగా హింసాత్మక ఘటనలకు తెర తీశాయి. వైఎస్సార్ సీపీకి ఓటేస్తారని ఖాయంగా తేలడంతో వారి ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు ఉద్రికత్తలు రేకెత్తించాయి. ఈ పాచిక కొన్ని చోట్ల పారగా మిగతా చోట్ల సాధ్యం కాలేదు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఈసీ పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసిన జిల్లాల్లో హింస కొనసాగుతుండటమే దీనికి నిదర్శనం. తాజాగా పల్నాడు జిల్లా కొత్త గణేశునిపాడులో వైఎస్సార్‌సీపీకి ఓటేసేశారనే అనుమానంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిపై టీడీపీ మద్దతుదారులు దాడులకు దిగడంతో మహిళలు, పిల్లలు రాత్రంతా ఓ దేవాలయంలో తలదాచుకుని క్షణక్షణం భయంభయంగా గడిపారు. పురుషులు గ్రామం వీడి వెళ్లిపోయారు.

కుట్రలకు పరోక్ష సహకారం

మ్యాచ్ రిఫరీ తరహాలో ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ (ఈసీ) రాజకీయాల కుట్రలకు తలొగ్గింది! పోలింగ్ సందర్భంగా, అనంతరం దాడులకు పాల్పడ్డాలని టీడీపీ రూపొందించిన ముందస్తు కుట్రలకు దాసోహమైంది. సమస్యాత్మక జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులను హఠాత్తుగా బదిలీ చేసి చంద్రబాబు కుట్రల అమలుకు దారి చూపింది. టీడీపీ అధినేత ఆదేశాలతో పురందేశ్వరి సూచించిన అధికారులను ఆ స్థానాల్లో నియమించి పచ్చ కుట్రలకు పరోక్షంగా సహకరించింది. ఇదే అదునుగా టీడీపీ రౌడీలు బరితెగించి దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్నా.. బాంబుల మోత మోగిస్తున్నా ఆ జిల్లాలపై పట్టులేని పోలీసు యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది. రాష్ట్రం రావణకాష్టంగా మండిపోతున్నా ఈసీ చోద్యం చూస్తూ టీడీపీ హింసాకాండకు పరోక్షంగా సహకరిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది.

ఒత్తిడికి తలొగ్గి హఠాత్తుగా బదిలీలు..

జిల్లాలపై క్షేత్రస్థాయిలో గట్టి పట్టున్న పోలీసు అధికారులు కొనసాగితే ఎన్నికల వేళ తమ పథకం పారదని చంద్రబాబు ముఠా ఆందోళన చెందింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలసి చంద్రబాబు పన్నిన పన్నాగంలో ఈసీ చిక్కుకుంది. విజ్ఞతతో ఆలోచించకుండా ఒత్తిడితో అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంది. సున్నితమైన జిల్లాలు, సమస్యాత్మక నియోజకవర్గాలపై క్షేత్రస్థాయిలో పూర్తి పట్టున్న అధికారులను ఇష్టానుసారంగా బదిలీలు చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తరువాత రాజ్యాంగబద్ధంగా అధికార వ్యవస్థ అంతా ఈసీ ఆధీనంలోకి వెళుతుంది. అధికార యంత్రాంగం ద్వారా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన పూర్తి బాధ్యత ఈసీదే. అయితే టీడీపీ, బీజేపీ ఫిర్యాదులను సహేతుకంగా విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈసీ తన బాధ్యతను విస్మరించి అసంబద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబు, పురందేశ్వరి ఫిర్యాదు చేయడమే ఆలస్యం వారు కోరినట్లుగా పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసేసింది. ఏకంగా 29 మంది అధికారులను బదిలీ చేయడం గమనార్హం. వీరిలో నలుగురు మినహా 25 మంది పోలీసు అధికారులే ఉన్నారు. సమస్యాత్మక నియోజకవర్గాలుగా ఈసీ గుర్తించిన పల్నాడు, ప్రకాశం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోని అధికారులే 90 శాతం మంది ఉండటం గమనార్హం.

పురందేశ్వరి జాబితా ప్రకారమే అంతా..

రాష్ట్ర శాంతి భద్రతలను పర్యవేక్షించాల్సిన డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, నిఘా విభాగం ఇన్‌చార్జ్ పీఎస్ఆర్ ఆంజనేయులతోపాటు పల్నాడు పరిధిని పర్యవేక్షించే గుంటూరు డీఐజీ పాలరాజు, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్ జిల్లాలను పర్యవేక్షించే అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిని ఈసీ హడావుడిగా బదిలీ చేయడం విస్మయకరం. సమస్యాత్మక నియోజకవర్గాలు అత్యధికంగా ఉన్న పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం ఎస్పీలు, విజయవాడ సీపీలను కూడా ఈసీ హఠాత్తుగా బదిలీ చేసింది. అంతేకాకుండా క్షేత్రస్థాయిలో కీలకంగా వ్యవహరించే డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు కలిపి మొత్తం 14 మందిని బదిలీ చేయడం గమనార్హం. ఈ అధికారులంతా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కొద్ది నెలలుగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. అలాంటి వారిని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఈసీ బదిలీ చేయడం విభ్రాంతికరం. పోనీ ఆ స్థానంలో నియమించిన పోలీసు అధికారుల విషయంలోనైనా ఈసీ సహేతుకంగా ఆలోచించి నిర్ణయం తీసుకుందా అంటే అదీ లేదు. చంద్రబాబు ఆదేశాలతో దగ్గుబాటి పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని పోలీసు అధికారులకే ఈసీ పోస్టింగులు ఇవ్వడం విభ్రాంతికరం. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు పోలీసు అధికారులపై ఫిర్యాదు చేయడం సహజం. కానీ ఆ స్థానాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ ఏకంగా జాబితాను సమర్పించడం ఇప్పటివరకు దేశ చరిత్రలోనే లేదు. తమ అధికార పరిధిలో జోక్యం చేసుకోవటాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన ఈసీ అందుకు విరుద్ధంగా జాబితాను ఆమోదించి చేతులు దులుపుకొంది. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ రాజకీయ ఒత్తిళ్లతో వత్తాసు పలకడం పట్ల అధికార వర్గాలు, రాజకీయ పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఈసీ దన్నుతో టీడీపీ విధ్వంసకాండ

తాము చెప్పినట్లుగా ఎన్నికల కమిషన్ ఆడుతుండటంతో టీడీపీ మూకలు యథేచ్ఛగా విధ్వంసానికి దిగాయి. పోలీసు అధికారులను ఈసీ బదిలీ చేసిన జిల్లాల్లోనే హింస చెలరేగడం, పచ్చ ముఠాలు రక్తపాతానికి తెగబడటం గమనార్హం. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతోపాటు సీఎం జగన్‌కు వెన్నంటి నిలిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, పేద వర్గాలే లక్ష్యంగా టీడీపీ దాడులకు పాల్పడుతోంది. పల్నాడు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో టీడీపీ గూండాలు, రౌడీ మూకలు కర్రలు, కత్తులు, బాంబులతో స్వైర విహారం చేస్తున్నారు.

పల్నాడులో పురి విప్పిన ఫ్యాక్షన్..

పల్నాడులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేశ్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడులకు దిగాయి. పిన్నెల్లి కుమారుడు గౌతమ్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులకు తీవ్రగాయాలయ్యాయి. నరసరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసం, ఆసుపత్రులపై టీడీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. గురజాల నియోజకవర్గంలో టీడీపీ నేతలు బాంబు దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. పిడుగురాళ్ల శివారు ప్రాంతం, మాచవరం మండలంలోని కొత్త గణేశునిపాడులో ఎస్సీ, బీసీ కుటుంబాలపై టీడీపీ రౌడీలు దాడులకు తెగబడటంతో బాధితులు రాత్రంగా ఓ గుడిలో తలదాచుకున్నారు.

సీమలో చెలరేగిన హింస..

తిరుపతి జిల్లా చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాహనశ్రేణిపై టీడీపీ మూకలు దాడి చేసి రెండు కార్లను ధ్వంసం చేశాయి. అనంతపురం జిల్లా తాడిపత్రిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తన కుమారుడు అస్మిత్‌రెడ్డి, అల్లుడు దీపక్‌రెడ్డితో కలసి విధ్వంసానికి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై రాళ్లతో దాడులు చేయించారు.

- వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ప్రత్యక్షంగా దాడులకు నేతృత్వం వహించారు. రౌడీలను వెంటబెట్టుకుని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులకు పురిగొల్పారు. కడపలో టీడీపీ మూకలు ముస్లిం మైనార్టీలపై దాడులకు తెగబడి హింసాకాండకు పాల్పడ్డాయి.

దాడులు.. లూటీలు.. విధ్వంసం

టీడీపీ నేతల మూక దాడులతో అట్టుడికిన పల్నాడు జిల్లా

కొత్త గణేశునిపాడులో బీభత్సకాండ

వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న కారణంతో అమాయకులపై దాడులు

వివరాల కోసం ఈ క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేయండి

చొప్పదండిలో గ్యాంగ్‌రేప్?

- ఇన్‌స్టాలో బాలిక పరిచయం.. సన్నిహితంగా ఉన్న ఫొటోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్
- ఏడాదిన్నరగా యువకుడి అత్యాచారం.. స్నేహితులతో చెప్పడంతో వారు అదే దారిలో...

చొప్పదండి: ఇన్‌స్టాగ్రాంలో ఓ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ప్రేమిస్తున్నానని చెప్పి ట్రాప్ చేశాడో యువకుడు. ఆపై బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారం చేశాడు. విషయం తన స్నేహితులకూ చెప్పాడు. వారు కూడా బ్లాక్‌మెయిల్ చేసి అత్యాచారం చేశారు. ఏడాదిన్నరగా ఈ అఘాయిత్యం జరుగుతుండగా, మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. బాధితురాలి బంధువుల కథనం ప్రకారం..ఏడవవార్డు పరిధిలో ఉండే బాలికను చొప్పదండికి చెందిన ఓ యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో ట్రాప్ చేశాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న ఫొటోలు చూపిస్తూ బ్లాక్ మెయిల్ చేసి, అత్యాచారం చేస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని తన స్నేహితుల వద్ద కూడా చెప్పాడు. దీంతో వారంతా ఆ బాలికపై కన్నేశారు. ఆ యువకుడితో సన్నిహితంగా ఉన్న ఫొటోలు చూపించి బ్లాక్‌మెయిల్ చేసి వారు కూడా అత్యాచారం చేస్తూ వచ్చారు. తండ్రి, సోదరుడు జీవనోపాధికి విదేశాలకు వెళ్లారు. దీంతో ఆ బాలిక ఎవరికీ చెప్పుకోలేకపోయింది. రెండు రోజుల కిందట బాలిక బంధువులకు అనుమానం వచ్చి నిలదీశారు. దీంతో ఆ యువకుల బ్లాక్‌మెయిల్ అంశం బయటకు వచ్చింది. బంధువులు ఆ బాలికను కరీంనగర్ పోలీస్ కమిషనర్ కార్యాలయానికి తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నట్లు తెలిసింది.

అత్యాచార ఘటనపై విచారణ చేసేందుకు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు పోలీస్ కమిషనర్ వస్తున్నారంటూ ప్రచారం జరిగింది. దీంతో ఆ నలుగురు యువకుల స్నేహితులు పదులసంఖ్యలో స్టేషన్‌కు వద్దకు చేరుకున్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని స్టేషన్ పరిసరాల నుంచి పక్కకు పంపించారు. ఈ ఘటనలో నలుగురే ఉన్నారా.. ఇంకా ఎవరికైనా సంబంధం అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. రెండేళ్లుగా ఇక్కడి యువకులు ఎక్కువగా గంజాయి తాగుతున్నారు. తాజాగా అత్యాచార ఘటన వెలుగులోకి రావడంతో గంజాయి కోణంలోనూ విచారణ చేస్తున్నారు.

'ఎస్కీ' సందర్శనకు రాష్ట్రపతి అంగీకారం

డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు



రాష్ట్రపతి ద్రౌపదిముర్మును కలిసిన డాక్టర్ రామేశ్వర్‌రావు

రాయదుర్గం: భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ) సందర్శనకు అంగీకరించి నట్టు సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతిని కలిసి ఆహ్వానించినట్టు తెలిపారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభించాలని నిర్ణయించామన్నారు. ఈ సందర్భంగా ఎస్కీ పనితీరు, నిర్వహించే కోర్సులు, శిక్షణలపై రాష్ట్రపతికి వివరించినట్లు పేర్కొన్నారు. జూలై చివరివారం లేదా ఆగస్టు మూడో వారంలో రావడానికి రాష్ట్రపతి సమ్మతించినట్లు తెలిపారు.

వరి కొయ్యకాలు తగలబెట్టొద్దు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: వరి పంట కోశాక దాని కొయ్యకాలను తగుల పెట్టవద్దని రైతులకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. కొయ్యకాలను తగులబెడితే పర్యావరణానికి ముప్పుతో పాటు ఆస్తి, ప్రాణ నష్టం జరగవచ్చునని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. వీటిని నిరోధించే అన్ని రకాల చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడైనా వరి కొయ్యకాలు కాల్చితే చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ఆదేశించారు.

కవిత జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని రౌజ్ అవెన్యూ కోర్టు మరో ఆరురోజులు పొడిగించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పెట్టిన మనీలాండరింగ్ కేసులో కవితకు విధించిన జ్యుడీషియల్ కస్టడీ మంగళవారంతో ముగియడంతో ఆమెను వర్చువల్‌గా కోర్టు ఎదుట హాజరుపరిచారు. జ్యుడీషియల్ కస్టడీ పొడిగింపుపై ట్రయల్‌కోర్టు జడ్జి కావేరి బవేజా విచారణ జరిపారు. మనీలాండరింగ్ కేసులో కవితపై 8వేల పేజీలతో సప్లిమెంటరీ చార్జిషీట్ దాఖలు చేశామని, దీనిని పరిగణనలోకి తీసుకోవాలని ఈడీ తరఫు న్యాయవాది నవీన్‌కుమార్ కోరారు. కవిత బయట ఉంటే సాక్ష్యులను, ఆధారాలను ప్రభావితం చేసే అవకాశముందని, మరో 14 రోజులు కస్టడీ పొడిగించాలన్నారు. కవిత తరఫు న్యాయవాది నితేశ్ రాణా వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి ఆధారాలు లేని కేసులో కవితను జ్యుడీషియల్ కస్టడీలో ఉంచడం సరికాదని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న అనంతరం 6 రోజుల జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తూ.. మే 20న కవితను తమ ముందు హాజరుపరచాలని జడ్జి ఆదేశించారు. ఈడీ దాఖలు చేసిన చార్జిషీట్ సరైన పద్ధతిలో ఉందో? లేదో పరిశీలించి ఆ తర్వాత ఉత్తర్వులు ఇస్తామని చెప్పారు. చార్జిషీట్‌పై తదుపరి విచారణ ఈ నెల 20న చేపడతామన్నారు.

దక్కన్ కాలేజీ కాల్పుల కేసులో హైకోర్టు తీర్పు

ట్రయల్ కోర్టు విధించిన పదేళ్ల జైలు శిక్షకు సమర్థన

సాక్షి, హైదరాబాద్: ర్యాగింగ్‌లో భాగంగా 2007లో హైదరాబాద్ దారుస్సలాంలోని దక్కన్ ఇంజనీరింగ్ కాలేజీలో కాల్పులకు పాల్పడిన మహమ్మద్ ఉమీదుల్లా ఖాన్‌కు కింది కోర్టు విధించిన తీర్పులో జోక్యానికి హైకోర్టు నిరాకరించింది. ట్రయల్ కోర్టు ఖాన్‌కు పదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేలు జరిమానా విధిస్తూ వెలువరించిన తీర్పును ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. ట్రయల్ కోర్టు తీర్పును కొట్టివేయాలంటూ ఖాన్ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ ఈవీ వేణుగోపాల్ తీర్పు ఇచ్చారు. 2007 ఏప్రిల్‌లో దక్కన్ కాలేజీలో ముఖర్రం సిద్దిఖీపై కాల్పులకు సంబంధించి నమోదైన కేసులో కిందికోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఖాన్ దాఖలు చేసిన అప్పీల్‌ను తోసిపుచ్చారు. కాల్పులను ప్రాసిక్యూషన్ సాక్ష్యాధారాలతో నిరూపించిందని, చిన్నపాటి లోపాలున్నాయని చెప్పి మొత్తం ప్రాసిక్యూషన్‌ను తప్పుపట్టలేమన్నారు. కాల్పుల తర్వాత ఘటనా స్థలానికి వెళ్లిన అప్పటి కార్వాన్ ఎమ్మెల్యే గన్‌మెన్ సాక్ష్యం కీలకంగా ఉందని అభిప్రాయపడ్డారు. కాల్పులకు ముందు, తర్వాత పరిస్థితులు అతని సాక్ష్యంలో ఉన్నాయని చెప్పారు. 'పిటిషనర్ చేతిలో రివాల్వర్ ఉన్నట్లు బాధితుడు చెప్పాడు. కాల్పులు జరిపిన ఖాన్ బీటెక్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడంటే రివాల్వర్‌తో కాల్పులు జరిపితే ఏమౌతుందో తెలియని వ్యక్తి కాదు. ఖాన్‌ని చంపాలన్న ఉద్దేశం ఉన్నట్లు అనిపించింది. బుల్లెట్ గాయాలు ఎక్కడెక్కడ ఉన్నాయన్నది డాక్టరు, బాధితుడు చెప్పినవి ఒకేలా ఉన్నాయి. కాల్పులను ప్రాసిక్యూషన్ నిర్ధారించినందున కింది కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యానికి ఆస్కారం లేదు' అని జస్టిస్ వేణుగోపాల్ తీర్పులో పేర్కొన్నారు.

టెట్‌పై టీ-శాట్‌లో ప్రత్యక్ష ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు హాజరయ్యే అభ్యర్థులకు టీ- శాట్‌లో మెళకువలతో పాటు సలహాలు, సూచనలు అందిస్తామని సీఈఓ బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఐదు సబ్జెక్టులపై ఈనెల 15వ తేదీ నుంచి 18 వరకు అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో టీసాట్‌లో ప్రత్యక్ష ప్రసారాలు ఉంటాయని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి జూన్ 3 వరకు టెట్ నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 15న సైకాలజీ, 16న టీచింగ్ మెథడ్స్, 17న తెలుగు, 18న ఫిజికల్ సైన్స్, మాథ్స్ సబ్జెక్ట్‌లపై ప్రత్యక్ష ప్రసారాలు ఉంటాయన్నా రు. ప్రసారాలు నిపుణ చానల్‌తోపాటు టీ- సాట్ విద్యా చానల్‌లో మరుసటి రోజు సాయంకాలం 5 నుంచి 6 గంటల వరకు పునఃప్రసా రమవుతాయని వివరించా రు. ఇప్పటికే టెట్ అభ్యర్థుల కోసం 200 ఎపిసోడ్స్ టీ-సాట్ డొమైన్‌లో అందు బాటులో ఉన్నాయని, మరిన్ని వివరాలు, సందేహాలు-సమాధానాల కోసం 040-3540 326/726, టోల్ ఫ్రీ నంబరు1800 425 4039 కు ఫోన్ చేయొచ్చని వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

లోక్‌సభ పోలింగ్ 66.3 శాతం

▶ మొదటి పేజీ తరువాయి

రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం రాలేదని చెప్పారు. ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామాగ్రిని పరిశీలకులు/అభ్యర్థులు/ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో తనిఖీ చేసి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపర్చినట్టు వెల్లడించారు. స్ట్రాంగ్ రూమ్‌లను సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. వచ్చే నెల 4వ తేదీన 34 కౌంటింగ్ సెంటర్లలో పరిశీలకులు, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఆ ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తామని చెప్పారు. కౌంటింగ్ తర్వాత ఈవీఎంలను కొంత కాలం తిరిగి స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరుస్తామని వెల్లడించారు.

	2024 లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు..				ఓటు వేసిన వారి సంఖ్య				2024	2019
లోక్‌సభ స్థానం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ శాతం	పోలింగ్ శాతం
ఆదిలాబాద్	8,04,875	8,45,213	87	16,50,175	5,99,108	6,22,410	35	12,21,553	74.03	71.44
పెద్దపల్లి	7,87,705	8,08,622	103	15,96,430	5,40,807	5,42,627	33	10,83,467	67.87	65.43
కరీంనగర్	8,77,483	9,19,565	102	17,97,150	6,34,663	6,68,982	45	13,03,690	72.54	69.45
నిజామాబాద్	8,06,130	8,98,647	90	17,04,867	5,52,465	6,73,629	39	12,26,133	71.92	68.33
జహీరాబాద్	8,01,862	8,39,489	59	16,41,410	6,08,097	6,16,936	16	12,25,049	74.63	69.67
మెదక్	9,02,110	9,25,891	209	18,28,210	6,88,854	6,83,975	65	13,72,894	75.09	71.72
మల్కాజ్‌గిరి	19,45,624	18,33,430	542	37,79,596	9,95,791	9,23,206	134	19,19,131	50.78	79.4
సికింద్రాబాద్	10,86,875	10,33,396	130	21,20,401	5,37,166	5,02,636	32	10,39,834	49.04	46.26
హైదరాబాద్	11,25,283	10,91,615	196	22,17,094	5,62,498	5,12,302	27	10,74,827	48.48	44.75
చేవెళ్ల	15,04,260	14,33,830	280	29,38,370	8,53,237	8,03,827	43	16,57,107	56.4	53.22
మహబూబ్‌నగర్	8,32,256	8,50,172	42	16,82,470	6,12,924	6,05,647	16	12,18,587	72.43	65.39
నాగర్‌కర్నూల్	8,64,875	8,73,340	39	17,38,254	6,13,081	5,94,370	19	12,07,470	69.46	62.29
నల్లగొండ	8,44,843	8,80,453	169	17,25,465	6,33,597	6,43,450	90	12,77,137	74.02	74.11
భువనగిరి	8,98,416	9,10,090	79	18,08,585	7,02,636	6,86,003	41	13,88,680	76.78	74.39
వరంగల్	8,95,421	9,28,648	397	18,24,466	6,26,704	6,29,512	85	12,56,301	68.86	63.65
మహబూబాబాద్	7,47,836	7,84,424	106	15,32,366	5,42,366	5,58,616	48	11,01,030	71.85	68.79
ఖమ్మం	7,87,160	8,43,749	130	16,31,039	6,05,969	6,35,099	67	12,41,135	76.09	75.16
మొత్తం	1,65,13,014	1,67,00,574	2,760	3,32,16,348	1,09,09,963	1,09,03,227	835	2,18,14,025	65.67	62.69

నోట్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 66.3 శాతం పోలింగ్ నమోదైనట్టు సీఈఓ వికాస్‌రాజ్ ప్రకటించినా.. ఈసీ విడుదల చేసిన టేబుల్‌లో మాత్రం మొత్తం పోలింగ్ శాతాన్ని 65.67గా చూపారు. టేబుల్ తయారీలో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను పరిగణనలోకి తీసుకోకపోవడంతో శాతం 65.67గా వచ్చిందని అధికారులు తెలిపారు



ప్రధాని నామినేషన్

వారణాసికి తరలివచ్చిన కేంద్ర మంత్రులు, సీఎంలు, ఎన్‌డీఏ పక్ష నేతలు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం వారణాసి నుంచి ప్రధాని మోదీ మంగళవారం నామినేషన్ దాఖలుచేశారు. మూడోసారి వారణాసి నుంచి బరిలో దిగిన మోదీకి మద్దతుగా కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్‌డీఏ కూటమి పార్టీల అగ్రనేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని నామినేషన్‌ను ప్రతిపాదించిన నలుగురిలో ఒక బ్రాహ్మణుడు, ఇద్దరు ఓబీసీలు, ఇక దళితుడు ఉన్నారు. పండిట్ జ్ఞానేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుష్వాహా, సంజయ్ సోంకర్‌లు మోదీ నామినేషన్‌ను ప్రతిపాదించారు. అయోధ్యలో బాలరామాలయం ప్రాణ ప్రతిష్ఠ క్రతువుకు ముహూర్తాన్ని నిర్ణయించిన పండితుల్లో జ్ఞానేశ్వర్ శాస్త్రి కూడా ఒకరు. బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుష్వాహా ఓబీసీలు కాగా, సోంకార్ బీజేపీ వారణాసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న దళిత నేత.

కలెక్టరేట్ నిండా ప్రముఖులే

బీజేపీ చీఫ్ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, హర్‌దీప్‌సింగ్ పురీ, అనుప్రియా పటేల్, రాందాస్ అథవాలే, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, హిందుస్తానీ అవామ్ మోర్చా(ఎస్) వ్యవస్థాపకుడు జితన్ రాం మాంఝీ, రాష్ట్రీయ లోక్‌మోర్చా చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, నిషద్ పార్టీ చీఫ్ సంజయ్ నిషద్, సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ చీఫ్ ఓం ప్రకాశ్ రాజ్‌భర్, ఆర్‌ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి, ఎల్‌జేపీ(రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, అన్బుమణి రాందాస్, తమిళ మానిల కాంగ్రెస్ చీఫ్ జీకే వాసన్, బీజేపీ నేత దేవనాథన్ యాదవ్, భారతధర్మ జనసేన అధ్యక్షుడు తుషార్ వెల్లపల్లి, అసోమ్ గణపరిషత్ అధ్యక్షుడు అతుల్ బోరాలు వారణాసి కలెక్టరేట్‌లో మోదీ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. మోదీ నామినేషన్ వేయడానికి వస్తున్నారని తెలిసి స్థానికులు పెద్ద సంఖ్యలో వారణాసి కలెక్టరేట్‌కు వచ్చారు. నామినేషన్ వేశాక మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. '' ఎన్‌డీఏ నేతలు మద్దతుగా ఇక్కడకు రావడం నాకు గర్వకారణం. దేశ ప్రగతికి, అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎన్‌డీఏ కూటమి కంకణబద్ధమైంది. భవిష్యత్తు లోనూ ఇలాగే దేశ ప్రగతికి పాటుపడతాం' అని మోదీ అన్నారు.

దశశ్వమేథ్ ఘాట్‌లో పూజలు

నామినేషన్ వేయడానికి ముందు మోదీ మంగళవారం ఉదయం కాశీలో గంగా తీరాన దశశ్వమేథ్ ఘాట్‌లో పూజలు చేశారు. ఘాట్ వద్ద వేదమంత్రాల మధ్య గంగా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత పడవలో నమో ఘాట్‌కు వెళ్లారు. అక్కడి కాలభైరవ ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లారు.

బూత్‌కు '370' ఓట్లు ఎక్కువ పడాలి

నామినేషన్ తర్వాత కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌లో కాశీ నియోజకవర్గ బీజేపీ నేతలు, కార్యకర్తలతో మోదీ సమావేశమయ్యారు. ''జమ్మూకశ్మీర్‌లో రద్దయిన ఆర్టికల్ 370కి గుర్తుగా కాశీలోని ప్రతి బూత్‌లో గతంతో పోలిస్తే నాకు 370 ఎక్కువ ఓట్లు పడేలా చేసే బాధ్యత మీదే' అని మోదీ అన్నారు. కేంద్ర, యూపీ రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి మరింతగా ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలకు మోదీ విజయమంత్రాలను ఉపదేశించారని బీజేపీ ఒక ప్రకటనలో పేర్కొంది. కాంగ్రెస్ యూపీ చీఫ్ అజయ్ రాయ్, బీఎస్పీ నేత అథ్‌హర్ జమాల్ లారీ మోదీకి పోటీగా బరిలో నిలబడ్డారు.



మంగళవారం వారణాసిలో అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ప్రధాని మోదీ

సొంత ఇల్లు, కారు లేదు
మోదీ అఫిడవిట్

మోదీ తన స్థిరచరాస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. అఫిడవిట్ ప్రకారం.. మోదీకి సొంత భూమి, ఇల్లు, కారు లేవు. చేతిలో రూ.52,920 నగదు ఉంది. రూ.3.02 కోట్ల చరాస్తులు ఉన్నాయి. 2018–19లో రూ.11,14,230గా ఉన్న ఆదాయం 2022–23 వచ్చేసరికి రూ.23,56,080కు పెరిగింది. గాంధీనగర్ ఎస్‌బీఐ బ్రాంచీలో రూ.73,304, వారణాసి ఎస్‌బీఐ బ్రాంచీలో రూ. 7,000 నగదు ఉంది. ఎస్‌బీఐలో రూ.2.85 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. రూ.2.67 లక్షల విలువైన, 45 గ్రాముల బరువైన నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. 9.12 లక్షల విలువైన నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు ఉన్నాయి. నామినేషన్ పత్రాల్లో భార్య పేరును జశోదాబెన్‌గా పేర్కొన్న మోదీ ఆమె ఆస్తుల వివరాలు తనకు తెలియదని పేర్కొన్నారు. ఆయనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. ఆయనకు అప్పులు కూడా లేవు. 1967లో ఎస్‌ఎస్‌సీ, 1978లో ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ డిగ్రీ, 1983లో గుజరాత్ యూనివర్సిటీలో ఎంఏ పూర్తిచేశారు. 2019 ఎన్నికల అఫిడవిట్‌లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఒక ప్లాట్ ఉందని పేర్కొన్న మోదీ ఈసారి దానిని ప్రస్తావించలేదు.

నిందితుల జాబితాలో ఆప్

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ స్కామ్ సంబంధ మనీ లాండరింగ్ కేసులో తదుపరి చార్జ్‌షీటులో ఆమ్ ఆద్మీ పార్టీని నిందితుల జాబితాలో చేర్చుతామని మంగళవారం ఢిల్లీ హైకోర్టుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. ఈ కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి మనీశ్ సిసోడియా బెయిల్‌కు సంబంధించిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈడీ ఈ విషయం తెలిపింది. సిసోడియాకు బెయిల్ ఇవ్వొద్దని జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఈడీ తరఫు న్యాయవాది కోరారు. ' సిసోడియా ఎక్కువ పిటిషన్లు వేశారని చెబుతున్నారు. కానీ పిటిషన్ల వల్ల విచారణ ఎందుకు ఆలస్యమవుతోందో ఈడీ చెప్పట్లేదు'' అని సిసోడియా తరఫు న్యాయవాది మోహిత్ మాథుర్ వాదించారు. ''పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తూ కేసులో చార్జ్‌షీటు ప్రక్రియ ముందుకు సాగకుండా నిందితులు అవరోధాలు సృష్టిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటి దాకా 17 మందినే అరెస్ట్ చేస్తే నిందితులు ట్రయల్ కోర్టులో ఏకంగా 250 పిటిషన్లు వేశారు. పిటిషన్ల విచారణ నేపథ్యంలో దర్యాప్తు అధికారి దర్యాప్తును వదిలేసి ప్రతిరోజూ కోర్టుకు హాజరుకావాల్సి వస్తోంది' అని ఈడీ లాయర్ వాదించారు. చార్జ్‌షీటు ఆలస్యానికి నిందితులే కారణమని సీబీఐ సైతం వాదించింది. ఎప్పటికప్పుడు కొత్త వ్యక్తులను అరెస్ట్‌చేస్తూ ఈ కేసు విచారణ త్వరగా ముగిసిపోకుండా ఈడీ, సీబీఐ ప్రయత్నిస్తున్నాయని సిసోడియా తరఫు న్యాయవాది వాదించారు. వాదోపవాదనలు విన్నాక జడ్జి తన తీర్పును రిజర్వ్ చేశారు.

ఉండమ్మా.. బొట్టు పెడతా !



ఎన్నికల విచిత్రం

జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లాలో మంగళవారం జేఎంఎం లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య, జేఎంఎం నేత కల్పనా సోరెన్‌కు బొట్టు పెడుతున్న ఓ అభిమాని.

రఫాలో ఇజ్రాయెల్ సైన్యం దాడి.. భారత మాజీ సైనికాధికారి మృతి

పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని ఐరాస సెక్రటరీ జనరల్ డిమాండ్



ఐక్యరాజ్యసమితి: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో భారతీయ మాజీ సైనికాధికారి కల్నల్ వైభవ్ అనిల్ కాలే(46) బలయ్యారు. గాజాలోని రఫా నగరంలో ఇజ్రాయెల్ సైన్యం దాడిలో అతడు ప్రయాణిస్తున్నవాహనం ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడిన అనిల్ కాలే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఇజ్రాయెల్ విచారం వ్యక్తం చేసింది. తమ సైన్యం చేసిన దాడిపై ప్రత్యేక దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించింది. అనిల్ కాలే ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో బి.ఎ. చదివాడు. 'బిహేవియరల్ సైన్స్', 'ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియల్ లా'లో డిగ్రీలు సాధించారు. ఐఐఎం–లక్నో, ఐఐఎం –ఇండోర్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. 2004 ఏప్రిల్‌లో భారత సైన్యంలో చేరారు. 2009, 2010లోఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కంటింజెంట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సేవలందించారు. సైనికుడిగా జమ్మూకశ్మీర్‌లో పని చేశారు. 2022లో భారత సైన్యం నుంచి పదవీ విరమణ చేశారు. రెండు నెలల క్రితమే ఐక్యరాజ్యసమితి డిపార్టుమెంట్ ఆఫ్ సేఫ్టీ, సెక్యూరిటీ(డీఎస్‌ఎస్)లో సెక్యూరిటీ కో–ఆర్డినేషన్ ఆఫీసరుగా చేరారు. అనిల్ కాలే సోమవారం ఉదయం ఐక్యరాజ్యసమితి వాహనంలో మరో డీఎస్‌ఎస్ అధికారితో కలిసి రఫాలోని యూరోపియన్ హాస్పిటల్‌కు బయలుదేరగా ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడి చేసింది. ఈ దాడిలో అనిల్ కాలే మృతిచెందగా, మరో అధికారి తీవ్రంగా గాయపడ్డారు. అతడు ఎవరన్నది ఇంకా గుర్తించలేదు.

ఐరాస సెక్రెటరీ జనరల్ గుటెరస్ దిగ్భ్రాంతి

కల్నల్ అనిల్ కాలే మరణం పట్ల ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను తీవ్ర విషాదానికి గురిచేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనిల్ కాలే మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేశారు. అనిల్ కాలే కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. గాజాలో విధి నిర్వహణలో ఉన్న ఐక్యరాజ్యసమితి సిబ్బందిపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను గుటేరస్ ఖండించారు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని సూచించారు. బందీలను విడుదల చేయాలని హమాస్ మిలిటెంట్లకు హితవు పలికారు. కల్నల్ వైభవ్ అనిల్ కాలే మరణం పట్ల ఐక్యరాజ్యసమితిలోని భారత ప్రతినిధి బృందం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మంగళవారం సంతాపం ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరాటం మొదలైన తర్వాత గాజాలో ఇప్పటివరకు 190 మందికిపైగా ఐక్యరాజ్యసమితి సిబ్బంది మరణించారు. గాజాలో ఐక్యరాజ్యసమితి తరఫున పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన తొలి విదేశీయుడు అనిల్ కాలే కావడం గమనార్హం. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన అనిల్ కాలే కుటుంబం పుణేలో స్థిరపడింది. మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యుడు రిటైర్డ్ వింగ్ కమాండర్ ప్రశాంత్ కర్డే చెప్పారు. పుణేలో అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. అనిల్ కాలేకు భార్య అమృత, కుమారుడు వేదాంత్, కుమార్తె రాధిక ఉన్నారు. ఆయన సోదరుడు విశాల్ కాలే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. సోదరుడి వరుసయ్యే కల్నల్ అమేయ్ కాలే భారత సైన్యంలో పనిచేస్తున్నారు.

గౌతమ్ నవ్‌లఖాకు సుప్రీం బెయిల్



న్యూఢిల్లీ: హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖాకు ఎల్గర్ పరిషద్– మావోయిస్టులతో సంబంధాల కేసులో సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో కోర్టు విచారణ పూర్తయ్యేసరికి ఎంత సమయం పడుతుందో చెప్పలేమంటూ జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భాటిలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. గౌతమ్ నవ్‌లఖాకు కిందకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై బాంబే హైకోర్టు విధించిన స్టేను పొడిగించేందుకు నిరాకరించింది. గృహ నిర్బంధంలో ఉన్న సమయానికి గాను పోలీసు భద్రత నిమిత్తం రూ. 20 లక్షలు చెల్లించాలని నవ్‌లఖాకు సూచించింది. 'హైకోర్టు స్టేను పొడిగించడానికి మాకు కారణాలేమీ కనబడటం లేదు. నవ్‌లఖా నాలుగేళ్లకు పైగా నిర్బంధంలో ఉన్నారు. ఇంకా అభియోగాలే నమోదు చేయలేదు. కోర్టు విచారణ పూర్తయ్యేసరికి ఏళ్లకు ఏళ్లు పడుతుంది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

థాయ్ హక్కుల కార్యకర్త జైలులోనే మృతి



బ్యాంకాక్: క్రూరమైన రాచరిక చట్టాలు సహా దేశ న్యాయ వ్యవస్థలో సంస్కరణల కోసం పోరాటం సాగిస్తున్న థాయ్‌లాండ్ హక్కుల యువ ఉద్యమకారిణి నెటిపార్న్ సనేశంగ్‌ఖామ్(28) మంగళవారం జైలులోనే కన్నుమూశారు. రాచరికాన్ని తూలనాడటం వంటి వేర్వేరు ఆరు ఆరోపణలను ఆమె ఎదుర్కొంటున్నారు. కోర్టు ధిక్కారం కింద ఈ ఏడాది జనవరిలో నెటిపార్న్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మరునాటి నుంచే జైలులో ఆమె నిరాహార దీక్ష మొదలుపెట్టారు. ఫిబ్రవరి నుంచి నీళ్లు మాత్రమే తాగుతున్నారు. ఏప్రిల్ నుంచి ఆహారం తీసుకుంటున్నారు. అయితే, దీక్ష కారణంగా నెటిపార్న్ పూర్తిగా బలహీనంగా మారారని, అనీమియాతో ఇబ్బంది పడుతున్న ఆమె విటమిన్లు, ఎలక్ట్రోలైట్‌లను కూడా తిరస్కరిస్తున్నారని జైలు అధికారులు చెబుతున్నారు. మంగళవారం వేకువజామున ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయిందని, ఆస్పత్రికి తరలించినా ఫలితం దక్కలేదని అంటున్నారు.

న్యాయవాద వృత్తి విశిష్టమైనది

వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి రాదు ● సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు

న్యూఢిల్లీ: న్యాయవాద వృత్తి చాలా విశిష్టమైందని, ఇది ఇతర సంప్రదాయ వృత్తుల్లాంటిది కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాద వృత్తి సేవాభావంతో కూడకున్నదని, పవిత్రమైందని, ఇందులో వ్యాపార, వాణిజ్యానికి తావులేదని వెల్లడించింది. న్యాయవాదుల పనివిధానం ప్రత్యేకంగా ఉంటుందని పేర్కొంది. వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి న్యాయవాదులను చేర్చలేమంటూ కీలక తీర్పు వెలువరించింది. సేవాలోపం కింద వినియోగదారుల కోర్టుల్లో వారిపై దావా వేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. లాయర్లు అందించే సేవలు వ్యక్తిగత సేవల కిందికి వస్తాయని పేర్కొంది. లాయర్ల సేవలు పొందడం ఒక కాంట్రాక్టు లాంటిదేనని ఉద్ఘాటించింది. 'సర్వీసు' నిర్వచనం నుంచి న్యాయవాదులకు మినహాయింపు ఉందని స్పష్టం చేసింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం –1986 పరిధిలోకి లాయర్లు, వారు అందించే సేవలు వస్తాయని స్పష్టం చేస్తూ 2007లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌ఎస్) ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ న్యాయవాదుల సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. 1986 నాటి చట్టం స్థానంలో తీసుకొచ్చిన వినియోగదారుల పరిరక్షణ చట్టం–2019 పరిధిలో న్యాయవాదులను చేర్చలేదని వెల్లడించింది. పిటిషన్‌ను కొట్టివేసింది. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని తెలిపింది. న్యాయవాదులు కూడా న్యాయ వ్యవస్థలో భాగమేనని వివరించింది. న్యాయ వ్యవస్థను స్వతంత్రను కాపాడడంలో న్యాయవాదులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని ధర్మాసనం స్పష్టంచేసింది.

వైద్యులపై తీర్పును పునఃసమీక్షించాలి

వైద్య వృత్తిని వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలో చేరుస్తూ 1995లో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వెరసెస్ వి.పి.శాంత కేసులో సుప్రీంకోర్టు 1995లో తీర్పు ఇచ్చింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం–1986లోని సెక్షన్ 2(1)(ఓ) కింద నిర్వచించిన సేవలు అనే విభాగంలో వైద్య వృత్తిని కూడా చేర్చాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. తాజాగా దీనిపై ధర్మాసనం స్పందించింది. 1995 నాటి తీర్పును పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నివేదించింది.



ఇతను విమానం దొంగ

- 110 రోజుల్లో 200 ప్రయాణాలు
- లక్షల విలువైన నగల చోరీ

న్యూఢిల్లీ: రాజేశ్ కపూర్.. వయసు 40 ఏళ్లు. ఉండేది ఢిల్లీలో. ఇతడొక వింత దొంగ. విమానాల్లో ప్రయాణిస్తూ బంగారు నగలు చోరీ చేయడం ఇతడికి ఇష్టం. బంగారం అమ్మేయగా వచ్చిన డబ్బులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల్లో పెట్టడం మరో హాబీ. తప్పుడు ధ్రువపత్రాలతో విమానం టికెట్లు కొంటాడు. ఆ టైమ్‌లో మనసుకు తోచిన ఫోన్ నెంబర్ ఇచ్చేస్తాడు. ఇదంతా ఆధారాలు దొరక్కుండా చేయడానికే అన్నమాట! విమానం ఎక్కాక వృద్ధులు, మహిళలనే తన టార్గెట్‌గా ఎంచుకుంటాడు. ఎయిర్ హోస్టెస్‌లను రిక్వెస్ట్ చేసి, తన టార్గెట్ పక్క సీట్లో కూర్చుంటాడు. అదును చూసి వారి బ్యాగులు, పర్సుల్లోని నగలు కాజేస్తాడు. ఏమీ తెలినట్టుగా ఎయిర్‌పోర్టులో దిగిపోతాడు. 110 రోజుల్లో ఏకంగా 200 విమాన ప్రయాణాలు చేశాడు. రూ.లక్షల విలువైన బంగారం మూటగట్టుకున్నాడు. చివరకు పాపం పండింది. పోలీసులకు దొరికిపోయాడు. అమృత్‌సర్ నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణిస్తుండగా రూ.20 లక్షల విలువైన బంగారం పోయిందని ఈ ఏడాది ఫిబ్రవరి 2న అమెరికా పౌరుడొకరు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి విమానంలో వెళ్తుండగా రూ.7 లక్షల విలువైన నగలు చోరీకి గురయ్యాయని ఓ మహిళ ఏప్రిల్ 11న ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరుడి కోసం వేట మొదలుపెట్టారు. రాజేశ్ కపూర్ ఇచ్చిన ఆధారాలు నకిలీవి కావడంతో అతడిని పట్టుకోవడం తొలుత కష్టంగా మారింది. 100 సీసీ కెమెరాల దృశ్యాలను జల్లెడట్టి రాజేశ్‌ను అరెసట్‌చేశారు. రాజేశ్‌కు ఢిల్లీలో సొంత గెస్ట్‌హౌజ్ ఉంది. మొబైల్ రిపేర్ షాపు ఉంది. గతంలో రైళ్లలో దొంగతనాలు చేసేవాడు. ఒకసారి దొరికిపోయి కొన్నాళ్లు నిశ్శబ్దంగా ఉన్నాడు. తర్వాత విమానాల్లో చోరీకి శ్రీకారం చుట్టాడు.

ముంబైలో హోర్డింగ్ కూలిన ఘటనలో 14కు పెరిగిన మృతులు

ముంబై: ముంబైలో సోమవారం సాయంత్రం అకాల వర్షాలు, భారీ ఈదురుగాలుల కారణంగా భారీ హోర్డింగ్ కూలిన ఘటనలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటనలో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 21 గంటల తర్వాత కూడా సహాయ చర్యలు కొలిక్కి రాలేదు. ఘట్కోపర్ ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన 120 చదరపు అడుగుల భారీ హోర్డింగ్ కుప్పకూలడం తెలిసిందే. ఈ ఘటనలో మంగళవారం సాయంత్రం వరకు హోర్డింగ్ కింద చిక్కుకున్న 89 మంది క్షతగాత్రులను బయటకు తీయగలిగారు. ముంబై, థానెల్లోని వేర్వేరు ఆస్పత్రుల్లో వీరిని చేర్పించారు. చికిత్స అనంతరం 32 మంది డిశ్చార్జి అయ్యారు. ఘటనాస్థలిలో సోమవారం సాయంత్రం నుంచి 100 మందితో కూడిన రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు మరో 125 మంది బీఎంసీ సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. రెండు 500 టన్నుల సామర్థ్యమున్న క్రేన్లు, రెండు హైడ్రా క్రేన్లు, రెండు ప్రొక్లెయినర్లతో భారీ హోర్డింగ్ గర్డర్లను పక్కకు తొలగించి, కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నాలు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు మూడు గర్డర్లను తీయగలిగామని ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ నిఖిల్ ముథోల్కర్ చెప్పారు. , మరో రెండు గర్డర్లను కూడా తీయగలిగితే అడుగున ఎందరు చిక్కుకున్నదీ తెలుస్తుందని చెప్పారు. అయితే, పెట్రోల్ పంప్ ప్రాంతం కావడంతో మండే స్వభావం ఉన్న గ్యాసొలిన్, ఆక్సీ ఫ్యూయల్ కట్టర్‌లను వాడలేకపోతున్నామన్నారు.

భోజనానికి గంట ముందు, తర్వాత టీ, కాఫీలు వద్దు: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: భోజనానికి గంట ముందు, తర్వాత టీ, కాఫీలు తాగొద్దని ప్రజలను భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) హెచ్చరించింది. టీ, కాఫీల్లో ఉండే ట్యానిన్లు ఆహారంలోని ఇనుమును శరీరం సంగ్రహించకుండా అడ్డుపడతాయని తెలిపింది. ఆరోగ్యవంతమైన జీవనం కోసం భారతీయులు పాటించాల్సిన ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంటూ 17 రకాల సలహాలు,సూచనలను ఇటీవలే ఐసీఎంఆర్ విడుదలచేసింది. ఐసీఎంఆర్‌లోని పరిశోధనా విభాగమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్‌ఐఎన్) ఈ నియమావళి రూపకల్పనలో పాలుపంచుకుంది. ''భోజనం చేయగానే అందులోని ఐరన్ ధాతువును శరీరం శోషించుకునే పని మొదలెడుతుంది. ఇనుమును సంగ్రహించి రక్తంలో కలిపేస్తుంది. మనం పీల్చిన గాలిలోని ఆక్సిజన్‌ను రక్తం శరీరమంతటికీ సరఫరా చేయాలంటే ఇనుము అవసరం. ఇనుము సమపాళ్లలో లేకపోతే ఆక్సిజన్ సరిగా అందక శరీర కణాల సామర్థ్యం తగ్గిపోతుంది. ఇదంతా సక్రమంగా జరగాలంటే ఇనుము శోషణ సాఫీగా జరగాలి. కానీ కాఫీ, టీలు తాగితే వాటిలోని ట్యానిన్ అనే రసాయనం ఈ శోషణ ప్రక్రియకు పెద్ద అవరోధంగా తయారవుతుంది. ట్యానిన్ ఇనుముకు అతుక్కుపోయి రక్తంలో ఇనుము సులభంగా కలిసిపోనివ్వదు. దాంతో రక్తంలో ఐరన్ లోపిస్తుంది. ఐరన్‌లోపం చివరకు రక్తహీనతకు దారితీస్తుంది'' అని ఐసీఎంఆర్ వివరించింది.

ఎలక్షన్ బీట్

కాంగ్రెస్ వస్తే రామ్‌లల్లా మళ్లీ టెంట్‌లోకే..

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

రాంచీ: విపక్ష కాంగ్రెస్ సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో వస్తే అయోధ్య రామ్‌లల్లాను మళ్లీ టెంట్‌లోకి పంపించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మంగళవారం జార్ఖండ్‌లోని గిరిదీలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. జార్ఖండ్‌లో జేఎంఎం–కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా మారిపోయిందన్నారు. బుజ్జగింపు, వారసత్వ రాజకీయాలే ఆ పార్టీల విధానమని ధ్వజమెత్తారు. అవినీతి, బుజ్జగింపు, వారసత్వ రాజకీయాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అయోధ్యలో రామమందిరం విషయంలో సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ నాయకులు తప్పుపడుతున్నారని, అధికారంలోకి వస్తే ఆలయ ప్రాంగణానికి తాళం వేసేందుకు కుతంత్రాలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాలు నక్సలిజాన్ని ప్రజలపై రుద్దాయని విమర్శించారు. నక్సలిజాన్ని కట్టడి చేయడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు.

మోదీ జ్యోతిష్కుడా?: ప్రియాంక

న్యూఢిల్లీ/అమేథీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. మోదీ ఏమైనా జ్యోతిష్కుడా అని ప్రశ్నించారు. 'నేనైతే జ్యోతిష్యురాలిని కాదు. ఒకవేళ ప్రధాని జ్యోతిష్కుడైతే చెప్పండి' అని మోదీ వ్యాఖ్యలపై స్పందిస్తూ వ్యాఖ్యానించారు. పార్టీల పనితీరును బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. రాయ్‌బరేలీ, అమేథీలతో తమ బంధం రాజకీయాలకు అతీతమైనదని పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు పెట్టుకొని కాంగ్రెస్ యూపీలో 17 స్థానాల్లో పోటీచేస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏం జరుగుతోందో చూడాలని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏం చేస్తున్నామో చూడాలని, దీన్ని దృష్టిలో పెట్టుకొని విచక్షణతో ఓటేయాలని పిలుపిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న వాళ్ల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రియాంక అన్నారు. రాయ్‌బరేలీ, అమేథీలలో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ పోటీస్తుండగా, అమేథీలో గాంధీ కుటుంబం తమ నమ్మినబంటు కిశోరీలాల్ శర్మను బరిలోకి దింపింది. ఈ రెండు నియోజకవర్గాల ఎన్నికల బాధ్యతలను ప్రియాంక భుజానికెత్తుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

మండీలో కంగనా రనౌత్ నామినేషన్

షిమ్లా: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ లోక్‌సభ నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని, ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయిస్తానని, రైల్వే లైన్ తీసుకొస్తానని ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ హామీ ఇచ్చారు. మండీ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగించారు. భవిష్యత్తులో కూడా మండీ నుంచి నామినేషన్ దాఖలు చేసే అవకాశం తనకు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీపై పిటిషన్‌కు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేయకుండా నిషేధం విధించాలని విజ్ఞప్తి చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టులో తోసిపుచ్చింది. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి విద్వేషపూరిత ప్రసంగాలు చేశారని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఫాతిమా అనే వ్యక్తి ఆరోపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల్లో ఆరేళ్లపాటు మోదీ పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని, ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్.సి.శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పందించింది. తొలుత సంబంధిత అధికారులను ఆశ్రయించాలని, వారికి ఫిర్యాదు చేయాలని పిటిషనర్‌కు సూచించింది. పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో ఫాతిమా తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

బీజేపీ 230 దాటదు: కేజ్రీవాల్

చండీగఢ్: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రాబల్యం కోల్పోతోందని, ఆ పార్టీకి 230 స్థానాలకు మించి రావని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కురుక్షేత్రలో ఆప్ అభ్యర్థి సుశీల్ గుప్తాకు మద్దతుగా పెహోవాలో మంగళవారం కేజ్రీవాల్ రోడ్‌షో నిర్వహించారు. 'మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. మార్చి 21న నన్ను జైలుకు పంపారు. అంటే కేజ్రీవాల్ ప్రచారం చేయకూడదనేది వారి ఉద్దేశం. కేజ్రీవాల్ అంటే వారికి భయం' అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి. దారుణంగా ఓడిపోనుంది. హర్యానా, రాజస్తాన్, మహారాష్ట్ర, కర్నాటక, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఢిల్లీ, పంజాబ్‌లలో బీజేపీ సీట్లు తగ్గిపోనున్నాయి. పెరిగే ప్రసక్తే లేదు. 400 సీట్లలో విజయం సాధిస్తామని బీజేపీ చెబుతోంది. 230 కంటే ఎక్కువ నెగ్గదని నేను రాసిస్తాను అని ఢిల్లీ సీఎం అన్నారు.

100 స్మార్ట్ సిటీలు ఎక్కడ?

ఉమ్మడి ప్రచార ర్యాలీలో మోదీపై రాహుల్, అఖిలేశ్ నిప్పులు

ఝాన్సీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో విపక్షాల కూటమి పార్టీల అగ్రనేతలు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉమ్మడిగా ప్రధాని మోదీపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. మంగళవారం ఝాన్సీ పట్టణంలో రాణి ఝాన్సీ కోట సమీపంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో నేతలిద్దరూ మాట్లాడారు. '' దేశంలో 100 స్మార్ట్ సిటీలను సృష్టిస్తానని మోదీ వాగ్దానం చేశారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. రైతులు, యువతను విస్మరించారు. మేం అధికారంలోకి వస్తే రైతులు, యువతపై దృష్టిపెడతాం'' అని రాహుల్ అన్నారు. తర్వాత ఎస్పీ చీఫ్ అఖిలేశ్ మాట్లాడారు. '' లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే ముగిసిన నాలుగు దశల పోలింగ్ సరళి గమనిస్తే బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని స్పష్టంగా తెలుస్తోంది. కమలం కమిలిపోవడం ఖాయం. యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర బీజేపీ సర్కార్ హయాంలో తరచూ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలు జరుగుతున్నాయి. దీంతో యువత భవిష్యత్తు అగమ్యగోచరమైంది'' అని అఖిలేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

7
సాక్షి హైదరాబాద్
బుధవారం । 15 । మే । 2024



ఏవీ కాలేజీలోని స్ట్రాంగ్ రూం వద్ద భద్రత..

మూడంచెల భద్రత

- స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరిన ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు
- కేంద్ర, రాష్ట్ర, సిటీ బలగాలతో నిత్యం పహారా
- పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో తుది ఘట్టమైన కౌంటింగ్‌కు దాదాపు 20 రోజుల గడువు ఉండటంతో పోలీసు బందోబస్తు డ్యూటీ స్ట్రాంగ్ రూమ్స్ వద్దకు మారింది. ఈవీఎం మిషన్లు, వీవీ ప్యాట్‌లను సోమవారం అర్ధరాత్రికి వీటిల్లోకి తరలించిన సిబ్బంది భద్రపరిచారు. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నిక పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్స్‌కు చేరాయి. వచ్చే నెల 4న కౌంటింగ్ సైతం వీటిలోనే జరుగనుంది. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద మూడంచెల భద్రత కల్పించడంతో పాటు కొన్ని అదనపు చర్యలూ తీసుకుంటున్నారు. వీటిని నగర కొత్వాల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌లకు కేవలం ఒకే ద్వారం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. రూమ్‌కు డబుల్ లాక్ సిస్టం ఏర్పాటు చేసి ఒకటి దాని ఇన్‌చార్జి వద్ద, మరోటి మెజిస్టీరియల్ అధికారాలున్న అధికారి వద్ద ఉంచారు.

సీసీ కెమెరాల ద్వారా నిఘా..

స్ట్రాంగ్ రూమ్స్ వద్ద 24 గంటలూ సాయుధ గార్డును ఉంచడంతో పాటు అనునిత్యం సీసీ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. వీటి పక్కనే నిర్విరామంగా పని చేసే కంట్రోల్ రూమ్ నెలకొల్పి ఇందులో పోలీసులతో పాటు రెవెన్యూ అధికారినీ ఉంచారు. పవర్ కట్ లేకుండా చూస్తూనే..అదనంగా జనరేటర్ ఏర్పాటు చేశారు. స్ట్రాంగ్ రూమ్స్‌కు ఉండే మూడంచెల భద్రతలో తొలి అంచెలో (రూమ్ డోర్ దగ్గర) కేంద్ర సాయుధ బలగాలకు చెందిన వారు ఉంటున్నారు. దీనికోసం కనీసం ఒక సెక్షన్ (13 మంది) బలగాలు 24 గంటలూ అందుబాటులో ఉండేందుకు ఓ ప్లటూన్ (39 మంది) ప్రత్యేకంగా కేటాయించారు. రెండో అంచెలో రాష్ట్ర సాయుధ పోలీసులు, మూడో అంచెలో సాధారణ పోలీసు సాయుధ బలగాలను మోహరించారు.

ఎవరికీ అనుమతి లేదు..

స్ట్రాంగ్ రూమ్స్ ప్రాంగణంలోనే రూమ్ ప్రవేశ ద్వారం కనిపించేలా ఏర్పాటు చేసిన టెంట్స్‌లో అభ్యర్థుల ప్రతినిధులకు సౌకర్యం కల్పించారు. ఇలా అవకాశం లేని చోట సీసీ కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూమ్ ప్రవేశ ద్వారాన్ని టెంట్‌లో ఉండి చూసేలా, అప్పుడప్పుడు రూమ్స్ సమీపంలోకి స్వయంగా వెళ్లి పర్యవేక్షించే అవకాశం కల్పిస్తున్నారు. స్ట్రాంగ్ రూమ్ ఉన్న ప్రాంగణం మొత్తాన్ని భద్రతా వలయంగా పరిగణిస్తున్న పోలీసు అధికారులు అందులోకి పోలీసు ఉన్నతాధికారుల సహా ఎవరి వాహనాలను అనుమతించట్లేదు. రెండో అంచె భద్రతా వలయాన్ని దాటి ఈవీఎంలు ఉన్న స్ట్రాంగ్ రూమ్స్ సమీపంలోని వెళ్లే ప్రతి ఒక్కరి వివరాలు కచ్చితంగా కేంద్ర సాయుధ బలగాల వద్ద లాగ్‌బుక్‌లో ఎంట్రీ చేసుకుంటున్నారు. ఈ ప్రక్రియనూ వీడియోగ్రఫీ చేస్తున్నారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు స్థానిక పోలీసు ఉన్నతాధికారులతో కలిసి ప్రతి రోజూ స్ట్రాంగ్ రూమ్స్‌ను పరిశీలించి ప్రధాన ఎన్నికల అధికారికి నివేదిక ఇచ్చేలా ఏర్పాటు చేశారు. ఈ అధికారులతో పాటు పోలీసు ఉన్నతాధికారులూ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించనున్నారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఐసీసీసీలోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (సీసీసీ) అనుసంధానించారు. అక్కడి దృశ్యాలను ఎప్పటికప్పుడు ఇక్కడి సిబ్బంది పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.


చేవెళ్లలోని స్ట్రాంగ్ రూమ్ వద్ద రంగారెడ్డి కలెక్టర్ శశాంక్ తదితరులు

స్ట్రాంగ్ రూంలను పరిశీలించిన కలెక్టర్

హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఈవీఎంలను ఆయా డీఆర్ కేంద్రాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో సీల్ వేసి భద్రపర్చినట్లు హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం ఆయన గోషామహల్‌లో స్ట్రాంగ్‌రూంలను పరిశీలించారు.


గోషామహల్ స్టేడియంలో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉప్పల్‌లో తాజ్‌మహల్


ఉప్పల్ డిపో వద్ద నిర్వహిస్తున్న కేఆర్‌సీ ఎగ్జిబిషన్‌లో తాజ్‌మహల్ రూపంలో ఏర్పాటు చేసిన నిర్మాణం సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇవే కాకుండా ఈ ఎగ్జిబిషన్‌లో ఎన్నో వింతలు, విశేషాలు ఉన్నాయని నిర్వాహకులు వెల్లడించారు.

కాస్త పెరిగినా చివరి స్థానమే..



- హైదరాబాద్ సెగ్మెంట్‌లో 48.48 శాతం
- రాష్ట్రంలోనే అత్యల్పం ఇక్కడే..
- ఎప్పటి మాదిరిగానే ఓటుపై అనాసక్తి

సాక్షి, సిటీబ్యూరో: పోలింగ్ విషయంలో గ్రేటర్ జిల్లాల్లో మార్పు రావడం లేదు. గతంలో మాదిరిగానే హైదరాబాద్ జిల్లాకు అత్యల్ప పోలింగ్ నమోదై చివరి స్థానం దక్కింది. గత లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌తో పోలిస్తే దాదాపు మూడు శాతం పెరిగినా..రాష్ట్రంలోనే అత్యల్ప పోలింగ్ మాత్రం ఇక్కడే నమోదైంది. హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం 48.48 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం మీద 22,17,094 ఓట్లకు గాను 10,74,827 ఓట్లు పోలయ్యాయి. గోషామహల్ సెగ్మెంట్‌లో 54.72 శాతం, కార్వాన్‌లో 51.23, బహదూర్‌పురాలో 50.07, చాంద్రాయణగుట్టలో 49.15, చార్మినార్ 48.53, యాకుత్‌పురాలో 43.34, మలక్‌పేటలో 42.76 శాతం పోలయ్యాయి.

సికింద్రాబాద్‌లో 49.04%

సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో 49.04 శాతం పోలింగ్ నమోదైంది. గత లోకసభ ఎన్నికలతో పోలిస్తే ఒక శాతం పోలింగ్ పెరిగినా, ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల కంటే ఒక శాతం తగ్గినట్లయింది. సెగ్మెంట్ల వారిగా పరిశీలిస్తే ముషీరాబాద్‌లో 49.09 శాతం, అంబర్‌పేటలో 51.65, ఖైరతాబాద్‌లో 50.28, జూబ్లీహిల్స్‌లో 45.59, సనత్‌నగర్‌లో 49.45, నాంపల్లిలో 46.59, సికింద్రాబాద్‌లో 52.28 శాతం పోలింగ్ నమోదైంది.

చేవెళ్లలో 56.50%

చేవెళ్ల లోక్ సభ పరిధిలో 56.50 శాతం పోలింగ్ నమోదైంది. గత పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే 0.31 పెరిగినా..ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కంటే పది శాతం తగ్గింది. మొత్తం మీద 29,38,870 ఓటర్లకు గాను 16,57,107 మంది ఓటేశారు. సెగ్మెంట్ల వారిగా చేవెళ్లలో 71.83 శాతం, వికారాబాద్‌లో 70.44 శాతం, తాండూర్‌లో 67.33 శాతం. పరిగిలో 67.01 శాతం, రాజేంద్రనగర్‌లో 54.12 శాతం, మహేశ్వరంలో 52.71 శాతం, శేరిలింగంపల్లిలో 54.12 శాతం పోలింగ్ నమోదైంది.

మల్కాజిగిరిలో 50.78%

మల్కాజిగిరి పరిధిలో పోలింగ్ 50.78 శాతం నమోదైంది. అసెంబ్లీ వారిగా పోలింగ్ శాతం పరిశీలిస్తే మేడ్చల్‌లో 57.83 శాతం, మల్కాజిగిరిలో 51.97, కుత్బుల్లాపూర్‌లో 50.19, కూకట్‌పల్లిలో 48.48, ఉప్పల్‌లో 48.45, ఎల్బీనగర్‌లో 46.27, కంటోన్మెంట్–సికింద్రాబాద్‌లో 51.61 శాతం పోలింగ్ నమోదైంది.

వలసెత్తడం వల్లే..


తగ్గిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్

- తెలంగాణలో జరిగిన రోజే ఏపీ, యూపీ, మహారాష్ట్ర, బిహార్‌లోనూ ఎన్నికలు
- దీంతో సొంతూర్లలో ఓటు వేసేందుకే వలస ఓటర్ల ఆసక్తి
- పోలింగ్ తగ్గుదలకు వీకెండ్, వేసవి సెలవులు కూడా కారణమే
- కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మల్కాజ్‌గిరి సెగ్మెంట్లలో ఎక్కువ ప్రభావం

సాక్షి, సిటీబ్యూరో: సొంత రాష్ట్రంపై మమకారం, అక్కడి రాజకీయ పరిస్థితులు, ఓటు హక్కుపై చైతన్యం పెరగడం, వీకెండ్, వేసవి సెలవులు, నగదు పంపిణీ..ఇలా కారణాలేమైనా గ్రేటర్‌లోని వలస ఓటర్లు వారి సొంతూర్లలో ఓటు వేసేందుకే ఆసక్తి చూపించారు. తెలంగాణ లోక్‌సభ ఎన్నికలతో పాటే ఆంధ్రప్రదేశ్‌తో సహ ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. దీంతో బస్సులు, రైళ్లు, విమానాల్లోనూ గ్రేటర్‌లోని వలస ఓటర్లు సొంతూర్లకు వెళ్లిపోయారు. ఫలితంగా గత శాసనసభ ఎన్నికలతో పోలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ నియోజకవర్గాలలో పోలింగ్‌పై ప్రభావం పడింది.

అసెంబ్లీలో పెరిగి..లోక్‌సభలో తగ్గి..

వలస వచ్చిన ప్రజలు ఐటీ, ఫార్మా కంపెనీలు, నిర్మాణ రంగంలో పనిచేస్తుంటారు. వీరు ఎక్కువగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, ఉప్పల్, మహేశ్వరం, చేవెళ్ల నియోజకవర్గాల్లో ఉంటారు. అయితే గతేడాది తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సమయంలో వారి సొంత రాష్ట్రాల్లో ఎన్నికలు జరగలేదు. దీంతో వలస ఓటర్లు స్థానికంగానే పోలింగ్‌లో పాల్గొన్నారు. దీంతో గ్రేటర్ హైదరాబాద్‌లోని అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ ఎక్కువగా నమోదైంది. అయితే తాజాగా సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో సొంతూర్లలో ఓటు వేసేందుకు వలస ఓటర్లు ఆసక్తి చూపించారు. దీంతో శాసనసభ కంటే లోక్‌సభ ఎన్నికల్లో గ్రేటర్ నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం తగ్గింది. మల్కాజ్‌గిరి లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 2023 ఎన్నికల్లో మొత్తం 53.90 శాతం పోలింగ్ నమోదు కాగా..తాజా లోక్‌సభ ఎన్నికల్లో 50.12 శాతానికి తగ్గింది. అలాగే సికింద్రాబాద్ పరిధిలో శాసనసభ ఎన్నికల్లో 50.55 శాతం ఓటింగ్ జరగగా.. తాజాగా 48.11 శాతానికి, చేవెళ్ల పరిధిలోని రికార్డు స్థాయిలో 76.57 పోలింగ్ జరగగా..ఇప్పుడు 55.45 శాతానికి పరిమితమైంది.



హైదరాబాద్‌లో స్వల్ప పెరుగుదల

శాసనసభ ఎన్నికలతో పోలిస్తే హైదరాబాద్ లోక్‌సభ మినహా గ్రేటర్ సిటీలోని సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల పరిధిలో పోలింగ్ శాతం తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఎన్నికల సంఘం ఓటర్ల ప్రక్షాళనలో భాగంగా హైదరాబాద్‌లో 2.5 లక్షల డూప్లికేట్ ఓట్లు, అడ్రస్ మార్పు ఓట్లను తొలగించింది. దీంతో పోలింగ్‌పై ప్రభావం ఉంటుందని పార్టీలు భావించాయి. కానీ, 2019 లోక్‌సభ, తాజా అసెంబ్లీ రెండు ఎన్నికల్లోనూ గోషామహల్‌లో చాంద్రయణగుట్ట అసెంబ్లీ సెగ్మెంట్‌లో మినహా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం పెరిగింది. హైదరాబాద్ లోక్‌సభ పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో గత అసెంబ్లీ ఎన్నికల్లో 45.58 శాతం పోలింగ్ నమోదవగా.. తాజాగా స్వల్పంగా పెరిగి 48.48 శాతానికి చేరింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఇక్కడ 45.18 శాతం ఓటింగ్ జరిగింది.

మల్కాజిగిరిలో తగ్గుదల


దేశంలోని అతిపెద్ద లోకసభ సెగ్మెంట్ మల్కాజ్‌గిరి పరిధిలోకి వచ్చే మల్కాజ్‌గిరి, మేడ్చల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్బీనగర్, ఉప్పల్ సెగ్మెంట్లలో ఎక్కువగా ఏపీ ప్రజలు ఉంటారు. వీరంతా తమ సొంత రాష్ట్రంలో ఓటు వేసేందుకు వెళ్లిపోయారు. దీంతో ఆయా సెగ్మెంట్లలో ఓటింగ్ శాతం గణనీయంగా తగ్గింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ 53.90 పోలింగ్ జరగగా.. తాజాగా 50.78 శాతానికి పరిమితమైంది. మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్ సెగ్మెంట్లలో ఓటింగ్ గణనీయంగా తగ్గడం గమనార్హం.

సికింద్రాబాద్‌లో సైతం..

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ సెగ్మెంట్‌లో కూడా గత అసెంబ్లీ ఎన్నికల కన్నా తక్కువ శాతం పోలింగ్ నమోదైంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో 50.55 శాతం పోలింగ్ నమోదు కాగా... ఈసారి 49.04గా ఉంది. గత లోకసభ ఎన్నికలతో పోలిస్తే ఎక్కువే. అప్పట్లో 41.89 శాతం నమోదైంది. నాంపల్లి, ఖైరతాబాద్ వంటి కొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో మైనార్టీ ఓటర్లు ఎక్కువగా ఉన్నాయి. వీళ్లంతా ఈసారి ఓటింగ్‌లో పాల్గొనకపోవడమే పోలింగ్ శాతం తగ్గుదలకు కారణమని నిపుణుల విశ్లేషణ.

చేవెళ్లలో భారీ తేడా...

ఏపీ, ఉత్తరాది ఓటర్లు ఎక్కువగా ఉండే చేవెళ్ల లోక్‌సభలో పోలింగ్ శాతం గణనీయంగా తగ్గింది. శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ పరిధిలో ఎక్కువగా ఏపీ ఓటర్లు, మహేశ్వరం, చేవెళ్ల సెగ్మెంట్లలో ఉత్తరాది ఓటర్లు ఎక్కువగా ఉంటారు. చేవెళ్ల లోకసభ సెగ్మెంట్ రూరల్ ఏరియాల్లో పోలింగ్ బాగానే అయినట్లు కనిపించినా.. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే తక్కువే. అప్పుడు 76.57 శాతం పోలింగ్ కాగా.. ఇప్పుడు అత్యధికంగా 56.50 శాతానికే పరిమితమైంది. 2019 లోకసభ ఎన్నికల్లో 53.18 శాతం ఓటింగ్‌తో పోలిస్తే ఈసారి కాస్త పెరిగిందని చెప్పొచ్చు.




అభిమన్యు వెళ్లిపోయాడు

జూలో తెల్లపులి మృతి

బహదూర్‌పురా: నెహ్రూ జూ పార్క్‌లో అభిమన్యు అనే 8 ఏళ్ల తెల్లపులి కిడ్నీ సంబంధిత వ్యాధితో మంగళవారం మృతి చెందింది. నెహ్రూ జులాజికల్ పార్క్‌లో 2016 సంవత్సరం మే నెలలో బద్రి, సమీరాలకు రెండు తెల్లపులి కూనలు జన్మించాయి. అందులో ఒకటైన అభిమన్యు జూలోనే పెరిగింది. ఇది మృతి చెందడంతో అధికారులు వీబీఆర్ఐ, లాంకోన్స్‌తో పాటు ఇతర విభాగాల శాస్త్రవేత్తలు, డాక్టర్లు జూలోనే పోస్టుమార్టం నిర్వహించారు. గత కొన్ని సంవత్సరాలుగా నెహ్రూ జులాజికల్ పార్కులో కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులతో పులులు, సింహాలు, చిరుత పులులు మృతి చెందుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

మూడు వారాలు..భారమే !

- ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూపులే..
- నేతలకు టెన్షన్.. పనులకు ఆటంకం



సాక్షి, సిటీబ్యూరో: మరో 21 రోజులు.. ఎందరు నేతల తలరాతలు మారతాయో తెలిసేందుకు వేచి ఉండాల్సిన సమయం. తెలంగాణతో పాటు ఏపీలోనూ లోక్‌సభ ఎన్నికలు ముగిసినప్పటికీ, ఫలితాలు వెలువడేందుకు జూన్ 4 వరకు ఆగాల్సిందే. దేశవ్యాప్తంగా వివిధ దశల్లో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏడో దశ (చివరి దశ) పోలింగ్ జూన్ ఒకటో తేదీన జరగనుంది. ఆ తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి. పోటీ చేసిన నేతలతోపాటు వారి అనుయాయులు, అభిమానులేకాక రాజకీయాలపై ఆసక్తి ఉన్న వారందరూ వేచి చూడక తప్పదు. అప్పటి వరకు వేచి ఉండాల్సి ఉండటంతో విహారయాత్రలకో, ఇతరత్రా పనులకో కేటాయించేందుకు కొందరు నేతలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు, సన్నిహితుల ప్రోద్బలంతో యాత్రలకు వెళ్లినా ఫలితాలు తెలిసేంతదాకా మనశ్శాంతితో ఉండలేమని భావిస్తున్నవారూ ఉన్నారు. అప్పటి వరకూ టెన్షన్ తప్పదని భావిస్తున్నారు. విజయంపై ఫిఫ్టీ ఫిఫ్టీ అవకాశాలున్నవారు మరింత టెన్షన్ పడే అవకాశముంది. ప్రస్తుతానికి పోలింగ్ సరళి..తమకు ఎక్కడెక్కడ ఓట్లు పడ్డాయి..ఎక్కడ పడలేదో అంచనాలు వేస్తున్నారు. గెలుపుపై పూర్తి భరోసాతో ఉన్నవారు..ఏదైతే అదే అవుతుందనే ధీమాతో ఉన్నవారు మాత్రం టూర్లు, ఇతరత్రా పనుల్లో మునగనున్నారు.

బల్దియా పనులకు కోడ్ గండం

రాజకీయ నేతల పరిస్థితి అలా ఉండగా, గ్రేటర్‌లో ప్రజలకు అవసరమైన వివిధ పనులు చేయాల్సిన జీహెచ్‌ఎంసీకి కొత్తగా ఏ పనులూ చేపట్టలేని పరిస్థితి. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉండనుంది. అప్పటి దాకా స్టాండింగ్ కమిటీ సమావేశాల నిర్వహణకుగానీ, కొత్తగా పనుల ఆమోదానికి గానీ, పథకాల ప్రారంభానికి గానీ అవకాశం లేదు. పోలింగ్ తేదీకి దాదాపు రెండు నెలల ముందుగానే ఎన్నికల షెడ్యూలు వెలువడటంతో అప్పటి నుంచే ఇవి నిలిచిపోయాయి. ఇంకో మూడు వారాల వరకు పనులు జరిగే పరిస్థితి లేదు.

పనులయ్యేనా?

జూన్ రెండో వారంలో వర్షాకాలం ఆరంభమవుతుంది. వివిధ పనులు ఆలోపునే పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే మంజూరై, పురోగతిలో ఉన్న పనులు సైతం మందకొడిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు వివిధ విభాగాల సిబ్బంది ఎన్నికల విధుల్లోనే ఉండటంతో పనులు కుంటుపడ్డాయి. వర్షాకాలానికి సంబంధించిన నాలాల పూడికతీత, ఎస్ఎన్‌డీపీ పనులు సైతం పూర్తికాలేదు. అత్యవసరమైన పనులకు సైతం ఎన్నికల సంఘం నుంచి ప్రత్యేకంగా అనుమతి పొందాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు వారం వారం నిర్వహించే 'ప్రజావాణి' సైతం ఉండదు.

మన హోర్డింగులు భద్రమేనా ?

- అక్రమాలకే దిక్కులేదు.. పటిష్టతపై పట్టింపు లేదు
- ముంబై ఘటనతో ప్రజల్లో ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: ముంబైలో హోర్డింగ్ కుప్పకూలి 14 మంది మరణించడంతో పాటు 70 మందికి పైగా తీవ్రగాయాలైన ఘటనతో హైదరాబాద్ నగర ప్రజల్లో ఆందోళన మొదలైంది. నగరంలో అడ్డగోలుగా వెలసిన అక్రమ హోర్డింగులెన్నో ఉన్నాయి. ఏ క్షణాన ఈదురు గాలులు వీస్తే కూలుతాయో తెలియని పరిస్థితిలో ఎన్నో ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లో దాదాపు ఏడెనిమిదేళ్ల క్రితం యూనిపోల్ కూలిన ఘటనలో ఎన్నో కార్లు ధ్వంసమయ్యాయి. అక్రమ హోర్డింగులను కూల్చివేస్తామని ప్రకటించిన జీహెచ్‌ఎంసీ ఆ పని పూర్తిచేయలేదు. హోర్డింగుల తోపాటు అక్రమంగా వెలసిన యూనిపోల్స్, బస్‌షెల్టర్లు, గ్లో సైన్‌బోర్డులు, లాలీపాప్స్, ఆర్చిలు తదితరమైనవి సైతం కూల్చివేస్తామన్న ప్రకటనలు కార్యరూపం దాల్చలేదు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా మారిన హోర్డింగులను పూర్తిగా నిషేధించాలని భావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అనువైన విధానాలతో నూతన పాలసీ రూపొందించనున్నట్లు ప్రకటించారు. అందుకు వివిధ నగరాల్లోని పరిస్థితులను అధ్యయనం చేస్తామన్నారు.

వందల కోట్ల అక్రమాలు..

గడచిన ఐదేళ్లలో అక్రమ హోర్డింగుల ఏర్పాటుతో జీహెచ్‌ఎంసీ ఖజానాకు రూ.500 కోట్ల మేర నష్టం వాటిల్లిందని గత సర్వసభ్య సమావేశంలో సభ్యులు ధ్వజమెత్తడంతో సమావేశం అట్టుడికిపోయింది. అక్రమాలకు బాధ్యునిగా కార్తీక్ అనే ఇంజినీర్‌ను ఆ విభాగం నుంచి తప్పించారు. అక్రమాలపై హౌస్ కమిటీ ద్వారా విచారణ జరిపి తగుచర్యలు తీసుకుంటామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యల్లేవు.

ప్రజల ప్రాణాలకు ముప్పు

అక్రమ హోర్డింగుల వల్ల అవినీతితో పాటు పటిష్టంగా లేని హోర్డింగుల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉండటం ముంబై ఘటనతో వెల్లడైంది. అనుమతులు పొంది ఏర్పాటైన హోర్డింగులకు సైతం నిపుణుల నుంచి ఏటేటా స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికెట్లు తీసుకోవాల్సి ఉండగా, వాటిని పట్టించుకోవడం లేదు. ఇలా అనుమతులు పొంది ఏర్పాటైన వాటితోనూ, అక్రమంగా వెలసిన వాటితోనూ హోర్డింగుల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా సంబంధిత అధికారులు ఇప్పటికైనా వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.


తిరుగు ప్రయాణంలోనూ అదే రద్దీ

- నగర శివార్లలో బారులు తీరిన వాహనాలు
- సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి స్టేషన్‌లలో సందడి
- తిరుగు ప్రయాణికులతో కిక్కిరిసిన మెట్రో రైళ్లు
- ఎల్‌బీనగర్–మియాపూర్ రూట్‌లో అనూహ్యంగా పెరిగిన డిమాండ్




సాక్షి, సిటీబ్యూరో: ఓటు కోసం సొంత ఊళ్లకు పోటెత్తిన సిటీజనం తిరుగుముఖం పట్టారు. ఏపీతో పాటు, తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి నగరానికి చేరుకున్న ప్రయాణికులు, వాహనాలతో మంగళవారం నగరం చుట్టుపక్కల రహదారులపై ట్రాఫిక్ స్తంభించింది. టోల్‌గేట్ల వద్ద పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. వందల కొద్దీ కిలోమీటర్లు ప్రయాణం చేసి వచ్చిన నగరవాసులు టోల్‌గేట్ల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఏపీలో లోక్‌సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండడంతో హైదరాబాద్ నుంచి లక్షలాది మంది తరలి వెళ్లిన సంగతి తెలిసిందే. ఎన్నికలు ముగిసిన అనంతరమే చాలా మంది తిరుగు పయనమయ్యారు. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే రైళ్లు సైతం కిటకిటలాడాయి. ప్రయాణికుల రద్దీ మేరకు విశాఖ, విజయవాడ, తిరుపతి, మచిలీపట్నం, నర్సాపూర్ తదితర ప్రాంతాల నుంచి అధికారులు నగరానికి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ రైళ్లతో పాటు ప్రత్యేక రైళ్లలోనూ రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చేరుకున్న ప్రయాణికులతో సికింద్రాబాద్, నాంపల్లి,కాచిగూడ స్టేషన్‌లలో సందడి కనిపించింది. పలు మార్గాల్లో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. గంటలతరబడి పట్టాలపైనే పడిగాపులు కాయాల్సి వచ్చిందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. నగరానికి వచ్చినప్పటికీ సకాలంలో ఆఫీసులకు వెళ్లలేకపోయినట్లు విస్మయం వ్యక్తం చేశారు. ఎన్నికల దృష్ట్యా నాలుగైదు రోజుల నుంచి నగరవాసులు సొంత ఊరు బాట పట్టారు. అలా వెళ్లిన వాళ్లు ఎన్నికలు ముగిసిన వెంటనే తిరిగి బయలుదేరారు. కానీ సకాలంలో ఇళ్లకు, ఆఫీసులకు చేరుకోలేకపోయారు. వాహనాల రాకపోకలతో విజయవాడ హైవే స్తంభించింది. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులతో పాటు సొంత వాహనాల్లోనూ చాలామంది నగరానికి చేరుకున్నారు.

మెట్రోల్లో పెరిగిన రద్దీ...



జిల్లాల నుంచి సిటీకి చేరుకున్న ప్రయాణికులతో మెట్రో రైళ్లలో ఒక్కసారిగా రద్దీ పెరిగింది. విజయవాడ వైపు నుంచి ఎల్బీనగర్‌కు చేరుకున్న ప్రయాణికులు మెట్రోల్లో వివిధ ప్రాంతాలకు బయలుదేరారు. దీంతో ఎల్‌బీనగర్ నుంచి మియాపూర్ రూట్‌లో నడిచే రైళ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రైళ్లలో రద్దీ కనిపించింది. సాధారణంగానే వేసవి దృష్ట్యా మెట్రోల్లో ప్రయాణికుల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. దీంతో పాటు అదనంగా వచ్చిన ప్రయాణికులతో మెట్రో స్టేషన్‌లు, రైళ్లలోనూ ప్రయాణికులు పెరిగాయి. ఎల్‌బీనగర్–మియాపూర్ రూట్‌లో మంగళవారం ఒక్క రోజే సుమారు 50 వేల మందికి పైగా ప్రయాణం చేసినట్లు అంచనా. అలాగే నాగోల్–రాయదుర్గం, జేబీఎస్–ఎంజీబీఎస్ కారిడార్‌లలో కూడా రైళ్లు ప్రయాణికులతో కళకళలాడాయి. సాధారణ రోజుల్లో కంటే ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు పలు స్టేషన్‌ల సిబ్బంది తెలిపారు. మెట్రో రైళ్లలో ప్రతి రోజు 4.8 లక్షల నుంచి 5 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు, పండుగలు, వారాంతంలో ప్రయాణికుల సంఖ్య 5.10 లక్షలకు పైగా నమోదవుతుంది. మంగళవారం కనీసం 5.25 లక్షల మంది ప్రయాణం చేసి ఉండవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

మరో రెండు రోజులు ఇదే పరిస్థితి...



తిరుగు ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైళ్లు, బస్సులు, ప్రైవేట్ వాహనాలతో మరో రెండు రోజుల పాటు నగర శివార్లలో, టోల్‌గేట్‌లవద్ద రద్దీ ఉండే అవకాశం ఉంది. ఎన్నికలతో పాటు వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని నగరవాసులు ఇంటిల్లిపాది కలిసి వెళ్లారు. ఇలా వెళ్లిన వాళ్లంతా తిరిగి నగరానికి చేరుకుంటున్నారు. ప్రయాణికుల రద్దీ మేరకు వివిధ మార్గాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైళ్లను జూన్ మొదటి వారం వరకు నడుపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు.


సతీమణి అనిత, మనవరాళ్లతో దానం నాగేందర్


మనవరాలితో సరదాగా పద్మారావు గౌడ్


మనవడు ఆహాన్‌తో గడ్డం శ్రీనివాస్ యాదవ్


మనవడు రుద్రాంశ్‌తో రాగిడి లక్ష్మారెడ్డి..


మనవడితో రంజిత్‌రెడ్డి


మనవడు ఆర్యవీర్‌తో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

జాలీగా.. సరదాగా..

- ముగిసిన లోక్‌సభ ఎన్నికలు
- కుటుంబ సభ్యుల మధ్య నేతలు
- ఆహ్లాదకరంగా ఆటవిడుపు

రికార్డు స్థాయిలో తన ఆగ్రహాన్ని చూపించాడు సూరీడు.. అయినా ఓటర్ల అనుగ్రహం కోసం అనుక్షణం తపించారు నేతలు.. స్వేదంతో తడిసి ముద్దవుతున్నా పట్టు సడలకుండా ప్రచారం చేశారు. సోమవారం లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. రాజకీయ పార్టీల అభ్యర్థులు నచ్చిన వ్యాపకాలతో సేద దీరుతున్నారు. ఫలితాలకు ఇంకా చాలా రోజుల సమయం ఉండడంతో ఆహ్లాదంగా గడపడానికి ప్రాధాన్యమిస్తున్నారు. ఎంపీ అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలూ ప్రచారంలో పాల్గొని.. ప్రస్తుతం కుటుంబ సభ్యులతో ఆహ్లాదంగా గడుపుతున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

అలసిసొలసిన మనసుకు చిన్నారి చిరునవ్వులను మించిన సాంత్వన ఏముంది? అందుకేనేమో.. హైదరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ తన మనవడు ఆహాన్‌తో ఆటల్లో మునిగిపోయారు. తాను సైతం చిన్న పిల్లాడిలా మనవడితో ఆటపాటల్లో మునిగిపోతూ సోమవారం అంతా సేదదీరారు. సికింద్రాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గౌడ్ సైతం మంగళవారం మొత్తంగా ఇంటికే పరిమితమయ్యారు. రోజుల తరబడి అలుపెరగని ఎన్నికల ప్రచారాన్ని సాగించిన ఆయన మరో మూడు రోజుల్లో ఉత్తరాది పర్యటనకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విరామంలో కుటుంబ సభ్యులతో మనవలు, మనవరాళ్లతో గడుపుతున్నారు. గత కొన్ని రోజులుగా క్షణం తీరిక లేకుండా కార్యకర్తలు, నాయకులు, ప్రజల్లోనే ఉన్న మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మంగళవారం సందడిగా గడిపారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో.. మనవడు భవనం రుద్రాంశ్, కుమారుడు రాగిడి వెంకటసాయి రియాన్ రెడ్డిలతో కలిసి ఆటలాడుతూ వారితో కలిసి స్విమ్ చేస్తూ రీచార్జ్ అయ్యారు. ప్రచారంలో బిజీగా మారిన సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికల ముగిసిన తర్వాత మంగళవారం కుటుంబంతో కాస్త రిలాక్స్‌గా కనిపించారు. ఉదయం తన మనవరాళ్లతో ఇంట్లో సరదాగా గడిపారు.


మనవరాలు ఐరాతో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

పచ్చని పరిసరాల్లో...



ఎన్నికల ప్రచారంలో భాగంగా వేసవి ఎండలను లెక్కచేయకుండా క్షణం తీరిక లేకుండా పనిచేశాం. పోలింగ్ పూర్తయి ఫలితాలు రావడానికి ఇంకా సమయం ఉంది. ఈ సమయంలో కొంత మానసిక ప్రశాంతత అవసరం అని కుటుంబ సభ్యులకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నా. మొక్కల మధ్య పచ్చని పరిసరాల్లో గడుపుతూ పెట్స్‌తో రిలాక్స్ అవుతున్నా.

- సునీతా మహేందర్‌రెడ్డి, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి

ఆరోగ్యంపై దృష్టి..



తక్కువ సమయంలో ఎక్కువ మందిని కలవాలి. మనం ఓటరుకు ఏం చెప్పాలనుకుంటున్నామో వారికి చేరవేయాలనే తపనతో నియోజకరవ్గం మొత్తం కలియతిరిగాను. ఇక ఇప్పుడు ఈ ఒత్తిడి నుంచి దూరం కావడానికి మానసిక ప్రశాంతత కోసం 2 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నా.అలాగే ఈ టైమ్‌లో ఆరోగ్యంపై దృష్టిపెట్టి తగిన మార్పు చేర్పులు చేసుకుంటున్నా.

- రంజిత్‌రెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి


'సాక్షి' పత్రిక చదువుతున్న ఎమ్మెల్యే కాలేరు

సాగర్‌లోకి దూకి ఆత్మహత్యా యత్నం

యువకుడిని కాపాడిన పోలీసులు

ఖైరతాబాద్: హుస్సేన్ సాగర్‌లోకి దూకి ఆత్మహత్యా యత్నం చేసిన ఓ యువకుడిని ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు రక్షించారు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లుంబినీ పార్కు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఓ యువకుడు ఆత్మహత్య చేసుకునేందుకు సాగర్‌లో దూకాడు. ఆ యువకుడు దూకిన చోట నీళ్లు తక్కువగా ఉండటంతో ఏం చేయాలో తెలియక అలాగే నిలబడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే సైఫాబాద్ లా అండ్ ఆర్డర్ పోలీసులతో కలిసి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.రాజశేఖర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. తాడు సాయంతో యువకుడిని పైకి లాగేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో వెంటనే ట్రాఫిక్ సీఐ రాజశేఖర్ సిబ్బందితో లుంబినీ పార్కుకు వెళ్లి అక్కడి నుంచి స్పీడ్ బోట్ తీసుకొని బాధితుడి వద్దకు చేరుకున్నారు. వెంటనే యువకుడిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. బాధితుడు బోడుప్పల్‌కు చెందిన 28 ఏళ్ల సాయిరాంగా గుర్తించారు. తనను తల్లిదండ్రులు విదేశాలకు పంపించడం లేదని.. అందుకే ఆత్మహత్యకు యత్నించినట్లు బాధితుడు పోలీసులకు వివరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


సాగర్‌లోకి దూకిన యువకుడు


యువకుడిని కాపాడిన పోలీసులు

బీసీ కులాల సమగ్ర లెక్కలను నివేదిస్తాం

- వకుళాభరణం కృష్ణమోహన్
- సగరులు రాజకీయాల్లోనూ ఎదగాలి: జాజుల శ్రీనివాస్ గౌడ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర బీసీ కులాల సమగ్ర లెక్కలను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా నివేదికను అందజేస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వకుళాభరణం కృష్ణమోహన్ మాట్లాడుతూ.. సగరులు తమ పిల్లలను బాగా చదివించాలని తద్వారా చైతన్యం పెరగడంతో పాటు ప్రశ్నించే తత్వం వస్తుందన్నారు. సగరులు రాజ్యాంగ ఫలాలను కూడా అనుభవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సగర కులాలను బీసీ 'డి' నుంచి బీసీ 'ఏ'లోకి మార్చాలని డిమాండ్ చేశారు. సగరులు రాజకీయాల్లోనూ ఎదగాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలు అందించిన గోపాల్ సగర, చందు, లావణ్య, నరేందర్, బాలకృష్ణలను సేవా రత్న అవార్డులతో సత్కరించారు. గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షుడు రవిసాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, నగర ప్రధాన కార్యదర్శి వెంకటరాములు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్, రాష్ట్ర నాయకులు మారుతీసాగర్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.


ఉప్పర శేఖర్‌ను సత్కరిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు

సోషల్ మీడియా.. గప్‌చుప్!

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొన్నాళ్లుగా ఉద్ధృత ప్రచారం
- సినిమాలు, ఐపీఎల్‌ను తలదన్నేలా రీల్స్, వీడియోలు
- ఎన్నికలు ముగియడంతో నిశ్శబ్దమైన ఆన్‌లైన్ యాప్స్

సాక్షి, సిటీబ్యూరో: సాధారణంగా ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడం కోసం నగర వీధుల్లోని గోడలపై పోస్టర్లు అంటించే ఆనవాయితీ నుంచి డిజిటల్ వేదికల్లో వినూత్న పంథాలో ప్రచారం చేసేంత వరకు రూపాంతరం చెందింది. ఇందులో భాగంగానే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా నగరమంతా జోరుగా ప్రచారం సాగింది. సోమవారం ఎన్నికలు ముగియడంతో ఒక్కసారిగా సోషల్ మీడియా మూగబోయింది. వాట్సాప్ మెసేజ్‌లు, ఎంపీ అభ్యర్థుల బ్రాడ్‌కాస్టింగ్ కాల్స్, ఇన్‌స్టా రీల్స్, ఎక్స్‌లో పోస్టులతో దద్దరిల్లిన సోషల్ ప్రచారం గప్‌చుప్ అయిపోయింది. ఈసారి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో సోషల్ మీడియా ప్రచారం కీలక పాత్ర పోషించింది. ఒకానొక క్రమంలో సినిమాలు, ప్రస్తుతం కొనసాగుతున్న ఐపీఎల్ క్రికెట్ మానియాను సైతం తలదన్నేలా డిజిటల్ ప్రచారం కొనసాగింది. ఒక్క పోస్ట్, ఒకే ఒక్క రీల్‌తో వేల మందిని ప్రభావితం చేసేలా అన్ని పార్టీలు దృష్టి సారించాయి. ఈ క్రమంలో కొన్ని రోజులుగా వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ తదితర అంతర్జాల మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచార సరళి కొనసాగింది. అంతే కాకుండా వివిధ పార్టీలు, ఆయా పార్టీల అభ్యర్థులు స్వతహాగా ప్రైవేట్ పాటల ఆల్బమ్స్‌ను రూపొందించి వాటిని సోషల్ మీడియా ప్రచార అస్త్రాలుగా మార్చుకున్నారు. భౌతికంగా నిర్వహించే ప్రచార కార్యక్రమాలను సోషల్ మీడియా యాప్స్‌లో లైవ్‌గా ప్రసారం చేశారు. ఎలాగైనా సరే సోషల్ మీడియాలో వైరల్‌గా మారాలి, ఓటర్లను ఆకర్షించాలనే నినాదంతో ప్రచారాన్ని జోరెక్కించారు. సోషల్ మీడియా ప్రచారం కోసం కొన్ని పార్టీలు ప్రత్యేకంగా టెక్నికల్ టీంను సైతం నియమించుకోవడం విశేషం. ఇదే అదనుగా కొంత మంది అవాస్తవాలను, దుష్ప్రచారాలకు తెర లేపారు. వ్యూస్ కోసం, వైరల్‌గా మారడం కోసం అనవసరమైన సమాచారాన్ని ప్రచారం చేసిన ఘటనలూ లేకపోలేదు.



'బుల్లెట్' పేలిన ఘటనలో మరొకరి మృతి

గౌలిపురా: బుల్లెట్ ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంక్ పేలిన ఘటనలోఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి షౌకత్ అలీ మంగళవారం మృతి చెందాడు. భవానీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ దుర్ఘటనలో దాదాపు 10 మంది గాయపడ్డారు. వీరిలో ఇద్దరు 80 శాతానికి పైగా కాలిన గాయాలతో చికిత్స పొందుతూ.. సోమవారం ఉదయం మహ్మద్ నదీం మృతి చెందాడు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. జహంగీర్‌నగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ రహీంఖాన్ ఈ నెల 10న బుల్లెట్ వాహనంపై తన భార్య నేహాతో పని నిమిత్తం బయటికి వెళ్తున్నాడు. నసీర్ ఫంక్షన్ హాల్ సమీపం వద్దకు రాగానే వాహనం నుంచి స్వల్పంగా మంటలు రాసాగాయి. దీంతో అబ్దుల్ రహీం ఖాన్ వాహనాన్ని స్థానికుల సహాయంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించాడు. ఇంతలోనే బుల్లెట్ వాహనం కింద పడిపోవడంతో పెట్రోల్ ట్యాంక్ ఒక్కసారిగా పేలడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఈ ఘటనలో అబ్దుల్ రహీం ఖాన్‌తో పాటు మంటలను ఆర్పేందుకు సహాయం చేసిన స్థానికులు సలేహా, షేక్ అజీజ్, ఖాజా పాషా, చెరుకు బండి యజమాని మహ్మద్ నదీం, ఫలక్‌నుమా జహంగీర్ నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి షౌకత్ అలీ, మహ్మద్ హుస్సేన్ ఖురేషి, షేక్ ఖాదర్, గౌస్ రహమాన్‌లు మంటల వ్యాప్తి కారణంగా గాయాలకు గురయ్యారు. మంటలను ఆర్పే ప్రయత్నంలో మొఘల్‌పురా పీఎస్ కానిస్టేబుల్ సందీప్ సైతం గాయాలకు గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహ్మద్ నదీమ్ సోమవారం మృతి చెందగా.. ఫలక్‌నుమా జహంగీర్‌నగర్‌కు చెందిన స్క్రాప్ వ్యాపారి షౌకత్ అలీ మంగళవారం మృతి చెందాడు.


షౌకత్ అలీ (ఫైల్)

సీబీఎస్‌ఈ ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ జయకేతనం

సాక్షి, సిటీబ్యూరో: సీబీఎస్‌ఈ ఫలితాల్లో హిమాయత్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ హైస్కూల్ వందశాతం ఉత్తీర్ణత సాధించింది. ఏడుగురు విద్యార్థులు ఏ–1 గ్రేడ్ సాధించారు. మిగతా విద్యార్థులు ఏ–2 గ్రేడ్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కట్టా ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్లాని అనన్య (97శాతం), సయ్యద్ ఫహీద్ జంగ్ (96.5 శాతం), చన్నా విశ్వేష్ రాజ్ (95.7శాతం), నిధి జైన్ (95.2 శాతం), అద్వైత్ బాదామి (94.7 శాతం), అన్ను శ్రీసంజన (91.8 శాతం), యశ్వంత్ కవిడిదేవి (91.7 శాతం) స్కోర్ సాధించినట్లు ఆయన తెలిపారు.

'కేర్'లో స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రం



సాక్షి, సిటీబ్యూరో: బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్ ప్రాంగణంలో అత్యాధునిక స్పోర్ట్స్ మెడిసిన్ రిహాబిలిటేషన్ సెంటర్‌ను ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని సన్ రైజర్స్ హైదరాబాద్ క్రికెటర్లు హెన్రిచ్ క్లాసెన్, మార్కో జాన్సన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్ ఖన్నా పాల్గొని మాట్లాడుతూ.. క్రీడాకారులతో పాటు చురుకైన జీవన శైలిని కోరుకుంటున్న ప్రతి ఒక్కరికీ ఈ సెంటర్ ద్వారా సేవలు అందిస్తామన్నారు. కేర్ గ్రూప్ సీఈఓ జస్‌దీప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా పత్రాల స్క్రూటినీ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వినియోగించిన డాక్యుమెంట్లను స్క్రూటినీ చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్ కళాశాలలో అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓల సమక్షంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో 5 పోలింగ్ కేంద్రాలను ర్యాండంగా 17సి, 17ఏ, పీఓడైరీ, విజిట్ షీట్, బుక్‌లెట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ శ్రీవిద్య, పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓ, వెంకటాచారి, మహిపాల్ రెడ్డి, వెంకన్న, జ్యోతి, విక్టర్, రవి, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ స్టేట్ మీడియా కో-ఆర్డినేటర్‌పై కేసు

వెంగళరావునగర్: భారతీయ జనతా పార్టీ స్టేట్ మీడియా కో–ఆర్డినేటర్ విజిత్ వర్మపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా రహమత్ నగర్‌లోని న్యూటన్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాగా.. విజిత్ వర్మను బీజేపీ వెంగళరావునగర్ ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రం వద్ద విజిత్ వర్మ ఓటర్లను తమ పార్టీకి ఓటు వేయాలని సూచిస్తున్నారు. ఎన్నికల నియమావళికి భిన్నంగా ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రం వద్ద ప్రచారం చేయడాన్ని గుర్తించిన పోలీసులు.. విజిత్ వర్మను అదుపులోనికి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లో సెల్‌ఫోన్‌తో వీడియో: కేసు నమోదు

బంజారాహిల్స్: సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ఖైరతాబాద్ నియోజకవర్గం బంజారాహిల్స్ డివిజన్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లో పోలింగ్ బూత్ నెంబర్ 234లో ఓ ఓటరు నిబంధనలు ఉల్లంఘించాడు. ఓటు వేస్తున్న దృశ్యాలను సెల్‌ఫోన్‌తో వీడియో తీసుకున్న ఘటనలో అతడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్‌బీటీనగర్ హైస్కూల్‌లోని 234వ పోలింగ్ బూత్‌లో నవీన్ అనే ఓటరు పోలీసుల కళ్లుగప్పి బూత్‌లోకి సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లడంతో పాటు తాను ఓటు వేస్తున్న దృశ్యాన్ని కూడా వీడియో తీస్తుండగా అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారి వెంకటేష్ గమనించి సెక్టోరియల్ ఆఫీసర్ కల్యాణికి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆమె ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి వీడియోగ్రఫీ చేసిన నవీన్‌పై చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు నవీన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీరకు మంటలు అంటుకుని వృద్ధురాలి మృతి

మలక్‌పేట: చీరకు మంటలంటుకుని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. . ఏఎస్సై తేజ్యా నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్రాంత ఉద్యోగి వై.భాస్కర రామారావు, భార్య వైవీకే రాజేశ్వరి (72)తో కలిసి సలీంనగర్ శ్రీపురం కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన మంగళవారం ఉదయం 11.30 గంటలకు మీ సేవలో బిల్లులు చెల్లించేందుకు ఇంట్లోంచి బయటికి వెళ్లారు. వంటింట్లో ఉన్న పూజ గదిలో రాజేశ్వరి పూజ చేస్తున్న సమయంలో దీపం ఆమె చీరకు అంటుకుని మంటలు రావడంతో తీవ్ర గాయాల పాలైంది. ఇంటో ఎవరూ లేకపోవడం, వృద్ధురాలు కావడంతో కింద పడిపోయింది. ఇంట్లో నుంచి పొగలు, వాసన రావడంతో పై అంతస్తులో కిరాయికి ఉంటున్న కిషోర్ ఫోన్ ద్వారా భాస్కర రామారావుకు సమాచారం అందించాడు. ఆయన ఇంటికి వచ్చి చూడగా రాజేశ్వరి అపస్మారక స్థితిలో కనిపించింది. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేయగా.. ఘటన స్థలానికి చేరుకున్న సిబ్బంది పరిశీలించి ఆమె అప్పటికే మరణించిందని చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చైన్ స్నాచర్ అరెస్టు

పంజగుట్ట: ఇంట్లో వంట చేసుకుంటున్న వృద్ధురాలి మెడలోంచి నాలుగు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లిన నిందితుడిని పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. శ్రీనగర్‌కాలనీ, శాలివాహన నగర్‌కు చెందిన విజయలక్ష్మి ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో వంట చేసుకుంటుండగా వెనక వైపు గోడదూకి ఇంట్లోకి దూరిన నిందితుడు ఆమె నోరుమూసేసి మెడలోని నాలుగు తులాల గొలుసు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించి నిందితుడు అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడకు చెందిన కొండేటి నాగపృథ్విగా గుర్తించారు. నిందితుడు సొంత ఊరు ఏపీలోని గుంటూరు జిల్లా పొన్నూరుకు పారిపోతుండగా పోలీసులు పక్కా సమాచారంతో అరెస్టు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

పోలింగ్ తక్కువ.. టెన్షన్ ఎక్కువ

- పోలింగ్‌లో ఖైరతాబాద్ రెండోస్థానం
- అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి తక్కువ పోలింగ్
- ప్రధాన పార్టీల నేతల్లో ఆందోళన


పోలింగ్ శాతం పెంచడంలో కృషి చేసిన కార్యకర్తలు

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆశించిన స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కాకపోవడం పట్ల ఆయా పార్టీల నేతల్లో ఆందోళన నెలకొంది. గత పార్లమెంట్ ఎన్నికల కంటే తక్కువగా పోలింగ్ నమోదు కావడం పట్ల నేతలు లెక్కలు వేసుకుంటూ ఏ ప్రాంతంలో ఎవరికి లాభించిందో సమీక్షిస్తున్నారు. అయితే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ సెగ్మెంట్‌లో పోలింగ్ శాతంతో చూస్తే రెండోస్థానంలో ఉంది. సికింద్రాబాద్ అసెంబ్లీ 53.65 శాతం పోలింగ్ నమోదు కాగా, ఆ తర్వాత స్థానం ఖైరతాబాద్ 50.28 శాతం నమోదైంది. మూడోస్థానంలో అంబర్‌పేట 50.12 శాతంతో ఉండగా ముషీరాబాద్ 45.25, జూబ్లీహిల్స్‌లో 45.69, సనత్‌నగర్‌లో 49.41, నాంపల్లిలో 45.37 శాతం చొప్పున పోలింగ్ నమోదైంది. నాంపల్లి నియోజకవర్గంపై కాంగ్రెస్ భారీగా ఆశలు పెట్టుకుంది. అయితే 70 శాతం ఓటింగ్ నమోదై ఉంటే ఇక్కడ కాంగ్రెస్‌కు అనుకూల ఫలితాలు ఉండేవని పలువురు అంచనా వేస్తున్నారు. ఏ నియోజవర్గంలో ఎంత శాతం ఓట్లు నమోదయ్యాయి.. ఏ వర్గం ఓట్లు ఎక్కువగా పోలయ్యాయి..అన్న దానిపై బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ లెక్కలు వేసుకుంటున్నాయి.

ఫిలింనగర్ ఓటర్లు ఎవరిని కనికరిస్తారో..!


పద్మాలయ అంబేద్కర్‌నగర్‌లో కుటుంబం మొత్తం ఓటు వేయడానికి వచ్చిన దృశ్యం (ఫైల్)

ఫిలింనగర్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని జూబ్లీహిల్స్ డివిజన్‌లో భారీగా పోలింగ్ నమోదైంది. ఇక్కడి 53 పోలింగ్ బూత్‌ల్లో 31,373 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ పోలింగ్ శాతం సంతృప్తికరంగా ఉన్నట్లు నేతలు తెలిపారు. ఫిలింనగర్ 18 బస్తీల్లో 20 వేలకు పైగా ఓట్లు ఉండటంతో వీరిని ఆకట్టుకునేందుకు అభ్యర్థులతోపాటు డివిజన్ స్థాయి నాయకులు కూడా ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఓటింగ్‌కు రావాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు కూడా తగిన రీతిలో అవగాహన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. దీంతో డివిజన్‌లో పోలింగ్ బాగానే నమోదైనట్లు నేతలు అంచనా వేస్తున్నారు. ఈ డివిజన్ ఓటర్లు ఎవరి వైపు మొగ్గు చూపారనే దానిపై ఎవరికి వారు లెక్కలు వేసుకుంటున్నారు. గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ డివిజన్ ఓటర్లు బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మెజార్టీ లభించింది. అయితే నాగేందర్ తాజా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. ఆయనను జూబ్లీహిల్స్ డివిజన్ ఓటర్లు ఏ మేరకు స్వీకరిస్తారో చూడాల్సి ఉంది.

బొట్టుబిళ్లలతో 'జై శ్రీరామ్

రాముడిపై భక్తిని చాటుకున్న మహిళా కళాకారులు



బొట్టుబిళ్లలతో రూపొందించిన అయోధ్య ప్రాజెక్ట్ ఆవిష్కరిస్తున్న రూపకర్తలు

పంజగుట్ట: రాముడిపై ఉన్న భక్తిని వినూత్నంగా చాటుకున్నారు ఆరుగురు మహిళలు. ప్రతీరోజు ఐదు గంటలు, మొత్తంగా 12 రోజులు ఎంతో నిష్టగా ఉంటూ 32,970 బొట్టు బిళ్లలతో 30/40 అట్టపై తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో జై శ్రీరామ్ అని రూపొందించారు. దీనికి అయోధ్య ప్రాజెక్ట్ అని పేరు పెట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అయోధ్య ప్రాజెక్టును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టును రూపొందించిన కాసుల పద్మావతి, సూర్యకుమారి, యోగలక్ష్మి, ప్రతిభా థల్, రజనీ మంచికంటి, కోమలి మాట్లాడుతూ.. ఉమెన్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ బ్యానర్‌పై దీన్ని రూపొందించినట్లు తెలిపారు. 16,314 నారింజ బొట్టుబిల్లలు, 3,192 నీలం బొట్టుబిల్లలు, 13,464 ఆకుపచ్చ బొట్టుబిల్లలతో దీన్ని తయారు చేశామన్నారు. ఏప్రిల్ 19న ఏకాదశి రోజు ఈ పవిత్ర కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు. మాంసాహారం తినకుండా, ఎంతో పవిత్రంగా ఉంటూ రూపొందించామని తెలిపారు. డిసెంబర్‌లో తమ బృందం అయోధ్యకు వెళ్లి అయోధ్య మ్యూజియంలో దీన్ని ఉంచనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని కాసుల పద్మావతి చిత్ర కళా అకాడమీలో ప్రతీరోజు 5 గంటలు కష్టపడి దీన్ని రూపొందించామని పేర్కొన్నారు.

సీబీఎస్ఈ '12' ఫలితాల్లో జేహెచ్‌పీఎస్ ఘనత


స్కూల్ ఫస్ట్ ప్రియాన్స్ జైన్


స్కూల్ సెకండ్ అతిథి రావల్‌కొల్


స్కూల్ సెకండ్ ఎం.తనీషా

బంజారాహిల్స్: సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ 12వ తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి పాఠశాల పేరును మరోసారి నిలబెట్టారు. 12వ తరగతి కామర్స్ స్ట్రీమ్ విభాగంలో 100 శాతం ఉత్తీర్ణతతో విజయాన్ని సొంతం చేసుకున్నారు. 12వ తరగతి ప్రియాన్స్ జైన్ 93.6 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. ఆ తర్వాత స్థానంలో అతిథి రావల్‌కొల్, ఎం.తనీషా 93.2 శాతం మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారు. దివ్యన్షీ 91.4 శాతం మార్కులతో, బొమ్మసాయి నితీష్ 90.4 శాతం, మన్మత్ అగర్వాల్ 88.4 శాతం మార్కులతో ఆ తర్వాత స్థానాల్లో నిలిచారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల అసమాన కృషి, నిబద్ధతను ఈ ఫలితాలు తెలియజేస్తున్నాయని స్కూల్ ప్రిన్సిపాల్ కాంచనవల్లి ఆనందం వ్యక్తం చేశారు. సీనియర్ ప్రిన్సిపాల్ వరలక్ష్మీ మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల అకుంఠిత దీక్ష, పట్టుదలే ఈ ఫలితాలకు కారణమన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'ఎంజీఎం' వందశాతం ఉత్తీర్ణత

వెంగళరావునగర్: ఇటీవల జరిగిన సీబీఎస్ఈ పరీక్షల్లో యూసుఫ్‌గూడలోని మహాత్మాగాంధీ మెమోరియల్ హైస్కూల్ విద్యార్థులు 100 శాతం ఫలితాలు సాధించారు. కాగా, స్కూల్‌కు చెందిన బిందు వర్షిణి, లోహిత 92 శాతం మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా మంగళవారం స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ ఎం.ఎం. నాయుడు, ప్రిన్సిపాల్ కిరణ్‌నాయుడు విద్యార్థులను అభినందించారు.

సీబీఎస్ఈ 12 ఫలితాల్లో 'బీవీబీపీ' విద్యార్థుల ప్రతిభ


రిషిశర్మ


శ్రీహరి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ విద్యాశ్రమం 12వ తరగతి విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో ప్రతిభను చాటుకున్నారు. కామర్స్ విభాగంలో రిషిశర్మ అనే విద్యార్థి 500లకుగాను 464 (92.8 శాతం) మార్కులతో స్కూల్ టాపర్‌గా నిలిచాడు. సైన్స్ స్ట్రీమ్‌లో 98.4 శాతం మార్కులతో శ్రీహరి టాపర్‌గా నిలిచాడు. 12 పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు స్కూల్ ప్రిన్సిపాల్ పి.అరుణశ్రీ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులను ఆమె అభినందించారు.

'పది'లో జేహెచ్‌పీ వంద శాతం ఫలితాలు


స్కూల్‌టాపర్ సియా జైన్


రెండో స్థానం సిద్ధి అగర్వాల్


మూడో స్థానం కోట తనిష్క

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి మరసారి తన ప్రత్యేకతను చాటుకుంది. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో సియాజైన్ 98.2 శాతం మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, సిద్ధి అగర్వాల్ 98 శాతం మార్కులతో రెండో స్థానంలో కోట తనిష్క 97.6 శాతం మార్కులతో మూడోస్థానంలో నిలిచారు. షియా జైన్, అరవింద్, సిద్ధి అగర్వాల్ గణితంలో వంద శాతం మార్కులు సాధించారు. సియాజైన్ సాంఘిక శాస్త్రంలో 100 మార్కులు సాధించారు. మొత్తం 251 మంది విద్యార్థుల్లో 80 శాతం మంది విద్యార్థులు 75 శాతానికిపైగా మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ పి.కాంచనవల్లి అభినందించారు. స్కూల్ సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వరలక్ష్మి మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు చేజిక్కించుకుంటామని ఆకాంక్షించారు.

ఈవీఎంలకు 'స్ట్రాంగ్' భద్రత

- ఖైరతాబాద్‌లో 50.28 శాతం... జూబ్లీహిల్స్‌లో 45.69 పోలింగ్
- స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలు భద్రం
- భారీగా పోలీసు బందోబస్తు


స్ట్రాంగ్‌రూమ్‌కు తరలుతున్న ఓటింగ్ యంత్రాలు


స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతను పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలోని ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో సోమవారం జరిగిన పోలింగ్‌లో 50.28 శాతం ఓట్లు నమోదయ్యాయి. గత ఏడాది నవంబర్ 30న జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ ఎన్నికల్లో ఒక శాతం పోలింగ్ తక్కువగా నమోదైంది. కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతీ, యువకులు అంతా పార్లమెంటు ఎన్నికల్లో ఓటు వేసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అంతటా భారీగా పోలింగ్ జరిగింది. ప్రశాసన్‌నగర్ పోలింగ్ బూత్‌లో 1,374 ఓట్లకుగాను 834 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈ కాలనీలో ఈసారి ఎక్కువగానే పోలింగ్ శాతం నమోదైంది. పోలింగ్ ప్రారంభంలో మందకొడిగా మొదలు కాగా క్రమంగా పుంజుకుంది. ఉదయం 11 గంటలకు పోలింగ్ 18.32 శాతం మాత్రమే ఉండగా, రాత్రి 7 గంటల వరకు పోలింగ్ కొనసాగగా 50.28 శాతం నమోదైంది.

ఖైరతాబాద్‌లో పోలింగ్ బూత్‌లు: 245	
మొత్తం ఓటర్లు :	2,95,651
పురుషులు :	1,55,352
మహిళలు :	1,44,265
ఇతరులు :	34
పోల్ అయిన ఓట్లు :	1,50,653
పురుషులు	: 78,153
మహిళలు	: 72,490
ఇతరులు	: 10

స్ట్రాంగ్‌రూమ్‌లకు గట్టి భద్రత

ఈవీఎంలు పోలింగ్ బూత్‌ల నుంచి తరలించే ప్రక్రియ సోమవారం రాత్రి 8 గంటల నుంచి కొనసాగింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య రూట్ అధికారులు ప్రత్యేక బస్సులలో ఈవీఎంలను యూసుఫ్‌గూడ కోట్ల విజయ భాస్కర్‌రెడ్డి స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. ఖైరతాబాద్ అసెంబ్లీ ఏఆర్‌వో హేమంత్ బొర్కాడే, ప్రశాంతి, అనితారెడ్డి తదితరుల పర్యవేక్షణలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల వరకు ఈవీఎంలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచే ప్రక్రియ కొనసాగింది. ఖైరతాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ నుంచి ఫిలింనగర్ వరకు ఉన్న 245 పోలింగ్ బూత్‌ల ఈవీఎంలను కట్టుదిట్టమైన భద్రతనడుమ స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. అన్ని రూట్లలో పోలీసులు బందోబస్తు, పికెట్‌లు ఏర్పాటు చేసినట్లు బంజారాహిల్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అడుగడుగునా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్ల మొగ్గు కాంగ్రెస్ వైపే...

లిబర్టీ: రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.సదానందు అన్నారు. పోలింగ్ శాతం చూస్తే ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు అర్థమవుతోందన్నారు. తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హామీలు, వాగ్దానాల గురించి కాంగ్రెస్‌పై ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలను ఓటర్లు తిప్పికొట్టి బాసటగా నిలిచారని సదానంద్ పేర్కొన్నారు.

18 నుంచి ఉచిత రాజయోగ శిక్షణ తరగతులు

వెంగళరావునగర్ : ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఉచిత రాజయోగ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ మధురానగర్ శాఖ నిర్వాహకులు ఎస్.రాధిక తెలియజేశారు. మధురానగర్‌కాలనీలోని డి–బ్లాకు పార్క్ సమీపంలో ఉన్న నిహారిక నిలయంలో ఈ తరగతులు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 8, సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు 99124 01733 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.


మరోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం

బీజేపీ నేత కేశబోయిన శ్రీధర్




హిమాయత్‌నగర్: కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం రావడం, నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ నగర సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నేత కేశబోయిన శ్రీధర్ అన్నారు. ఓటుహక్కును వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విజయం, తెలంగాణలో బీజేపీ మెజార్టీ సీట్లలో విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వరుసగా మూడోసారి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పాటు చేసి రికార్డు సృష్టిస్తామని శ్రీధర్ స్పష్టం చేశారు.

సాయిచంద్రహాస్‌కు జీఈ అవార్డు



వెంగళరావునగర్: యూసుఫ్‌గూడకు చెందిన యువ న్యాయవాది ఎం.సాయి చంద్రహాస్ గ్లోబల్ ఎక్స్‌లెన్సీ అవార్డును అందుకున్నారు. బ్రాండ్ ఎంపవర్ సంస్థ ప్రతి ఏడాది వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన వారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి జీఈఏ అవార్డులను అందజేస్తుంది. ఇందులో భాగంగా మంగళవారం ముంబైలో జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ఆయనకు బాలీవుడ్ నటి శిల్పాశెట్టి అవార్డు అందజేశారు. సాయిచంద్రహాస్‌కు అవార్డు లభించడం పట్ల ఆయన తల్లిదండ్రులు ఎం.ఎం.నాయుడు, కిరణ్ నాయుడు, సహచర న్యాయవాదులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

రిలాక్స్



రహమత్‌నగర్: పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ముగిసింది. నిన్నటివరకు అలుపెరగక ప్రచారం నిర్వహించిన నాయకులు సేదతీరుతున్నారు. తమ అనుచరుల వద్ద గెలుపోటములపై లెక్కలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ తమ పార్టీ నాయకులతో కలిసి క్యారం బోర్డు ఆట ఆడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఇక రహమత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పార్టీ నాయకులతో సమీక్ష సమావేశాలు కొనసాగిస్తున్నారు. మరో కాంగ్రెస్ నేత భవానిశంకర్ కుటుంబ సభ్యులతో సరదాగా గడుపుతున్నారు.

ఆరా తీస్తూ.. లెక్కలు వేస్తూ..!

- లోక్‌సభ ఎన్నికల్లో పోలైన ఓట్లపై నేతల మల్లగుల్లాలు
- ఖైరతాబాద్ కాంగ్రెస్ కంచుకోట అంటున్న నేతలు


స్థానిక నేతలతో దానం

బంజారాహిల్స్: నెలన్నర రోజుల నుంచి అలుపెరగకుండా కార్యకర్తలు, నేతలతో కలిసి సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ ఇంటింటి ప్రచారం, రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లు, ఆత్మీయ సమ్మేళనాలతో క్షణం తీరిక లేకుండా గడిపారు. గెలుపే లక్ష్యంగా కంటి మీద కునుకు లేకుండా ఈ ఎన్నికలను సవాల్‌గా తీసుకున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురడమే లక్ష్యంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోనే ఇక్కడ అత్యధిక మెజార్టీపై దృష్టిపెట్టారు. బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలను భారీగా ఆకర్షించి కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీంతో ఆయన ఖైరతాబాద్‌ను మరోసారి కాంగ్రెస్ కంచుకోటగా మార్చేందుకు చేసిన ప్రయత్నాలు విజయవంతం అయినట్లుగా అంతా భావిస్తున్నారు. సోమవారం పోలింగ్ పూర్తికాగా మంగళవారం ఖైరతాబాద్‌లో ఎక్కడెక్కడ కాంగ్రెస్‌కు ఏ మేర ఓట్లు పడ్డాయనే దానిపై నేతలు, కార్యకర్తల ద్వారా లెక్కలు వేశారు. మైనార్టీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పోలింగ్ సరళిని పరిశీలించి ఏమేరకు లాభిస్తుందో లెక్కలు వేసి చూసుకున్నారు. బస్తీలు సైతం ఓటింగ్‌కు పెద్ద ఎత్తున కదిలిరాగా ఈ ఓట్లు ఎవరి వైపు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు.

పక్కా ప్రణాళికతో ప్రచారం..

ఖైరతాబాద్ నుంచే కాంగ్రెస్ విజయాలను నమోదు చేసుకుంటూ వెళ్లాలని నాగేందర్ పక్కా ప్రణాళికతో ప్రచారం నిర్వహించారు. అందుకు అనుగుణంగానే ఖైరతాబాద్‌లో పావులు కదిపారు. భారీగా ఓటర్లను ఆకట్టుకున్నారు. ఎన్నికల ఫలితాల్లో ఆయన ప్రయత్నాలు ఏ మేరకు సఫలం అవుతాయో వేచి చూడాల్సి ఉంది. అయితే నేతలు, కార్యకర్తలు మాత్రం అంతటా కాంగ్రెస్‌కు పాజిటివ్‌గానే ఉందంటూ ఆయనకు లెక్కలు విడమర్చి చెప్పారు. ఏ బూత్‌లో ఎన్ని ఓట్లు నమోదయ్యాయో వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారం, పోలింగ్ విరామం తరువాత ఆయన నేతలు, కార్యకర్తలతో ఫొటోలు దిగి సందడి చేశారు.

ప్లాస్టిక్ కవర్ల కోసం దిగి... నాలాలో కూరుకుపోయి..


నాలాలో కొట్టుకొచ్చిన మృతదేహం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నాలాలో ఓ మృతదేహం కొట్టుకువచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మంగళవారం ఉదయం ఇద్దరు వ్యక్తులు నడుచుకుంటూ విశ్వేశ్వరయ్య భవన్ ఎదురుగా ఉన్న మెట్రోస్టేషన్ పక్కన ఖైరతాబాద్ నాలాలోకి వెళ్లారు. వీరిద్దరూ ప్లాస్టిక్ కవర్లు, కాగితాలు ఏరుకొని జీవించేవారిగా పోలీసులు గుర్తించారు. అందులో ఓ యువకుడు నాలాలో ప్లాస్టిక్ కవర్లు ఏరేందుకు నాలాలోకి దిగి బురదలో కూరుకుపోయాడు. ఉదయం 11 గంటల సమయంలో నాలాలో మృతదేహం ఉన్నట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఖైరతాబాద్ పోలీసులు క్లూస్ టీమ్ సహాయంతో మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని మార్చురీకి తరలించారు. మృతదేహానికి సంబంధించిన వివరాల కోసం ఆరా తీస్తున్నారు.

మద్యంమత్తులో వృద్ధుడి ఆత్మహత్య


మృతుడు బాలయ్య

రహమత్‌నగర్ : భార్య చనిపోయి ఒంటరితనంలో బాధపడుతూ, మద్యానికి అలవాటు పడిన ఓ వృద్ధుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్పీఆర్‌హిల్స్ బ్రహ్మశంకర్‌నగర్‌కు చెందిన బాలయ్య(65) భార్య పదేళ్ల క్రితం చని పోయింది. దీంతో ఆయన అప్పటి నుంచి మద్యానికి అలవాటు పడ్డాడు. దీనికి తోడు బాలయ్య కిడ్నీ సంబంధిత సమస్య కూడా ఉంది. ఈ క్రమంలోనే మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆయన ఉరేసుకున్నాడు. అతని కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

దత్తాత్రేయ ఆరాధన మహోత్సవాలు



రహమత్‌నగర్: అవధూత దత్తాత్రేయ ఆరాధన మహోత్సవాలు ఓంనగర్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామి ఉపాసకులు నిఖిల్‌కులకర్ణి, రాజు, మహేష్‌యాదవ్, గణేష్, బీఆర్ఎస్ నాయకులు లియాకత్ అలీ, వినోద్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకెన్ని రోజులు.. ఈ మురుగు?



పంజగుట్ట: ఎర్రమంజిల్ నుండి రామకృష్ణానగర్ వెళ్లే మార్గంలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ పొంగి మురుగునీరు పారుతోంది. వీధి మొత్తం మురుగు నీరు, మట్టికుప్పలు, చెత్తతో నిండిపోయింది. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. ఈ మార్గం గుండా నడవలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటి కారణంగా దుర్వాసన, దోమలు, ఈగలు వస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

బీసీ కులవృత్తుల కార్పొరేషన్ అవసరం

లిబర్టీ: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులవృత్తులను కాపాడాలని బీసీదళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి కోరారు. క్రమంగా కుల వృత్తులు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా సంప్రదాయ కులవృత్తులను నమ్ముకొని జీవనం సాగిస్తున్నవారిని కాపాడటంతోపాటు ఆర్థికంగా చేయూతనివ్వటానికి బీసీ కులవృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్కకు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేశారు. గీత, నేత, కుమ్మరి, వడ్రంగి వంటి అనేక కులవృత్తుల వారు నేటికీ తమ జీవితాల్లో వెలుగు లేక ఆర్థికంగా చితికిపోయి ఉన్నారని తెలిపారు. కుల వృత్తుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని కుమారస్వామి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసి కార్పొరేషన్ ఏర్పాటుకు జీవో జారీ చేయాలని కోరారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



బంజారాహిల్స్: సగరుల ఆరాధ్యదైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలు మంగళవారం ఫిలింనగర్‌లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ జయంతి వేడుకల్లో పాల్గొని భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉప్పర సంఘం అధ్యక్షుడు మధుసాగర్, ప్రధాన కార్యదర్శి నాగేష్ సాగర్, నేతలు ఎస్పీ శ్రీను, ఆవుల రాజన్న, గుంటి వెంకటేష్, డి.వెంకటస్వామి, చీరల రామచంద్రయ్య సాగర్, జి.శాంతయ్య, కె. ఈశ్వర్ తదదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కూడా బీఆర్ఎస్ దారిలోనే...

ఎమ్మెల్సీ అభ్యర్థి బక్క జడ్సన్

పంజగుట్ట: గత పది సంవత్సరాల్లో జరిగిన బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలను తెలుసుకుని ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే అది కూడా అదే దారిలో పోతోందని వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు తెలంగాణ విఠల్, పృథ్వీరాజ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్ కేలండర్ ప్రకారం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, కానీ ఇప్పటివరకు ఏ శాఖలో ఎన్ని ఖాళీలు ఉన్నాయో కూడా గుర్తించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము గత సంవత్సరం డిసెంబర్ నాటికి 2.67 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గుర్తించామన్నారు.

రాహుల్ ప్రధాని కావాలి: వినోద్ రెడ్డి

హిమాయత్‌నగర్: దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధానిగా అవ్వాల్సిన అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రజలు తీర్పు ఇవ్వనున్నారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జి.వినోద్ రెడ్డి అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ సీట్లలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యమన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతుందని వినోద్ రెడ్డి స్పష్టం చేశారు.

ఎన్నికల సిబ్బందికి అభినందనలు


సిబ్బందిని అభినందిస్తున్న సహాయ ఎన్నికల అధికారి

బంజారాహిల్స్: ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలో 240 పోలింగ్ బూత్‌లలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించిన సిబ్బందిని ఖైరతాబాద్ అసెంబ్లీ సహాయ రిటర్నింగ్ అధికారి హేమంత్ బోర్కాడే ప్రత్యేకంగా అభినందించారు. గత రెండు నెలలుగా సిబ్బంది ఈ ఎన్నికల ఏర్పాట్లలో నిమగ్నమై చిత్తశుద్ధితో అంకితభావంతో పని చేయడం వల్లే ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు. ఈవీఎంలను పోలింగ్ కేంద్రాలకు చేర్చడంలోనూ, ప్రిసైడింగ్ అధికారులకు అప్పగించడంలోనూ, పోలింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను ప్రణాళికా బద్ధంగా స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చడంలోనూ ఖైరతాబాద్ అసెంబ్లీ ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎంతో కృషి చేశారని తెలిపారు.

రాజకీయపక్షాల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్



బంజారాహిల్స్: సికింద్రాబాద్ పార్లమెంటు పరిధి కిందకు వచ్చే ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో పోలింగ్ పూర్తయిన తర్వాత మంగళవారం తెల్లవారుజాము వరకు ఈవీఎంలను భారీ బందోబస్తు మధ్య యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలోని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించారు. వీటిని స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచిన తర్వాత రాజకీయ పక్షాల ప్రతినిధుల సమక్షంలో ఖైరతాబాద్ అసెంబ్లీ సహాయ రిటర్నింగ్ అధికారులు హేమంత్ బోర్కాడే, ప్రశాంతి, అనితారెడ్డి తదితరులు సీల్ వేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద సాయుధ బలగాల బందోబస్తు ఏర్పాటు చేశారు. మూడంచెల భద్రతా వ్యవస్థ ఇక్కడ కొనసాగుతున్నది.

బరిలో హేమాహేమీలు

యూపీలో ఐదో విడతలో హోరాహోరీ

- రాయ్‌బరేలీలో రాహుల్, అమేథీలో స్మృతి
- 14 లోక్‌సభ స్థానాలకు 20న పోలింగ్

హస్తినకు గేట్‌వే లాంటి ఉత్తరప్రదేశ్‌లో నాలుగు విడతల్లో సగం లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. ఐదో విడతలో 14 నియోజకవర్గాల్లో ఈ నెల 20న పోలింగ్‌కు సర్వం సిద్ధమవుతోంది. అక్కడ పార్టీలన్నీ నువ్వా నేనా అనేలా తలపడుతున్నాయి. అభ్యర్థుల ప్రచారం ఫుల్ స్వింగ్‌లో సాగుతోంది. రాహుల్ గాంధీ, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ వంటి హేమాహేమీలు బరిలో ఉన్నారు. ఈ విడతలో కీలక నియోజకవర్గాలు, అభ్యర్థుల బలాబలాలేంటో చూద్దాం... - సాక్షి, నేషనల్ డెస్క్

పాడెపై వెళ్లి నామినేషన్!

గోరఖ్‌పూర్‌లో విచిత్రం

ఎన్నికల వేళ నామినేషన్ దాఖలు సందర్భంగా అభ్యర్థులు చిత్ర విచిత్ర విన్యాసాలతో అందరి దృష్టినీ ఆకర్షించడం పరిపాటే. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి మంగళవారం ఏకంగా పాడె మీద ఊరేగుతూ వచ్చి నామినేషన్ వేశారు! ఆయన పేరు రాజన్ యాదవ్. ఎంబీఏ పట్టభద్రుడైన ఆయన బౌద్ధ సన్యాసిగా మారారు. భిక్షపైనే జీవిక గడుపుకుంటారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడిందని చెప్పేందుకే తానిలా పాడెపై వచ్చానని చెప్పారాయన. 'పాడె బాబా'గా ఆయన స్థానికంగా బాగా ప్రసిద్ధుడు. ఈసారి తన ఎన్నికల కార్యాలయాన్ని కూడా ఏకంగా శ్మశానవాటికలోనే తెరిచారు!



స్థానిక రాప్తీ నది ఒడ్డున ఉన్న ఆ శ్మశానవాటిక నుంచే ఎన్నికల సంబంధిత కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం తనను చూసేందుకు వచ్చిన ఒక్కొక్కరి నుంచి రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారు.

గమ్మత్తైన హామీలు

రాజన్ యాదవ్ ఎన్నికల హామీలు కూడా చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. తనను గెలిపిస్తే ఎలాగైనా లైఫ్‌టైం ఉచిత ఇన్‌కమింగ్ కాల్స్ సౌకర్యాన్ని తిరిగి తీసుకొస్తానంటున్నారాయన. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ద్విచక్ర వాహనాలకు వేస్తున్న జరిమానాలు కూడా మరీ ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇస్తున్నారు. గతంలోనూ ఎన్నికల్లో పోటీ చేసిన చరిత్ర ఈ 'పాడె బాబా'ది. ఆయన తర్వాతి లక్ష్యం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలట! ఆ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకూ పోటీ చేసి ఆప్ చీఫ్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను గద్దె దింపడమే తన లక్ష్యమని చెబుతున్నారు!

- గోరఖ్‌పూర్

రాయ్‌బరేలీ... రాహుల్‌కు అచ్చొచ్చేనా?



● రాహుల్ గాంధీ

ఈ స్థానం కాంగ్రెస్ దుర్గం. ఫిరోజ్ గాంధీ మొదలుకుని ఆయన భార్య ఇందిర, కోడలు సోనియా దాకా హస్తం జెండానే ఎగురుతోంది. మధ్యలో 1996, 1998ల్లో మాత్రం బీజేపీ విజయం సాధించింది. భర్త రాజీవ్ నియోజకవర్గమైన అమేథీ నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించిన సోనియా తర్వాత ఆ సీటును కుమారుడు రాహుల్‌కు అప్పగించి 2004లో అత్తగారి కంచుకోటలో పాగా వేశారు. అప్పటి నుంచీ వరుసగా విజయం సాధిస్తున్నారు. ఈసారి సోనియా ప్రత్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొని రాజ్యసభకు వెళ్లడంతో కాంగ్రెస్ నుంచి ఎవరు నిలబడతారనే సస్పెన్స్ కొనసాగింది. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంకా గాంధీ ఎంట్రీ ఇస్తారంటూ ఊహాగానాలు చక్కర్లు కొట్టినా చివరకు రాహులే బరిలో దిగారు. ఆయనపై దినేశ్ ప్రతాప్ సింగ్‌ను బీజేపీ బరిలోకి దించింది. గత ఎన్నికల్లో కూడా దినేశ్ సోనియాపై పోటీ చేసి ఓడారు. ఆయన 2018లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరారు. గత ఎన్నికల్లో అమేథీలో స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి చవిచూడటం తెలిసిందే. అదే ఊపులో ఈసారి రాయ్‌బరేలీని కూడా చేజిక్కించుకోవాలని బీజేపీ భావిస్తోంది. కానీ ఇక్కడ ఇండియా కూటమి బలంగా ఉంది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు ఎస్పీ గుప్పిట్లోనే ఉన్నాయి. ఒక్కచోట మాత్రమే బీజేపీ నెగ్గింది.



● దినేశ్ ప్రతాప్ సింగ్

ఝాన్సీ.. హోరాహోరీ




● ప్రదీప్ జైన్ ఆదిత్య

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి పుట్టిల్లయిన ఝాన్సీ పేరు చెప్పగానే రాణీ లక్ష్మీబాయి వీరోచిత పోరు కళ్లముందు కదలాడుతుంది. 1989 నుంచీ బీజేపీకి గట్టి పట్టున్న ఈ నియోజకవర్గాన్ని మధ్యలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు దక్కించుకున్నప్పటికీ... తిరిగి కమలం విరబూసింది. గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీయే ఇక్కడ విజయ ఢంకా మోగించింది. 2014లో కాషాయ ఫైర్‌బ్రాండ్ ఉమా భారతి 1.9 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. 2019లో బీజేపీ తరఫున టికెట్ దక్కించుకున్న అనురాగ్ శర్మ రెట్టింపు స్థాయిలో 3.7 లక్షల మెజారిటీతో ఎస్పీ అభ్యర్థి శ్యామ్ సుందర్ సింగ్ యాదవ్‌పై బంపర్ విక్టరీ కొట్టారు. ఈసారి కూడా సిట్టింగ్ ఎంపీ అనురాగ్ శర్మకే బీజేపీ చాన్సిచ్చింది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రదీప్ జైన్ ఆదిత్య బరిలో ఉన్నారు. 2009లో ఆయన ఇక్కడ ఘన విజయం సాధించడం విశేషం. బీఎస్పీ రాకేశ్ కుశ్వాహను పోటీకి దించింది. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు కమలం, ఒకటి ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్ చేతిలో ఉన్నాయి. ఇక్కడ పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే నెలకొంది. గతంలో బీఎస్పీకి కూడా గణనీయంగా ఓట్లు పడటంతో పోటీ ఉత్కంఠ రేపుతోంది.



● అనురాగ్ శర్మ

లఖ్‌నవూ... రాజ్‌నాథ్ హ్యాట్రిక్ గురి




● రాజ్‌నాథ్ సింగ్

ఒకప్పుడు కాంగ్రెస్ ఓ వెలుగు వెలిగిన ఈ నియోజకవర్గంలో 1991 నుంచీ కాషాయ జెండానే రెపరెపలాడుతోంది. బీజేపీ దిగ్గజం అటల్ బిహారీ వాజ్‌పేయి 1991 నుంచి 2004 వరకు వరుసగా ఐదు సార్లు ఘన విజయం సాధించిన సీటిది. 2009లో లాల్జీ టాండన్ గెలుపొందగా... ఆ తర్వాత పార్టీలో కీలక నేత రాజ్‌నాథ్ సింగ్ ఇక్కడ పాగా వేశారు. గత రెండు ఎన్నికల్లో ఆయనదే పూర్తి హవా. 2014లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు రీటా బహుగుణ జోషిపై 2.7 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి హేమవతీ నందన్ బహుగుణ కుమార్తె ఆమె. నందన్ బహుగుణ కూడా ఇక్కడ జనతా పార్టీ తరఫున 1977లో గెలుపొందడటం విశేషం. ఇక 2019లో ఎస్పీ తరఫున పోటీ చేసిన ప్రముఖ నటి, బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా భార్య పూనమ్ సిన్హాను రాజ్‌నాథ్ 3.5 లక్షల ఓట్ల భారీ తేడాతో ఓడించారు. ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విక్టరీపై కన్నేశారు. ఎస్పీ తరఫున రవిదాస్ మెహ్రోత్రా బరిలో ఉన్నారు. అఖిలేశ్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా పనిచేసిన రవిదాస్‌కు రాష్ట్ర రాజకీయాల్లో మంచి పట్టుంది. బీఎస్పీ నుంచి సర్వర్ మాలిక్ పోటీ చేస్తున్నారు. లక్నో పరిధిలోని 5 అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు బీజేపీ, రెండు ఎస్పీ ఖాతాలో ఉన్నాయి.



● రవిదాస్ మెహ్రోత్రా

ఫైజాబాద్... అయోధ్య కలిసొచ్చేనా!?



● లల్లూ సింగ్

హిందువుల కల నెరవేరిన అయోధ్య రామ మందిరం కొలువు దీరిన లోక్‌సభ నియోజకవర్గమిది. గతంలో ఇది అయోధ్య లోక్‌సభ నియోజకవర్గంగానే ఉండేది. పునర్విభజన తర్వాత ఫైజాబాద్‌గా పేరు మారింది. గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ తరఫున విక్టరీ కొట్టిన లల్లూ సింగ్ ఈసారి హ్యాట్రిక్ కోసం తహతహలాడుతున్నారు. 2014లో గెలవడానికి ముందు ఆయన అయోధ్య అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం. సమాజ్‌వాదీ తరఫున పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అవధేశ్ ప్రసాద్ బరిలోకి దిగారు. ప్రస్తుతం ఆయన ఇక్కడి అసెంబ్లీ స్థానం మిల్కిపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా. ఒంటరి పోరాటం చేస్తున్న బీఎస్పీ సచ్చిదానంద్ పాండేకు టికెటిచ్చింది. ఈ ఎంపీ సీట్లో 76 శాతం హిందువులు, 22 శాతం ముస్లిం జనాభా ఉంటారు. రామజన్మభూమి వివాదానికి తెర దించి రామ మందిరాన్ని సాకారం చేసిన బీజేపీ ఫుల్ జోష్‌లో ఉంది. మోదీ–యోగి ఫ్యాక్టర్‌తో ఈసారి కూడా కచ్చితంగా గెలుపు తమదేనని ధీమాగా ఉంది. ముస్లిం ఓటు బ్యాంకు దన్నుతో ఇండియా కూటమి కూడా గట్టి పోటీనే ఇస్తోంది. ఈ సీట్లో మొత్తం 5 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, నాలుగు బీజేపీ, ఒకటి ఎస్పీ గెల్చుకున్నాయి.



● అవధేశ్ ప్రసాద్

కైసర్‌గంజ్... బీజేపీకి ఎదురుగాలి!



● కరణ్ భూషణ్ సింగ్

వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సీటిది. రెజ్లింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా చక్రం తిప్పిన బ్రిజ్‌భూషణ్ లైంగిక ఆరోపణల కేసులో చిక్కుకోవడంతో కాషాయ పార్టీ ఈసారి ఆయనకు సీటిచ్చేందుకు చివరివరకు తటపటాయించింది. కానీ తన కుమారుడు కరణ్ భూషణ్‌కు టికెట్ దక్కించుకోవడంలో బ్రిజ్ భూషణ్ విజయం సాధించారు. సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోట అయిన ఈ సీటును కాషాయ గూటికి తెచ్చిన ఘనత ఆయనదే. సమాజ్‌వాదీ దిగ్గజ నేత బేణీప్రసాద్ వర్మ ఇక్కడ వరుసగా ఐదుసార్లు గెలిచారు. 2014, 2019ల్లో బ్రిజ్ భూషణ్ వరుస విజయాలతో ఎస్పీ హవాకు గండిపడింది. ఎస్పీ నుంచి ఈసారి రామ్ భగత్ మిశ్రా పోటీ చేస్తున్నారు. బీఎస్పీ నరేంద్ర పాండేను రంగంలోకి దించింది. దేశవ్యాప్తంగా బీజేపీపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైన బ్రిజ్ భూషణ్ కుమారుడికే మళ్లీ టికెటివ్వడాన్ని ఇండియా కూటమి ప్రచారాస్త్రంగా మలచుకుంటోంది. కుమారుడిని గెలిపించుకోవడానికి బ్రిజ్ భూషణ్ తీవ్రంగానే కష్టపడుతున్నా బీజేపీకి ఎదురుగాలి తప్పదంటున్నారు విశ్లేషకులు. ఈ నియోజకవర్గంలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను నాలుగు చోట్ల కాషాయ జెండా ఎగురుతోంది. ఒక చోట ఎస్పీ గెలిచింది.



● నరేంద్ర పాండే

స్మృతి వర్సెస్ కిశోరీ

అమేథీలో మారిన ఎన్నికల చిత్రం

- గెలుపుపై ధీమాతో సిట్టింగ్ ఎంపీ
- స్మృతి తనకు పోటీయే కాదంటున్న శర్మ



అమేథీ. ఉత్తరప్రదేశ్‌లోని ఈ లోక్‌సభ స్థానం గాంధీ కుటుంబానికి పెట్టని కోట.. కాంగ్రెస్‌కు కంచుకోట. అలాంటి దీర్ఘకాల రాజకీయ వారసత్వానికి 2019లో బీజేపీ గట్టి షాకే ఇచ్చింది. ఏకంగా గాంధీ కుటుంబ వారసుడు రాహుల్‌గాంధీనే ఓడించి కాంగ్రెస్ కుంభస్థలం మీద కొట్టింది. పార్టీ తరఫున నెగ్గి జెయింట్ కిల్లర్‌గా అవతరించిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఈసారి కూడా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రాహుల్‌కు బదులు గాంధీ కుటుంబ విధేయుడు కిశోరీలాల్ శర్మ బరిలోకి దిగారు. ఓటమి భయంతోనే అమేథీని వదిలి రాయ్‌బరేలీకి మారారంటూ సోషల్ మీడియాలో రాహుల్ ఒక రేంజ్‌లో ట్రోలింగ్‌కు గురయ్యారు. ఈ నెల 20న ఐదో విడతలో పోలింగ్ జరగనున్న అమేథీపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది... - సాక్షి, నేషనల్ డెస్క్



కీలకం

గాంధీల అనుబంధం

అమేథీ లోక్‌సభ నియోజకవర్గం 1967లో ఏర్పడింది. నాటినుంచీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. 1977 ఎన్నికల్లో మాత్రం ఎమర్జెన్సీ ప్రభావంతో జనతా పార్టీకి చెందిన రవీంద్ర ప్రతాప్ సింగ్ గెలుపొందారు. ఇందిరాగాంధీ రెండో కుమారుడు సంజయ్ గాంధీని 75,000కు పైగా ఓట్లతో ఓడించారు. 1980 ఎన్నికల్లో సంజయ్ పుంజుకుని రవీంద్ర ప్రతాప్ సింగ్‌ను 1,28,545 తేడాతో ఓడించారు. అదే ఏడాది జూన్‌లో సంజయ్ విమాన ప్రమాదంలో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో రాజీవ్ గాంధీ 2,37,696 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్‌పై సంజయ్ భార్య మేనకా గాంధీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. రాజీవ్ దేశవ్యాప్త ప్రచారంలో బిజీగా ఉండటంతో ఆయన తరఫున భార్య సోనియాగాంధీ తొలిసారి ఎన్నికల ప్రచార బరిలో దిగారు. తలపై చీరకొంగు, నుదుటన బొట్టు, చేతికి ఎర్రటి గాజులు, స్వచ్ఛమైన హిందీతో సామాన్యులను బాగానే ఆకట్టుకున్నారు. పెద్ద పెద్ద ప్రసంగాలు చేయకున్నా ఇటు పార్టీ నాయకులకు, అటు ప్రజలకు చేరువయ్యారు. ప్రధానిగా రాజీవ్ అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోరన్న ప్రచారం జరిగినా అమేథీ ప్రజలు ఆయనవైపే నిలిచారు. మేనకపై ఏకంగా 3.14 లక్షల మెజారిటీతో రాజీవ్ ఘనవిజయం సాధించారు. అమేథీలో నేటికీ అదే రికార్డు మెజారిటీ. రాజీవ్ మరణించేదాకా అమేథీ నుంచే ప్రాతినిధ్యం వహించారు. తరవాత ఆయన స్థానంలో గాంధీ కుటుంబ సన్నిహితుడు సతీశ్ శర్మ విజయం సాధించి పీవీ కేబినెట్‌లో పెట్రోలియం మంత్రిగా కూడా చేశారు.

గ్రామీణ ఓటర్లు 96 శాతం	
పట్టణ ఓటర్లు	4 శాతం
హిందువులు	85 శాతం
ముస్లింలు	15 శాతం
ఎస్సీలు	26.6 శాతం

ఎప్పుడెవరు గెలిచారు

ఏడాది	విజేత	పార్టీ
1967	విద్యాధర్ బాజ్‌పేయ్	కాంగ్రెస్
1971	విద్యాధర్ బాజ్‌పేయ్	కాంగ్రెస్
1977	రవీంద్ర ప్రతాప్ సింగ్	జనతా పార్టీ
1980	సంజయ్ గాంధీ	కాంగ్రెస్
1981	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1984	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1989	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1991	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1991	సతీశ్ శర్మ (ఉప ఎన్నిక)	కాంగ్రెస్
1996	సతీశ్ శర్మ	కాంగ్రెస్
1998	సంజయ్ సింగ్	బీజేపీ
1999	సోనియా గాంధీ	కాంగ్రెస్
2004	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2009	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2014	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2019	స్మృతి ఇరానీ	బీజేపీ

బీజేపీ ఎంట్రీ...

1998లోనే బీజేపీ అమేథీలో పాగా వేసింది. సతీశ్ శర్మ రెండుసార్లు గెలిచిన తర్వాత 1998లో బీజేపీ అభ్యర్థి సంజయ్ సింగ్ చేతిలో ఓటమి చవిచూశారు. 1999లో సోనియా అమేథీ నుంచే గెలిచి ఎన్నికల అరంగేట్రం చేశారు. తర్వాత 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ రాహుల్ గెలిచారు. 2019 దాకా దశాబ్దన్నర పాటు ఆయన హవాయే సాగింది. 2014 ఎన్నికల్లో రాహుల్ చేతిలో ఓడిన స్మృతి వ్యూహాత్మకంగా నియోజకవర్గంపై బాగా దృష్టి పెట్టారు. దీనికి మోదీ మేనియా తోడై 2019లో రాహుల్‌ను స్మృతీ ఓడించగలిగారు.

ఎస్పీ పూర్తి మద్దతు

అమేథీలో కాంగ్రెస్ నుంచి రాహుల్ బరిలో దిగుతారా, లేదా అన్న దానిపై చిట్టచివరి నిమిషం దాకా ఉత్కంఠే కొనసాగింది. ఒకానొక దశలో అమేథీ నుంచి రాహుల్, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక బరిలోకి దిగుతారన్న ప్రచారమూ జరిగింది. ఎట్టకేలకు నామినేషన్ల దాఖలుకు చివరి రోజున రాహుల్ రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగడం ఖాయమైంది. అమేథీ నుంచి పార్టీ సీనియర్ నేత, గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కిశోరీ లాల్ శర్మను కాంగ్రెస్ పోటీకి దింపింది. 40 ఏళ్లుగా నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న శర్మ అందరికీ సుపరిచితుడు. దీనికి తోడు ఇండియా కూటమి భాగస్వామి సమాజ్‌వాదీ ఈసారి కాంగ్రెస్‌కు అన్నివిధాలా దన్నుగా నిలుస్తోంది. అమేథీ, రాయ్‌బరేలీల్లో కాంగ్రెస్ విజయం కోసం రెండు పార్టీల కార్యకర్తలు కలిసికట్టుగా పని చేస్తున్నారు. కుల సమీకరణాలు కూడా పని చేస్తున్నాయి. ఈ సారి యాదవులంతా ఒక్కతా టిపైకి వచ్చారు. అఖిలేశ్ చెప్పినవైపే తమ ఓటంటున్నారు. ఈ సానుకూలత సాయంతో కాంగ్రెస్ తన కంచు కోటను తిరిగి కైవసం చేసుకుంటుందా, స్మృతీయే మళ్లీ గెలుస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

ఓటర్లు.. ఓట్ల శాతం..

అమేథీ లోక్‌సభ స్థానం పరిధిలో జిల్లాలోని అమేథీ, తిలోయి, జగదీశ్‌పూర్, గౌరీగంజ్, రాయ్‌బరేలి జిల్లాలోని సలోన్ అసెంబ్లీ స్థానాలున్నాయి. నియోజకవర్గ జనాభా 20 లక్షల పై చిలుకు. 1999, 2004, 2009ల్లో కాంగ్రెస్ అత్యధిక ఓట్ల శాతంతో గెలిచింది. 2014లో బొటాబొటిగా గట్టెక్కింది. 2019లో 49.7 శాతం ఓట్లతో బీజేపీ గెలిచింది. స్మృతి ఇరానీ 55,000 ఓట్ల మెజారిటీతో రాహుల్‌ను ఓడించారు. అమేథీలో ఏకంగా 96 శాతం ఓటర్లు గ్రామీణులే!

స్మృతి టెంపుల్ రన్...

ఇక ఈసారి స్మృతి ఇరానీ ఆరునెలల ముందునుంచే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. అమేథీలో అత్యధిక సంఖ్యాకులైన గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేందుకు నవరాత్రి సందర్భంగా ఆలయాలు సందర్శించారు. అమేథీలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న ప్రముఖ దేవాలయాలన్నీ దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని దాదాపు 42 దేవాలయాలకు తన ఫొటోతో కూడిన బహుమతి ప్యాక్‌లను పంపి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో ఉంటూ అమేథీకి ప్రాతినిధ్యం వహించబోనంటూ గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఇటీవలే అమేథీలో ఇల్లు కొని గృహ ప్రవేశం చేశారు. నియోజకవర్గంలో శాశ్వత చిరునామా ఏర్పాటు చేసుకున్నారు. నెహ్రూ–గాంధీ కుటుంబం వల్లే నియోజకవర్గం ఇంత కాలం వెనుకబడి ఉందంటూ ప్రత్యర్థిపై మాటల దాడి తీవ్రతరం చేశారు. బీజేపీ అయితే రాహుల్ తమకు భయపడే అమేథీ వదిలి రాయబరేలీ పారిపోయారంటూ ప్రచారం చేస్తోంది.

నోటా.. కోరల్లేని పులి!

దశాబ్దం క్రితం దేశ ఎన్నికల్లో వినూత్న ప్రయోగానికి తెరలేచింది. పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల్లో ఎవరూ నచ్చకపోతే ఏం చేయాలనే ఓటర్ల సందిగ్ధతకు తెరదించుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)లో ప్రత్యామ్నాయం లభించింది. అదే 'నోటా'. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చలేదని చెప్పే బటన్. అయితే దీన్ని ఎంచుకుంటున్న ఓటర్ల సంఖ్య అంతంతే ఉంటోంది. అభ్యర్థులపై వ్యతిరేకత ఉన్నా నోటాకు వేసే ఓట్లతో ఫలితాలపై ఎలాంటి ప్రభావం ఉండకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఇది కోరల్లేని పులిగా మారిందనేది విశ్లేషకుల వాదన. ఇండోర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పుకుని షాకివ్వడం, దాంతో నోటాకే ఓటేయాలని పార్టీ పిలుపునివ్వడం తెలిసిందే. దాంతో నోటా మరోసారి చర్చల్లోకి వచ్చింది... - సాక్షి, నేషనల్ డెస్క్

ఆదరణ అంతంతే



ప్రయోజనం.. ఫ్చ్!

పార్టీలు ఎన్నికల్లో నేరచరితులు, కళంకితులైన అభ్య**ర్థులను నిలబెట్టకుండా** చూడటమే లక్ష్యంగా పీపుల్స్ **యూనియన్ ఫర్ సివిల్** లిబర్టీస్ (పీయూసీఎల్) అనే **స్వచ్ఛంద సంస్థ సుప్రీం**కోర్టు తలుపు తట్టింది. పోటీలో ఉన్న **వారెవరూ ఓటర్లకు నచ్చ**ని పక్షంలో తాము ఎవరికీ ఓటువేయాల**నుకోవడం లేదని చెప్పేం**దుకు బ్యాలెట్ పేపర్లు/ఈవీఎంలలో **తగిన ఏర్పాటు చేయాలని** ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ **2013 సెప్టెంబర్‌లో కోర్టు** తీర్పు వెలువరించింది. అలా **ఈవీఎంలలోకి నోటా బటన్** వచ్చి చేరింది. ఈవీఎం **బ్యాలెట్ యూనిట్‌లోని 16** బటన్లలో చివరి ఆప్షన్‌గా **నోటా ఉంటుంది. దీనికి కూడా** ప్రత్యేకంగా ఇంటూ (X) **మార్కు కూడా కేటాయించారు**. 2013లో జరిగిన ఐదు **రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో నోటా** గుర్తును తొలిసారి ప్రవే**శపెట్టారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో** దీనికి మరింత **ప్రాచుర్యం లభించింది. గత ఐదేళ్ల**లో జరిగిన అన్ని ఎన్నికల్లో **కలిపి నోటాకు 1.29 కోట్ల ఓట్లొచ్చా**యి. అయినా కళంకితులకు **టికెట్లిచ్చే విషయంలో పార్టీల తీరు**లో మార్పేమీ రాలేదు. ఎన్నికల్లో **పోటీ చేస్తున్న నేరచరితుల సంఖ్య** అంతకంతకూ పెరుగుతూనే ఉంది. **అయితే ఎస్సీ, ఎస్టీ రిజర్వుడ్ లోక్‌సభ**, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మాత్రం **నోటాకు ఎక్కువ ఓట్లు పడుతుండటం** విశేషం!

ఆ పవర్ ఇస్తేనే...

ప్రస్తుత నిబంధనల ప్రకారం నోటాకు అభ్యర్థులందరి కంటే ఎక్కువ ఓట్లొచ్చినా ఎన్నికపై ఎలాంటి ప్రభావమూ ఉండదు. ఆ ఓట్లన్నింటినీ పక్కనపెట్టి అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన వారే విజేత అవుతారు. అలా నోటా కేవలం అభ్యర్థులపై ఓటర్లు అసమ్మతిని వ్యక్తం చేసే ఆప్షన్‌గా మిగిలిపోతోంది. అలాగాక నోటాకే ఎక్కువ ఓట్లు పోలైతే తిరస్కరణకు గురైన అభ్యర్థులు మళ్లీ పోటీ చేయకుండా నిషేధించాలి. అప్పుడే పార్టీలు నేరచరితులను పక్కన పెడతాయి'' అని యాక్సిస్ ఇండియా చైర్మన్ ప్రదీప్ గుప్తా అభిప్రాయపడ్డారు. నోటాకు నిర్దిష్ట శాతానికి మించి ఓట్లు పోలైతే అభ్యర్థులను మార్చడం, మళ్లీ ఎన్నిక నిర్వహించడం వంటి మార్గాలను నిపుణులు సూచిస్తున్నారు.

- ఏడీఆర్ డేటా ప్రకారం ఎన్నికల్లో నోటాకు 0.5 శాతం నుంచి 1.5 శాతం మేర ఓట్లు పోలయ్యాయి.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు ఏకంగా 1.06 శాతం ఓట్లు రావడం విశేషం!
- లోక్‌సభ ఎన్నికల చరిత్రలో నోటాకు లక్షద్వీప్‌లో అతి తక్కువగా 100 ఓట్లే పడ్డాయి.
- బిహార్‌లోని గోపాల్‌గంజ్ ఎస్సీ రిజర్వుడ్ స్థానంలో నోటాకు అత్యధికంగా 51,660 ఓట్లు వచ్చాయి.
- 2018 ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా నోటాకు 1.98 శాతం ఓట్లు దక్కాయి.
- మహారాష్ట్రలోని లాతూర్ రూరల్ అసెంబ్లీ స్థానంలో నోటాకు అత్యధికంగా 27,500 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓట్లలో ఇవి ఏకంగా 13 శాతం! అక్కడ 67 శాతం ఓట్లతో గెలిచిన ధీరజ్ దేశ్‌ముఖ్ తర్వాత నోటాకే రెండో స్థానం దక్కడం విశేషం.
- ఇటీవలి ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో 20 స్థానాల్లో నోటా మూడో స్థానంలో నిలిచింది!
- మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాల్లో గెలిచిన అభ్యర్థి సాధించిన మెజారిటీ కంటే నోటాకు ఎక్కువ ఓట్లు పడ్డాయి!
- క్రిమినల్ కేసులున్న ముగ్గురికి మించి అభ్యర్థులు పోటీ చేసే రెడ్ అలర్ట్ నియోజకవర్గాల్లో 2018 నుంచి నోటాకు 27.77 లక్షల ఓట్లు పోలయ్యాయి.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 15-5-2024

విభిన్నం







ప్రాణమున్న గోడలు

బయటి గోడలు
ఎలా ఉంటే ఏంటి అనుకుంటారు
చాలామంది.
అరె.. ఇలా ఉంటే ఎంత బాగుంటుంది
అనేలా చేస్తుంది స్నేహ చక్రవర్తి.

ఎత్తుగా ఉండే గోడలపై
భారీ మ్యూరల్స్ గీయడం సవాలు.
మహిళా ఆర్టిస్ట్‌గా ఆ సవాలును ఎదుర్కొంది స్నేహ.
దేశంలో గొప్ప కుడ్య చిత్రకారిణిగా ఉన్న
ఆమె జీవన విశేషాలు.

స్నేహ చక్రవర్తి

కూర్గ్ కాఫీ తోటల్లో పనిచేసే కార్మికులు, కొచ్చిలో చేపలు పట్టే బెస్తవారు, బెంగళూరులో ఇడ్లీ హోటల్ నడిపే ముసలామె, తమిళనాడులో తిరిగే జడలు గట్టిన సాధువులు, కష్టజీవులు, శ్రామిక మహిళలు... వీరిని భారీ బొమ్మలుగా ఎప్పుడైనా గోడల మీద చూశామా? స్నేహ చక్రవర్తి 'మ్యూరల్స్' (కుడ్య చిత్రాలు– గోడ బొమ్మలు) చూస్తే వీరే కనపడతారు. 'దేశంలో ఎవరూ గమనించని జీవన పోరాట యోధులు వీరంతా. వీళ్లను బొమ్మల్లో చూపడమే నా లక్ష్యం' అంటుంది స్నేహ చక్రవర్తి. గత సంవత్సరం ఆమె 'ట్రావెల్ అండ్ పెయింట్ ఇండియా' పేరుతో భారత దేశ యాత్ర చేసింది. కూర్గ్‌తో మొదలెట్టి హిమాచల్ ప్రదేశ్ వరకూ అనేక రాష్ట్రాల్లో తిరుగుతూ గోడల మీద భారీ చిత్రాలు గీసింది. వాటిలో ప్రధాన అంశం సామాన్యులు, సామాన్య జీవనం... దానిలోని సౌందర్యం. 'దేశమంటే వీళ్లే' అంటుంది స్నేహ.

సొంత ఊరు ఢిల్లీ


ఢిల్లీలో పుట్టి పెరిగిన స్నేహ అక్కడ చదువు పూర్తి చేసింది. ఆమె తండ్రి ఇంజినీర్, తల్లి గృహిణి. 'నాకు ఏడేళ్ల వయసున్నప్పుడు చేతుల మీద మెహందీ వేసే ఒక మహిళ వచ్చింది. ఆమె వేసిన డిజైన్లు నన్ను ఆకర్షించాయి. ఆమె మా పక్కింటికి వెళితే అక్కడకు కూడా వెళ్లి ఆమె మెహందీ వేయడం చూశాను. మరుసటి రోజే అమ్మను అడిగి మెహందీ తెచ్చి ట్రై చేశాను. నాకు మెహందీ వేయడం వచ్చేసింది. ఎనిమిదేళ్లకు మా ఏరియాలో గిరాకీ ఉన్న మెహందీ ఆర్టిస్టును అయ్యాను. అయితే కళ అన్నం పెట్టదు అనే భావనతో ఏదైనా పని చేయమని నన్ను మా తల్లిదండ్రులు కోరారు. వారి కోసమని ఒక ఎయిర్‌లైన్స్ సంస్థలో ఇంటీరియర్ డిజైనర్‌గా చేశారు. కాని ఇలా ఒకరి కింద పని చేయడం నాకు నచ్చలేదు. నా మనసు అక్కడ లేదు. నేను రంగుల కోసం పుట్టాను. రంగుల్లో మునుగుతాను. నా బొమ్మలు అందరూ చూడాలి. అంటే నేను మ్యూరలిస్ట్‌గా, స్ట్రీట్ ఆర్టిస్ట్‌గా పేరు గడించాలి. ఆ విషయం ఇంట్లో చెప్పి 2018 నుంచి మ్యూరలిస్ట్‌గా మారాను' అని తెలిపింది స్నేహ చక్రవర్తి.

జటిలమైన చిత్రకళ

కాన్వాస్ మీద బొమ్మ గీయడం వేరు... ఒక పెద్ద గోడను కాన్వాస్‌గా చేసుకోవడం వేరు. కాగితం మీద వేసుకున్న బొమ్మను పదింతలు ఇరవై యింతలు పెంచి గోడ మీద గీస్తారు. దొంతీలు కట్టుకుని గోడ మీద బొమ్మ వేస్తే మళ్లీ కిందకు దిగి దూరం నుంచి చూసుకుంటూ బొమ్మను అంచనా కడుతూ గీయాలి. సాధారణంగా మగవారు ఈ ఆర్ట్‌లో ప్రావీణ్యం సంపాదిస్తారు. మ్యూరలిస్ట్‌లుగా ఉన్న మహిళలు తక్కువ. వారిలో స్నేహ చక్రవర్తి పేరు పొందింది. పూణె, ముంబై స్లమ్స్‌లో ఆమె గీసిన బొమ్మలు ఆ మురికివాడలకు జీవం, ప్రాణం పోశాయి. 'అందమైన బొమ్మ ఉన్న గోడ దగ్గర ఎవరూ చెత్త వేయడానికి ఇష్టపడరు. ఉమ్మివేయరు' అని చెప్పింది స్నేహ.

స్త్రీలు- సందేశాలు

'నా మ్యూరల్స్‌తో స్త్రీల సాధికారతను చూపిస్తుంటాను. స్వేచ్ఛాభావనను చూపుతుంటాను. సరైన సందేశాలు కూడా ఇస్తుంటాను. ఒకసారి ఒక పెద్ద స్త్రీ బొమ్మ గీచి ఫర్ సేల్ ఫర్ సేల్ అని చాలాసార్లు ఆ స్త్రీ బొమ్మ చుట్టూ రాశాను. పోర్నోగ్రఫీ వల్ల స్త్రీ దేహం అమ్మకానికి సులువుగా దొరుకుతుందన్న భావన పురుషులలో ఉంటుంది. అలాంటి భావజాలం ఎంత దుర్మార్గమైనదో తెలిసొచ్చేలా ఆ బొమ్మ గీశాను. దానికి మంచి స్పందన వచ్చింది. గోడలు లేని ప్రపంచం లేదు. అందుకే నేను ప్రపంచమంతా తిరిగి బొమ్మలు వేస్తాను. నా బొమ్మ ప్రతి దేశం గోడ మీద మన ప్రజలను, సంస్కృతిని చూపాలన్నదే నా కోరిక' అని తెలిపింది స్నేహ.



అక్షత కృష్ణమూర్తి

నాసాలో మన అక్షత!

అమెరికాలోని నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)లో ఉద్యోగం... ఈ కల చాలా మందికే ఉండి ఉంటుంది. ఈ కలను సాకారం చేసుకున్న తొలి భారతీయ యువతి అక్షత కృష్ణమూర్తి. నాసా అనగానే మనకు అంతరిక్షంలోకి వెళ్లి గ్రహాలను అధ్యయనం చేసిన రాకేశ్ శర్మ గుర్తు వస్తారు. అలాగే కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ కూడా గుర్తుకు వస్తారు. కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ ఇద్దరూ భారతీయ సంతతికి చెందిన వారే కానీ భారత పౌరసత్వం ఉన్న వాళ్లు కాదు. అమెరికా పౌరసత్వమే వారి అంతరిక్ష పథాన్ని సుగమం చేసింది. ఇక అక్షత విషయానికి వస్తే...

■ ఆకాశానికి ఆవల

బెంగళూరుకు చెందిన అక్షతా కృష్ణమూర్తికి చిన్నప్పటి నుంచి ఆకాశానికి ఆవల ఏముంటుంది అనే ఆలోచనే. ఆమె బాల్యం ఆకాశంలో నక్షత్రాలను చూడడంతో, చుక్కల్లో చందమామ వెలుగుతో సంతృప్తి చెందలేదు. అంతరిక్షం అంటే మనకు కనిపించేది మాత్రమే కాదు, ఇంకా ఏదో ఉంది, అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. బాల్యంలో మొదలైన ఆసక్తిని పెద్దయ్యేవరకు కొనసాగించింది. తన పయనాన్ని అంతరిక్షం వైపుగా సాగాలని కోరుకుంది. అందుకోసం తీవ్రంగా శ్రమించింది, నేడు నాసా లో ఏరో స్పేస్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించింది. ఆ వివరాలను తెలియచేస్తూ ''ఇది కేవలం అదృష్టం అని కానీ, కాకతాళీయంగా జరిగిపోయిందని చెప్పను. పూర్తిగా పదిహేనేళ్ల కఠోర శ్రమతోనే, అంతకు మించిన ఓర్పుతోనే సాధ్యమైంది'' అంటుంది అక్షత. అలాగే అంతరిక్షంలో కెరీర్‌ని వెతుక్కోవాలంటే పాటించాల్సిన కొన్ని సూత్రాలను కూడా పంచుకుంది.

■ నక్షత్రశాల నుంచి అంతరిక్షం వరకు...

''నాసాలోని జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీలో స్పేస్ మిషన్‌లకు 'ప్రిన్సిపల్ నావిగేటర్ అండ్ స్పేస్ సిస్టమ్స్ ఇంజనీర్'గా విధులు నిర్వర్తిస్తున్నాను. నాసా- ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన సింథటిక్ ఆపెర్చర్ రాడార్ మిషన్‌లో ఫేజ్ లీడ్‌గానూ, మార్స్ 2020 మిషన్‌లో రోబోటిక్స్ సిస్టమ్స్ ఇంజనీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాను. నేను చదివింది స్టేట్ బోర్డ్ సిలబస్‌లోనే. మాది సంపన్న కుటుంబం కూడా కాదు. అయితే చిన్నప్పుడు నా వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లో ప్లానిటేరియం విజిట్స్, బెంగుళూరులో ఎయిర్‌షోస్ ఎక్కువగా ఉండేవి. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న నేనడిగిన ప్రతిసారీ తీసుకెళ్లేవారు. హబుల్ టెలిస్కోప్ గురించి తెలుసుకోవడం నా జీవితంలో గొప్ప మలుపు. బహుశా 2000 సంవత్సరంలో అనుకుంటాను. నాకప్పుడు పదేళ్లు. వ్యోమగాములు అంతరిక్షంలో నడవడం గురించి తెలిసి చాలా ఆనందం కలిగింది. అంతరిక్షం నుంచి భూమిని చూడాలనే కోరిక కూడా. కెరీర్ గురించిన ఆలోచనలకు స్పష్టమైన రూపం వచ్చింది కూడా అప్పుడే. అంతరిక్షంలోకి వెళ్లే మార్గాల గురించి అధ్యయనం చేయగా చేయగా వ్యోమగాముల్లో ఎక్కువమంది ఎమ్ఐటీలోనే చదివారని తెలిసింది. నేను అదే సంస్థలో చదవాలని నిర్ణయించుకున్నాను. దాంతో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. బెంగళూరులోని ఆర్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ 2010 బ్యాచ్‌లో నేను మాత్రమే అమ్మాయిని. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిలో ఏరోస్పేస్‌లో మాస్టర్స్ చేశాను. పీహెచ్‌డీకి ఎమ్ఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి స్కాలర్‌షిప్‌తో సీటు వచ్చింది. అయితే యూఎస్‌లో అంతరిక్షంలో ఉద్యోగం రావాలంటే ఆ దేశ పౌరసత్వం ఉండాలి కనీసం గ్రీన్‌కార్డ్ అయినా ఉండాలి. సెమినార్‌లలో నేను సమర్పించిన పేపర్‌లకు ప్రశంసలు వచ్చినప్పటికీ ఉద్యోగం వచ్చేది కాదు. అయినా నా పరిశోధనలను మాత్రం ఆపలేదు. ప్రొఫెసర్‌లకు వారితో కలిసి పని చేసే అవకాశం ఇవ్వమని వినతులు పోస్ట్ చేయడం కూడా ఆపలేదు. నా అప్లికేషన్ ఎప్పుడూ వెయిల్ లిస్టులోనే ఉండేది. వీసా సమయం పూర్తి కావస్తున్న సమయంలో ఒక పేపర్ ప్రెజెంటేషన్ సారా సీగర్ అనే ఆస్ట్రో ఫిజిసిస్ట్ దృష్టిని ఆకర్షించింది. అలా ఒక ఏడాదికి ఇంటర్న్‌షిప్‌కి అవకాశం వచ్చింది. ఆ ఏడాది పూర్తవుతున్న సమయంలో మరో పీహెచ్‌డీకి అప్లయ్ చేశాను. నాసా - ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా పని చేశాను. మొత్తం మీద మూడవ ప్రయత్నంలో నాసాలో ఫుల్‌టైమ్ ఉద్యోగినయ్యాను.

■ మేధ ఉంది- పాదు లేదు

మనదేశంలో అంతరిక్షంలో పరిశోధన చేయగలిగిన మేధ ఉంది. మొక్క ఎదగాలంటే అందుకు అనువైన పాదు ఉండాలి. అలాంటి పాదును తల్లిదండ్రులు బాల్యంలోనే వేయాలి. అలాంటి ప్రోత్సాహం మన దగ్గర ఉండాల్సినంతగా లేదనే చెప్పాలి. అందుకే లక్ష్యాన్ని సాధించడంలో నాకు ఎదురైన సవాళ్లతోపాటు అవకాశాలను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాను. నేను సూచించేదేమిటంటే... స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టుల్లో పాల్గొనాలి. అంతరిక్షంలో కూడా ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రానమీ, టెక్నాలజీ, ఇంజినీరింగ్ వంటి చాలా విభాగాలుంటాయి. మన ఆసక్తి ఎందులో అనేది తెలుసుకోవాలి. అంతరిక్షరంగంలో స్థిరపడాలంటే బాచిలర్స్ సరిపోదు. బాచిలర్స్‌లో సైన్స్, ఇంజనీరింగ్‌తో పాటు పీహెచ్‌డీ తప్పనిసరి. అలాగే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ వంటి నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాలి. అంతరిక్షానికి సంబంధించి వీలైనంత ఎక్కువ సదస్సులు, సమావేశాల్లో పాల్గొనాలి. నిపుణులను సంప్రదిస్తూ మన సందేహాలను నివృత్తి చేసుకుంటూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ అంతరిక్షయానాన్ని సుగమం చేసే మార్గాలు'' అంటోంది అక్షత.

సూపర్ మామ్స్!

తల్లిగా మారిన ప్రతి స్త్రీ పిల్లల పనిని ఇష్టంగానూ
అదే సమయంలో కష్టంగానూ భావిస్తుంటుంది.
తన బాగు గురించి తాను చూసుకోవడం మరచిపోతుంటుంది.
తల్లిగా మారిన తర్వాత కూడా తమ జీవితాన్ని అర్థవంతంగా
ఎలా మార్చుకోవాలో క్రీడాస్ఫూర్తితో నిరూపిస్తున్నారు కొందరు తల్లులు.
ఇటీవల అమెరికా వాసి కైట్లిన్ డోనర్ స్ట్రోలర్‌తో రన్నర్ మామ్ రికార్డ్‌ను బద్దలు కొట్టింది.
ముంబై వాసి అయిన వినీత్ సింగ్ గర్భవతిగా ఉన్నప్పటి నుంచే రన్నింగ్‌తో
తన ప్రపంచాన్ని ఎంత ఆరోగ్యంగా మార్చుకుందో రుజువు చేస్తోంది.

అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్న ఇద్దరు పిల్లల తల్లి అయిన 34 ఏళ్ల కైట్లిన్ డోనర్ ఇటీవల చేసిన ప్రయత్నం అందరినీ ఆకర్షించింది. తన 20 నెలల కొడుకును స్ట్రోలర్ (లాగుడు బండి)లో కూర్చోబెట్టుకొని, ఆ స్ట్రోలర్‌ను నెడుతూ మైలు దూరాన్ని కేవలం ఐదు నిమిషాల 11 సెకన్లలో పూర్తి చేసి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుండి అధికారిక గుర్తింపు పొందింది. తల్లుల్లో ఉన్న శక్తిని ఎలా పెంచుకోవచ్చో తన సాధన ద్వారా నిరూపిస్తోంది.



కైట్లిన్ డోనర్

సాధనమున సమకూరు..

రెండవ గర్భధారణ సమయంలో ప్రసవానంతరం తన లక్ష్యాన్ని ప్రపంచానికి చాటాలనుకుంది. రన్నింగ్ గోల్‌ని ఏర్పరుచుకునే క్రమంలో ఆమెకు రన్నర్ స్నేహితులు ఉత్సాహం కలిగించారు. ఇది ఆమెను మరింత ముందుకు వెళ్లేలా చేసింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రాసెస్‌లో భాగంగా సెప్టెంబర్ 2022లో తన బిడ్డకు కేవలం నెల వయసు ఉన్నప్పుడే క్లైటిన్ దరఖాస్తు చేసింది. కానీ, అది తిరస్కరణకు గురైంది. కిందటేడాది మళ్లీ దరఖాస్తు చేసింది.

ఒలింపిక్ మారథాన్ ట్రయల్స్‌లోనూ వెనకబాటుకు లోనైంది. అయినా నిరుత్సాహపడకుండా మరింతగా కఠినమైన శిక్షణా విధానాన్ని పాటించింది. లెగ్ టర్నోవర్‌ని పెంచడానికి కొన్ని స్పీడ్ వర్కవుట్‌లను నిర్వహించింది. సాధనలో 1600 మీటర్ల వర్కౌట్‌ను స్ట్రోలర్‌తో సాధన చేసింది. ఈ ఎక్స్‌పీరియెన్స్ ఆమెలో మరింత ఉత్సాహాన్ని నింపింది. కిందటి నెలలో బాబ్ గేర్ రివల్యూషన్ 3.0 స్ట్రోలర్‌తో ట్రాక్‌లోకి ప్రవేశించింది. దీనికి ఆమె కుటుంబం, సన్నిహితులు అందించిన మద్దతు తనకీ విజయం సాధించడానికి తోడ్పడింది అని తెలియజేస్తుంది.

కఠినమైన లక్ష్యాలనే ఎంచుకోవాలి..

ట్రాక్‌పై పరిగెత్తుతున్నప్పుడు ప్రతి అడుగుతోనూ ఆమె ఈ లక్ష్యాన్ని అధిగమించడంతో చుట్టూ ఉన్న వారి చప్పట్ల హోరు కన్నా తన లక్ష్యానికి ఆమె ఇచ్చిన ప్రాముఖ్యానికి అందరూ కొనియాడారు. మైలు దూరాన్ని 5 నిమిషాల 11.13 సెకన్ల సమయంలో ముగించి, మునుపటి 5 నిమిషాల 13 సెకన్ల ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి విజేతగా నిలిచింది. ఆమె ట్రాక్‌పై పరిగెత్తుతున్నప్పుడు అందరి దృష్టి ఆమెపై అలాగే బాబ్ గేర్ రివల్యూషన్ 3.0 స్ట్రోలర్‌లోని బిడ్డపై కూడా ఉంది. 'సులువైన వాటిని కాదు భయానకమైన లక్ష్యాలనే ఎంచుకోండి. ఎందుకు సాధించలేం? అనే ప్రశ్న ఎవరికి వారు వేసుకోండి. ఆశించిన ఫలితం వస్తుందో రాదో చెప్పలేం. కానీ, ప్రయత్నించినందుకు ఏ మాత్రం చింతించరు' అని బోసినవ్వుల కొడుకును ఎత్తుకుంటూ చెబుతుంది డోనర్.

మన వినీత్ సింగ్

ముంబై వాసి వినీత్ సింగ్‌కి తల్లిగానే కాదు విజయవంతమైన ఎంట్రప్రెన్యూర్‌గా... ఫిట్‌నెస్ ఔత్సాహికురాలుగా కూడా ఎంతో పేరుంది. ఆరు నెలల గర్భవతిగా ఉండీ వైద్యుల అనుమతితో ఈ ఏడాది జనవరిలో జరిగిన 30 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొంది. 'నా ప్రపంచం ఎంత ఆరోగ్యంగా ఉందో ఈ మారథాన్ నాకు పరిచయం చేసింది' అని ఈ సందర్భంగా తెలియజేసింది. వినీత్ సింగ్ కుటుంబం క్రీడలు, ఫిట్ నెస్ అంటే చాలా ఇష్టపడుతుంది. అప్పటికే వినీత్‌కి అల్ట్రా మారథాన్, హాఫ్ మారథాన్ వంటి వాటిల్లో పాల్గొన్న అనుభవం ఉంది. 3.8 కిలోమీటర్ల ఈత, 180 కిలోమీటర్ల సైకిల్ రైడ్, 42 కిలోమీటర్ల మారథాన్‌లలోనూ పాల్గొంది. మోస్ట్ పవర్‌ఫుల్ ఉమన్‌గా అవార్డులూ గెలుచుకుంది. గర్భవతులుగా ఉన్నప్పుడు, ప్రసవానంతరమూ తల్లులు తమ ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ చూపాలో, తమ ప్రపంచాన్ని ఎంత ఉత్సాహకరంగా మార్చుకోవాలో ఈ తల్లులు తమ జీవనశైలితో నిరూపిస్తున్నారు.



వినీత్ సింగ్



వినీత్ సింగ్

యూత్ పల్స్

ఫైర్

ఫ్యాషన్ కాదు పాషన్



యూత్ అంటేనే ఫైర్. ఇప్పుడు ఆ ఫైర్ 'ఫైర్' ట్రెండ్‌ను ఇష్టపడుతోంది.
'ఫైర్'ట్రెండ్ అనేది ఫ్యాషన్ ట్రెండ్ కాదు.... F.I.R.E అంటే ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ. జెన్ జెడ్‌లో 48 శాతం 'ఫైర్' ప్లాన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎర్లీ రిటైర్‌మెంట్ తరువాత తమకు ఇష్టమైన పనుల జాబితాను సిద్ధం చేసుకుంటున్నారు.

ఒక సర్వే ప్రకారం 2024లో జెన్ జెడ్‌లో 47 శాతం మంది ముందస్తు పదవీ విరమణకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

'ఎందుకు ఇలా? అనే ప్రశ్నకు ఏకైక సమాధానం వినిపించకపోవచ్చు. అయితే అన్ని కారణాల సారం ఒక్కటే...'నాకు ఇష్టమైన పని చేయాలి'

ముంబైకి చెందిన తేజస్వి, పెయింటింగ్‌పై తనకు ఉన్న పాషన్‌నే కెరీర్‌గా చేసుకోవాలనుకుంది. అయితే కుటుంబ ఆర్థికపరిస్థితుల వల్ల ఉద్యోగం చేయడం అనివార్యం అయింది. F.I.R.E (ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ)ని దృష్టిలో పెట్టుకొని ఆమె దుబారా ఖర్చులు తగ్గించుకొని పొదుపునకు ప్రాధాన్యత ఇస్తోంది.

'ఉద్యోగం మీద ఆధారపడకుండా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాఫీగా జీవితం గడపడానికి అవసరమైన పొదుపు, పెట్టుబడి వ్యూహాలు ఫైర్‌లో ఉన్నాయి' అంటారు నిపుణులు.

'ఫైర్' మూమెంట్‌పై ఆసక్తి ఉన్నట్లే అపోహలు ఉన్నాయి.

'ఫైర్‌పై ఎన్నో అపోహలు ఉన్నాయి. ఫైర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం అంటే ఎక్స్‌ట్రీమ్ సేవింగ్స్ కోసం అసాధారణ జీవితాన్ని గడపడం. ప్రాపంచిక సుఖాలను త్యాగం చేయడం అనేది అందులో ఒకటి. కాని ఇది నిజం కాదు. నా దృష్టిలో ఫైర్ స్ట్రాటజీ అంటే ఇంటెలిజెంట్ ఇన్వెస్ట్‌మెంట్' అంటుంది బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నవ్య.

'ఫైర్ స్ట్రాటజీ అంటే పనికి పూర్తిగా దూరం కావడం కాదు. ఇష్టమైన పనికి దగ్గర కావడం' అంటుంది దిల్లీలో ఒక ఫిన్‌టెక్ కంపెనీలో పని చేస్తున్న అనిక.

డబ్బు బాగా ఖర్చు చేసే అనిక 'ఫైర్ స్ట్రాటజీ'ని దృష్టిలో పెట్టుకొని పొదుపు దారి పట్టింది. 'పీనాసిగా మారిపోయావేంటీ'లాంటి స్నేహితుల వెక్కిరింపులను ఆమె పట్టించుకోవడం లేదు.

పుస్తకాలు రాయడం నుంచి స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వరకు అనిక ఎర్లీ రిటైర్‌మెంట్ తరువాత జీవితంలో ఎన్నో ఉన్నాయి.


విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం అందరికీ ఒకే రకంగా సరిపోయే యూనివర్శల్ 'ఫైర్' ఫార్ములా లేదు. వ్యక్తిగత ఆసక్తులు, ఆర్థిక లక్ష్యాలు, జీవిత పరిస్థితుల దృష్ట్యా ఒకరితో పోల్చితే మరొకరికి భిన్నమైన ఫార్ములా ఉండవచ్చు.

అందుకే 'ఫైర్'ను కస్టమైజబుల్ బ్లూ ప్రింట్ అంటారు.

యువ ఉద్యోగులలో కొద్దిమంది 'ఫైర్'లో భాగంగా తమ ఆదాయంలో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది ఆశ్చర్యకరంగా అనిపించవచ్చు. అయితే జీవనశైలిలో కొద్దిపాటి మార్పులు, సరైన బడ్జెట్ సర్దుబాట్లతో ఇదేమీ అసాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

యువతను ఉద్దేశించి ఏదో ఒక సందర్భంలో పెద్దల నోటి నుంచి వినిపించే మాట... మీకు డబ్బు విలువ తెలియదు. అయితే గత జనరేషతో పోల్చితే జెన్ జెడ్ యువతరం డబ్బును నీళ్లలా ఖర్చు చేయడం కంటే నిర్మాణాత్మకమైన పొదుపునకు ప్రాధాన్యత ఇస్తోంది. స్టాక్స్ అండ్ మ్యూచువల్ ఫండ్స్‌పై దృష్టి సారిస్తోంది. ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ 'కామ్స్' రిపోర్ట్ ప్రకారం జెన్–జెడ్‌లో 54 శాతం మంది ఫస్ట్–టైమ్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్‌లు.

'రిస్క్–అవేర్‌నెస్, ఆర్థిక క్రమశిక్షణతో స్మార్ట్ ఇన్వెస్టింగ్ రూల్స్‌ను జెన్ జెడ్ తిరగ రాస్తుంది. స్టాక్‌గ్రోలో వందలాది మంది యంగ్ ఇన్వెస్టర్‌లు ఇన్వెస్టింగ్, ట్రేడింగ్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకుంటున్నారు. సరియైన పద్ధతిలో ఎలా పెట్టుబడి పెట్టాలనే విషయంలో వారికి మంచి అవగాహన ఉంది' అంటున్నాడు స్టాక్‌మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఫిన్‌టెక్ కంపెనీ 'స్టాక్‌గ్రో' కో–ఫౌండర్ అజయ్ లఖోటియ.



ఎప్పుడు, ఎలా, ఎందుకు

ఫైర్' మూమెంట్ పాపులర్ కావడం వెనుక విక్కీ రాబిన్, జో డొమింగెజ్ రాసిన 'యువర్ మనీ ఆర్ యువర్ లైఫ్' లాంటి పుస్తకాలు ఉన్నాయి. 'డబ్బు భౌతికమైన సాధనమే కాదు. ఆధ్యాత్మికమైనది కూడా' అంటుంది ఈ పుస్తకం. మనకు అవసరమైన దాన్ని పొందానికి మాత్రమే కాదు బాధ్యతాయుతంగా జీవించడానికి, సేవాపథంలో అడుగులు వేయడానికి కూడా డబ్బు ఉపయోగపడుతుంది. మీ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది. ఎక్కడికి వెళుతుంది (ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ). మీరు మీ డబ్బును ఎక్కడ, ఎప్పుడు ఖర్చు చేస్తున్నారు. ఎక్కడ, ఎప్పుడు డబ్బు సంపాదిస్తారు (ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్). ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌కు సంబంధించిన విషయాలపై ఈ పుస్తకం అవగాహన కలిగిస్తుంది.



'టాప్స్'లో అనాహత్, అభయ్ సింగ్‌లకు చోటు

భారత స్క్వాష్ యువ క్రీడాకారులు అనాహత్ సింగ్, అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్ కుమార్‌లకు కేంద్ర క్రీడా శాఖ చేయూత ఇవ్వనుంది. ఈ ముగ్గురికి టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) డెవలప్‌మెంట్ గ్రూప్‌లో చోటు కల్పించింది. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్‌లో స్క్వాష్‌ను తొలి సారి మెడల్ ఈవెంట్‌గా ప్రవేశ పెట్టనున్నారు. అనాహత్, అభయ్ గత ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు, ఒక స్వర్ణం నెగ్గారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జోడీ పరాజయం

ఇటాలియన్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. మంగళవారం రోమ్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 2-6, 4-6తో సిమోన్ బొలెలీ-వావాసొరి (ఇటలీ) జంట చేతిలో ఓడిపోయింది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్‌లు ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయారు. బోపన్న-ఎబ్డెన్‌లకు 29,860 యూరోల (రూ. 26 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మనిక ర్యాంక్ 24

ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్‌లో టాప్-25లో నిలిచిన భారతీయ క్రీడాకారిణిగా ఘనత



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళా స్టార్ క్రీడాకారిణి మనిక బత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్ మహిళల సింగిల్స్ విభాగంలో మనిక 24వ ర్యాంక్‌లో నిలిచింది. గతవారం సౌదీ స్మాష్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన మనిక ఏకంగా 14 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్ నుంచి 24వ ర్యాంక్‌కు చేరుకుంది. తద్వారా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-25లో నిలిచిన తొలి భారతీయ టీటీ క్రీడాకారిణిగా మనిక గుర్తింపు పొందింది. గతవారం 38వ ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మూడు స్థానాలు పడిపోయి 41వ ర్యాంక్‌కు చేరుకోగా... యశస్విని రెండు స్థానాలు పడిపోయి 99వ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు ఆచంట శరత్ కమల్ 40వ ర్యాంక్‌లో, మానవ్ ఠక్కర్ 62వ ర్యాంక్‌లో, హర్మీత్ దేశాయ్ 63వ ర్యాంక్‌లో, సత్యన్ 68వ ర్యాంక్‌లో ఉన్నారు.

తొమ్మిదోసారి టి20 ప్రపంచకప్ బరిలో షకీబ్



ఢాకా: బంగ్లాదేశ్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ వరుసగా తొమ్మిదోసారి టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఆడనున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును మంగళవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన బంగ్లాదేశ్ జట్టుకు నజ్ముల్ హొస్సేన్ షాంతోను కెప్టెన్‌గా నియమించారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, షకీబ్ మాత్రమే 2007 నుంచి 2022 వరకు జరిగిన ఎనిమిది టి20 ప్రపంచకప్ టోర్నీల్లో ఆడారు. ఇప్పటి వరకు ప్రపంచకప్‌లలో 36 మ్యాచ్‌లు ఆడిన షకీబ్ 742 పరుగులు చేయడంతోపాటు 47 వికెట్లు పడగొట్టాడు.

బంగ్లాదేశ్ జట్టు: నజ్ముల్ హొస్సేన్ (కెప్టెన్), తస్కిన్ అహ్మద్ (వైస్ కెప్టెన్), లిటన్ దాస్, సౌమ్య సర్కార్, తన్‌జిద్ హసన్, షకీబ్, తౌహిద్, మహ్ముదుల్లా, జాకీర్ అలీ, తన్వీర్ ఇస్లామ్, మెహదీ హసన్, రిషాద్, ముస్తఫిజుర్, షోరిఫుల్, తన్‌జీమ్ హసన్.

ఢిల్లీ ఆశలు పదిలం!


స్టబ్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో విజయం

- 19 పరుగులతో ఓడిన లక్నో
- రాణించిన స్టబ్స్, పొరేల్, ఇషాంత్
- 'ప్లే ఆఫ్స్'కు రాజస్తాన్ రాయల్స్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై సత్తా చాటిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ లీగ్ దశను విజయంతో ముగించింది. ఈ గెలుపుతో సాంకేతికంగా 'ప్లే ఆఫ్స్' అవకాశాలు ఇంకా మిగిలే ఉన్నా... ఆ జట్టు ముందంజ వేయడం చాలా రకమైన ఇతర సమీకరణాలపై ఆధారపడి ఉంది. మరోవైపు గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో మెరుగైన స్థితికి చేరే అవకాశం ఉన్నా కూడా లక్నో సూపర్ జెయింట్స్ దానిని చేజార్చుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 19 పరుగుల తేడాతో లక్నోపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్లు నష్టానికి 208 పరుగులు చేసింది. అభిషేక్ పొరేల్ (33 బంతుల్లో 58; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 57 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... షై హోప్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రిషభ్ పంత్ (23 బంతుల్లో 33; 5 ఫోర్లు) రాణించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేసి ఓడిపోయింది. నికోలస్ పూరన్ (27 బంతుల్లో 61; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 58 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా మిగతా వారంతా పూర్తిగా విఫలమయ్యారు. ఢిల్లీ-లక్నో మ్యాచ్ ఫలితంతో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే రాజస్తాన్ రాయల్స్ 16 పాయింట్లతో 'ప్లే ఆఫ్స్'కు బెర్త్‌ను ఖరారు చేసుకున్న రెండో జట్టుగా నిలిచింది.

కీలక భాగస్వామ్యం...

తొలి ఓవర్లోనే జేక్ ఫ్రేజర్ (0)ను అవుట్ చేసిన లక్నో ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. పొరేల్, హోప్ కలిసి దూకుడుగా ఆడారు. అర్షద్ ఓవర్లో పొరేల్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టగా, యుధ్‌వీర్ ఓవర్లో హోప్ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లేలో ఢిల్లీ 73 పరుగులు చేసింది. 21 బంతుల్లోనే పొరేల్ అర్ధసెంచరీ పూర్తి కాగా, ఈ జోడీ రెండో వికెట్‌కు 92 పరుగులు (49 బంతుల్లో) జోడించింది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా, పంత్ కొన్ని కీలక పరుగులు సాధించాడు. అయితే స్టబ్స్ ధాటైన బ్యాటింగ్ ఢిల్లీ స్కోరును 200 దాటించింది. అర్షద్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను, నవీన్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాది 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు.

పూరన్ మినహా...

భారీ ఛేదనలో లక్నో పూర్తిగా తడబడింది. పూరన్ మెరుపు బ్యాటింగ్ తప్ప ఇన్నింగ్స్‌లో ప్రధాన బ్యాటర్ ఒక్కరు కూడా కనీస ప్రదర్శన ఇవ్వలేకపోయారు. పవర్‌ప్లే ముగిసేలోపే కేఎల్ రాహుల్ (5), డికాక్ (12), స్టొయినిస్ (5), హుడా (0) వెనుదిరగడం జట్టును బాగా దెబ్బ తీసింది. మరోవైపు అక్షర్ ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన పూరన్... ఇతర బౌలర్లపై కూడా చెలరేగి 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే లక్నోను విజయం దిశగా తీసుకెళ్లేందుకు ఇది సరిపోలేదు. విజయానికి 9 ఓవర్లలో 108 పరుగులు చేయాల్సిన స్థితిలో పూరన్ అవుట్ కావడంతో జట్టు ఆశలు కోల్పోయింది. చివర్లో అర్షద్ పోరాడినా అప్పటికే ఆలస్యమైపోయింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: జేక్ ఫ్రేజర్ (సి) నవీన్ (బి) అర్షద్ 0; పొరేల్ (సి) పూరన్ (బి) నవీన్ 58; హోప్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 38; పంత్ (సి) హుడా (బి) నవీన్ 33; స్టబ్స్ (నాటౌట్) 57; అక్షర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 208. వికెట్ల పతనం: 1-2, 2-94, 3-111, 4-158. బౌలింగ్: అర్షద్ 3-0-45-1, మొహసిన్ 4-0-29-0, యుధ్‌వీర్ 2-0-28-0, నవీన్ 4-0-51-2, బిష్ణోయ్ 4-0-26-1, కృనాల్ 2-0-20-0, హుడా 1-0-9-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 12; రాహుల్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 5; స్టొయినిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 5; హుడా (ఎల్బీ) (బి) ఇషాంత్ 0; పూరన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 61; బదోని (సి) గుల్బదిన్ (బి) స్టబ్స్ 6; కృనాల్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 18; అర్షద్ (నాటౌట్) 58; యుధ్‌వీర్ (సి) హోప్ (బి) ఖలీల్ 14; బిష్ణోయ్ (రనౌట్) 2; నవీన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 189. వికెట్ల పతనం: 1-7, 2-24, 3-24, 4-44, 5-71, 6-101, 7-134, 8-167, 9-183. బౌలింగ్: ఇషాంత్ 4-0-34-3, ఖలీల్ 2-0-22-1, అక్షర్ 1-0-20-1, ముకేశ్ 4-0-33-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-4-1, గుల్బదిన్ 1-0-12-0, సలామ్ 3-0-30-0.


'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాంత్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X పంజాబ్
వేదిక: గువాహటి
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రెండో సెమీస్‌కు రిజర్వ్ డే లేదు!

దుబాయ్: టి20 ప్రపంచకప్‌లో ఒకవేళ భారత జట్టు సెమీఫైనల్ చేరితే ఆ మ్యాచ్ 'రిజర్వ్ డే' లేకుండానే జరగనుంది. తొలి సెమీఫైనల్, ఫైనల్‌కు మాత్రమే 'రిజర్వ్ డే' ఉంచుతున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. తొలి సెమీఫైనల్ తరూబా (ట్రినిడాడ్)లో జూన్ 26న స్థానిక కాలమానం ప్రకారం రాత్రి గం. 8:30కు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌కు అంతరాయం కలిగితే తర్వాతి రోజు రిజర్వ్ డే మ్యాచ్ కొనసాగుతుంది. కానీ రెండో సెమీఫైనల్ పరిస్థితి అలా లేదు. భారత్ సెమీస్ చేరవచ్చని భావిస్తున్న రెండో సెమీస్ ప్రావిడెన్స్ (గయానా)లో జరుగుతుంది. ఇది జూన్ 27న స్థానిక కాలమానం ఉదయం గం.10:30కి (భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు) ప్రారంభమవుతుంది. భారత్‌లోని టీవీ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకునే ఈ సమయాన్ని ఖరారు చేశారు. డే మ్యాచ్ కాబట్టి ఆ రోజంతా చాలినంత సమయం ఉంటుంది. దానిని మరుసటి రోజుకు కొనసాగించడంలో అర్థం లేదని ఐసీసీ భావించింది. పైగా జూన్ 29న ఫైనల్ కాబట్టి రెండో సెమీస్‌లో గెలిచిన జట్టు వరుసగా మూడో రోజులు ఆడాల్సిన స్థితి వస్తుంది. ఇది సరైంది కాదని, ఫైనల్‌కు ముందు ఒక రోజు ప్రయాణం ప్లస్ విరామం ఉండాలి కాబట్టి అదే రోజు ఫలితాన్ని తేల్చాలని నిర్ణయించింది. అయితే 'రిజర్వ్'కు బదులుగా రెండో సెమీస్‌కు 250 నిమిషాల అదనపు సమయాన్ని ఇస్తారు. వర్షం లేదా ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ఆట పూర్తిగా జరగకపోతే మరో నాలుగు గంటల పాటు వేచి చూస్తారు. అయితే ఆట జరగకపోతే నిబంధనల ప్రకారం 'సూపర్ ఎయిట్'లో ఎక్కువ పాయింట్లు సాధించిన టీమ్ ఫైనల్ చేరుతుంది.


టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఆటగాళ్లు ధరించే జెర్సీతో కెప్టెన్ రోహిత్, బీసీసీఐ కార్యదర్శి జై షా

కొత్త హెడ్ కోచ్ కావాలి

దరఖాస్తులు కోరిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత పురుషుల సీనియర్ క్రికెట్ జట్టుకు కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసేందుకు బీసీసీఐ ప్రక్రియ మొదలు పెట్టింది. ఈ అత్యున్నత పదవి కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతూ బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తిగలవారు ఈనెల 27వ తేదీలోపు తమ దరఖాస్తులు పంపించాలి. ఎంపికైన కొత్త హెడ్ కోచ్ పదవీకాలం మూడేన్నరేళ్లపాటు (1 జూలై 2024 నుంచి 31 డిసెంబర్ 2027 వరకు) ఉంటుంది. ప్రస్తుత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం గత ఏడాది నవంబర్‌లో వన్డే వరల్డ్‌కప్ అనంతరం ముగిసింది. అయితే టి20 ప్రపంచకప్ నేపథ్యంలో ఈ మెగా ఈవెంట్ ముగిసేవరకు టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా కొనసాగాలని బీసీసీఐ కోరడంతో ద్రవిడ్ అంగీకరించాడు. కొత్త హెడ్ కోచ్ పదవి కోసం ద్రవిడ్ కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సుమీత్-సిక్కి జోడీకి నిరాశ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. సుమీత్-సిక్కి ద్వయం 12-21, 16-21 తో రినోవ్ రివాల్డీ-పితా మెంతారి (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ మైస్నం మెరాబా మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు.

తొలి రౌండ్‌లోనే శివ ఓటమి

అస్తానా: ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో బాక్సర్లు శివ థాపా (63.5 కేజీలు), సంజయ్ (80 కేజీలు)లకు నిరాశ ఎదురైంది. అస్తానాలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ పతక విజేత శివ థాపా 1-4తో అబ్దుఅలీ అల్మాత్ (కజకిస్తాన్) చేతిలో... సంజయ్ 0-5తో తంగ్లాతిహాన్ (చైనా) చేతిలో ఓడిపోయారు. ప్లస్ 92 కేజీల విభాగంలో గౌరవ్ చౌహాన్ సెమీఫైనల్ చేరి కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో గౌరవ్ 3-2తో డేనియల్ సపర్బయ్ (కజకిస్తాన్)పై గెలిచాడు.

సినిమా

మూడు వారాల తర్వాత కూలీగా...


రజనీకాంత్


జస్ట్ చిన్న బ్రేక్... ఆ తర్వాత కూలీగా కూల్‌గా సెట్‌లోకి అడుగుపెట్టడానికి రజనీకాంత్ ప్లాన్ చేసుకున్నారట. 'వేట్టయాన్' సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూట్‌ని పూర్తి చేసిన రజనీకాంత్ ఓ మూడు వారాలు విరామం తీసుకుంటారని సమాచారం. ఆ తర్వాత జూన్ 6 నుంచి తన మరో చిత్రం 'కూలీ' షూటింగ్‌లో పాల్గొంటారట. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం కోసం చెన్నైలో భారీ సెట్ రూపొందించారట. ఆ సెట్‌లోనే కొత్త షెడ్యూల్ ఆరంభించనున్నారని కోలీవుడ్ టాక్. కాగా ఈ చిత్రంలో శ్రుతీహాసన్ నటించనున్నారు. రజనీ కుమార్తె పాత్రలో ఆమె కనిపిస్తారట. ఈ పాత్ర కథకి కీలకంగా ఉంటుందని తెలిసింది. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.


కియారా అద్వానీ

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కియారా

ప్రతిష్ఠాత్మక 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో హీరోయిన్ కియారా అద్వానీ తొలిసారి సందడి చేయనున్నారు. ఈ చిత్రోత్సవాల్లో భాగంగా రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్యానెల్‌లో కియరా ఇండియాకి ప్రాతినిధ్యం వహిస్తారట. మంగళవారం (మే 14) ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకూ జరగనున్నాయి. ఇప్పటివరకు దేశం తరఫున పలుమార్లు ప్రాతినిధ్యం వహించి, మెప్పించారు ఐశ్వర్యా రాయ్. ఆ తర్వాత సోనమ్ కపూర్ కూడా ఇండియా ప్రతినిధిగా మెప్పించారు. ఈ ఏడాది ఇండియాకి ప్రాతినిధ్యం వహించే అవకాశం కియరా అద్వానీని వరించింది. కాన్స్‌లో వేనిటీ ఫెయిర్ హోస్ట్ చేస్తున్న 'రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్ ఉమెన్ ఇన్ సినిమా' కార్యక్రమంలోనూ కియరా పాల్గొంటారు. ప్రపంచ సినిమాకు ప్రోత్సాహకాలు, చిత్రీకరణ, సినిమా నిర్మాణంలో వస్తున్న సాంకేతిక అంశాలు.. వంటి వాటి గురించి నాలుగు ప్యానెల్స్ చర్చలు జరపనున్నాయి. మే 18న లా ప్లేజ్ డెస్ పామ్స్‌లో ఈ చర్చలు జరుగుతాయి. ఆ చర్చల్లోనూ కియారా పాల్గొంటారు. కాగా ఈ ఏడాది చిత్రోత్సవాల్లో ఐశ్వర్యా రాయ్, అదితీ రావ్ హైదరి, శోభితా ధూళిపాళ వంటి తారలు దేశం నుంచి హాజరు కానున్నారు. ఇప్పుడు కియారా అద్వానీ పేరు ఈ జాబితాలో చేరింది. ఈ చిత్రోత్సవాల్లో స్టయిలిష్‌గా కనిపించడానికి, చర్చల్లో తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరచడానికి కియారా చాలా ప్రిపేర్ అయ్యారని సమాచారం.

తెరపైకి సాహస యాత్ర


ఎవరెస్ట్‌ని అధిరోహించిన ఎడ్మండ్, టెన్జింగ్ (ఫైల్ ఫోటో)


టామ్ హిడిల్‌స్టన్

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్‌ని అధిరోహించడం చాలా కష్టం అనే అభిప్రాయాన్ని అబద్ధం చేశారు ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే. న్యూజిల్యాండ్‌కి చెందిన ఎడ్మండ్, నేపాల్‌కి చెందిన టెన్జింగ్ 1953లో ఎవరెస్ట్ చేరుకుని, అత్యంత ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించిన మొదటి వ్యక్తులుగా చరిత్రలో నిలిచిపోయారు. ఈ ఇద్దరూ సాధించిన చరిత్ర నేపథ్యంలో హాలీవుడ్‌లో 'టెన్జింగ్' టైటిల్‌తో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రంలో ఎడ్మండ్ హిల్లరీ పాత్రకు టామ్ హిడిల్‌స్టన్‌ని ఎంపిక చేశారు. యాత్ర నాయకుడు కల్నల్ జాన్ హంట్ పాత్రను విల్లెం డాఫో పోషించనున్నారు. టెన్జింగ్ నార్గే పాత్రకు సంబంధించిన ఎంపిక జరుగుతోంది. షెర్పా (పర్వతారోహకులు) కమ్యూనిటీతో సన్నిహిత సంబంధాలు ఉన్న జెన్నిఫర్ పీడోమ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 2015లో 'షెర్పా' పేరిట జెన్నిఫర్ పీడోమ్ ఓ డాక్యుమెంటరీ తెరకెక్కించారు కూడా. అప్పుడు కొందరు పర్వతారోహకుల అనుభవాలను సేకరించి, 'షెర్పా'ని చిత్రీకరించారు. తాజాగా జెన్నిఫర్ తెరకెక్కించనున్న 'టెన్జింగ్'కి ల్యూక్ డేవిస్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. లిజ్ వాట్స్, ఎమిలే షెర్మాన్, ఇయాన్ కానింగ్ తదితరులు నిర్మించనున్నారు. ''ఒక సాహస యాత్రను తెరపై ఆవిష్కరించడానికి ఆసక్తిగా ఉన్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రం షూటింగ్‌ని వచ్చే ఏడాది ఆరంభించాలనుకుంటున్నారు.

క్లైమాక్స్‌లో సరిపోదా


నాని

నాని హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ- ''సరిపోదా శనివారం'లో సూర్య పాత్రలో మునుపెన్నడూ కనిపించని ఇంటెన్స్ పవర్-ప్యాక్డ్ క్యారెక్టర్‌లో నాని కనిపించనున్నారు. హై బడ్జెట్‌తో యూనిక్ అడ్వంచర్‌గా రూపొందుతున్న ఈ సినిమా క్లైమాక్స్ షూటింగ్‌ను ప్రారంభించాం. ఈ యాక్షన్ ఎపిసోడ్ కోసం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో అద్భుతమైన సెట్‌ను నిర్మించాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న ఈ సినిమా విడుదల కానుంది'' అన్నారు. సాయికుమార్, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

హాలీవుడ్ హిట్ సిరీస్‌లో...


టబు

సీనియర్ నటి టబు సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస బాలీవుడ్ చిత్రాలతో దూసుకెళుతున్నారు. ఇటీవల విడుదలైన 'క్రూ' సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న టబు ప్రస్తుతం హిందీలో మరికొన్ని ప్రాజెక్ట్‌లు కమిట్ అయ్యారు. అలాగే హాలీవుడ్ సూపర్ హిట్ టెలివిజన్ సిరీస్ 'డ్యూన్: ప్రొఫెసి'లో నటించే లక్కీ చాన్స్ అందుకున్నారు. 'డ్యూన్' సిరీస్‌కి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఫాలోయింగ్ ఉంది. తొలి భాగానికి మంచి స్పందన రావడంతో రెండో భాగం 'డ్యూన్: ప్రొఫెసి'ని ప్లాన్ చేశారు మేకర్స్. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్ అనే ఎంతో ప్రాధాన్యమైన పాత్రలో టబు నటించనున్నారు. డయాన్ అడెము-జాన్ క్రియేషన్‌లో ఈ సిరీస్ రూపొందనుంది. పది వేల సంవత్సరాల క్రితం ఏం జరిగింది? అనే పాయింట్‌తో 'డ్యూన్' తొలి భాగం రూపొందింది. 'డ్యూన్: ప్రొఫెసి'ని సైన్స్ ఫిక్షన్ జానర్‌లో తెరకెక్కించనున్నారట. తొలి భాగం కంటే ఐదు రెట్ల బడ్జెట్ కేటాయించారని టాక్.

సంగీత్ ప్రారంభం


తేజు అశ్విని, నిఖిల్

నిఖిల్ విజయేంద్ర సింహ, తేజు అశ్విని జంటగా విక్రమ్ శివ, సూర్య గణపతి, హర్ష చెముడు కీలక పాత్రల్లో 'సంగీత్' సినిమా ప్రారంభమైంది. కన్నడ హిట్ మూవీ 'హంబుల్ పొలిటీషియన్ నోగ్‌రాజ్' ఫేమ్ సాద్ ఖాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జి. మనోహరం, ఎల్. బాలకృష్ణ సమర్పణలో నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ నిర్మిస్తున్న ఈ మూవీ మంగళవారం ప్రారంభమైంది. శౌర్య కెమెరా స్విచ్చాన్ చేయగా, ఎస్ఎస్ కార్తికేయ క్లాప్ కొట్టారు. నిహారిక కొణిదెల యూనిట్‌కి స్క్రిప్ట్ అందించారు. ''పెళ్లి టైమ్‌లో ఓ కుటుంబంలో జరిగే ఘటనలను వినోదభరితంగా చూపిస్తున్నాం'' అన్నారు సాద్ ఖాన్. ''ఇది నా మనసుకి దగ్గరైన కథ'' అన్నారు నిఖిల్ విజయేంద్ర సింహ. ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మాజ్ ఖాన్.

సస్పెన్స్... థ్రిల్


'మిరల్' పోస్టర్

'ప్రేమిస్తే' మూవీ ఫేమ్ భరత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మిరల్'. ఎం. శక్తివేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వాణీ భోజన్ హీరోయిన్. జగన్మోహిని, జి. ఢిల్లీ బాబు సమర్పణలో సీహెచ్ సతీష్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది. ''హారర్, సస్పెన్స్ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రాబోతోన్న చిత్రం 'మిరల్'. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌తో మా సినిమా మీద అంచనాలు పెరిగాయి. పోస్టర్, ట్రైలర్‌లో చూపించినట్లు ఆ మాస్క్ కథ ఏంటి? అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆ స్ఫూర్తితో కథ రాశా - కృష్ణమాచారి



''భాగ్యలక్ష్మి బంపర్ డ్రా'లో అలీగారికి కోటి రూపాయిల లాటరీ తగులుతుంది. ఆ ఆనందంలో ఆయన నవ్వుతూనే చనిపోతారు. సినిమా అంతా నవ్వు ముఖంతోనే ఉంటారు. అలాగే క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి జరిగిన సర్జరీ వల్ల ఆయన ముఖం ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తుంది. ఇలాంటి లోపంతో కథ రాస్తే బావుంటుందనిపించి 'రాజు యాదవ్' స్క్రిప్ట్ రాశాను'' అని డైరెక్టర్ కృష్ణమాచారి అన్నారు. గెటప్ శ్రీను హీరోగా కె. ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన చిత్రం 'రాజు యాదవ్'. ఈ నెల 17న ఈ సినిమా రిలీజవుతున్న సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ- ''15 ఏళ్ల క్రితం ఇండస్ట్రీకి వచ్చాను. 'నీదీ నాదీ ఒకే కథ, విరాటపర్వం' చిత్రాలకు దర్శకుడు వేణు ఊడుగులగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకుడిగా 'రాజు యాదవ్' నా తొలి చిత్రం. నాకు సహజత్వంతో కూడకున్న సినిమాలంటే ఇష్టం. 'రాజు యాదవ్' రియలిస్టిక్‌గా ఉంటుంది. గెటప్ శ్రీను కెరీర్‌లో ఇది గుర్తుండిపోయే సినిమా అవుతుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం, సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. చంద్రబోస్‌గారు మా సినిమా కోసం ఓ పాట రాసి, పాడటం సంతోషంగా ఉంది. సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు.

సాక్షి బిజినెస్

బుధవారం
15-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
328	114
73,105	22,218

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,413	▲	25
డోజోన్స్	39,330	▽	102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,428	▲	13
డాక్స్	18,716	▽	26
షాంఘై	3,146	▽	2
నికాయ్	38,356	▲	177

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (24 క్యారెట్)	72,820
బంగారం (22 క్యారెట్)	66,750
వెండి (కేజీ)	87,200

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.11	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.74	106.28
€	యూరో	ఎస్‌బీఐ	89.02	91.40
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.88	54.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.25	56.22
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.40	64.10
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.85	23.63
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.50

ఎఫ్‌అండ్‌వోతో జర జాగ్రత్త

రిటైల్ ఇన్వెస్టర్లకు ఆర్థిక మంత్రి హెచ్చరిక



బీఎస్‌ఈలో జరిగిన వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో నిర్మలా సీతారామన్, ఎక్స్ఛేంజీ ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి తదితరులు

ముంబై: రిస్కులతో కూడుకున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్‌అండ్‌వో) ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటున్న నేపథ్యంలో దీనిపై తగిన విధంగా పర్యవేక్షణ ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. లేని పక్షంలో భవిష్యత్తులో మార్కెట్లతో పాటు ఇన్వెస్టర్ల సెంటిమెంటు, కుటుంబాల పొదుపునకు సవాళ్లు తలెత్తగలవని ఆమె హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ నిధులకు రక్షణ కల్పించడం తమ లక్ష్యమని బీఎస్‌ఈ నిర్వహించిన వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ఎఫ్‌అండ్‌వోలో ట్రేడింగ్ కారణంగా ప్రతి పది మంది రిటైల్ ఇన్వెస్టర్లలో తొమ్మిది మంది రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోతున్నారన్న సెబీ అధ్యయనం నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మార్కెట్లకు బ్లూచిప్స్ దన్ను



మూడో రోజూ ముందుకే

ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. ప్రధానంగా బ్లూచిప్స్‌లో కొనుగోళ్లు ఇందుకు సహకరించాయి. సెన్సెక్స్ 328 పాయింట్లు లాభపడి 73,105కు చేరగా.. నిఫ్టీ 114 పాయింట్లు పుంజుకుంది. 22,218 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 510 పాయింట్లు జంప్‌చేసి 73,286ను అధిగమించింది. నిఫ్టీ సైతం గరిష్టంగా 22,270ను తాకింది.

మెటల్ మెరుపులు

ఎన్ఎస్ఈలో మెటల్, ఆటో, ఆయిల్ రంగాలు 3-1.5 శాతం మధ్య ఎగశాయి. ఇతర ఇండెక్సులలో పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, మీడియా 1 శాతం స్థాయిలో బలపడగా.. ఎఫ్ఎంసీజీ, ఫార్మా 0.5 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలోఅదానీ ఎంటర్, ఎంఅండ్ఎం, హీరోమోటో, ఓఎన్‌జీసీ, ఎల్అండ్‌టీ, జేఎస్‌డబ్ల్యూ, హిందాల్కో, అదానీ పోర్ట్స్, ఐషర్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, ఆర్ఐఎల్, ఇండస్ఇండ్, అల్ట్రాటెక్, ఎస్‌బీఐ, టైటన్, విప్రో 5.4-1 శాతం మధ్య లాభపడ్డాయి.

అదానీ షేర్ల హవా

మంగళవారం ట్రేడింగ్‌లో అదానీ గ్రూప్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో 10 లిస్టెడ్ కంపెనీలు 5.5-2 శాతం మధ్య ఎగశాయి. వెరసి వీటి మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) దాదాపు రూ. 15,86,019 కోట్లకు చేరింది. ఈ ఏడాది(2024-25) వివిధ బిజినెస్‌లపై రూ. 80,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే.

పసిడి గనుల రేసులో హిందుస్తాన్ జింక్, జేకే సిమెంట్

రాజస్తాన్‌లోని మైన్స్‌కు సాంకేతిక అర్హత



న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో వేలం వేస్తున్న రెండు పసిడి గనులను దక్కించుకునేందుకు పోటీపడుతున్న సంస్థల్లో వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్తాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్ తదితర సంస్థలు సాంకేతిక అర్హత పొందాయి. భూక్యా-జగ్‌పురా గోల్డ్ బ్లాక్ కోసం జిందాల్ పవర్, హిందుస్తాన్ జింక్, రామ్‌గఢ్ మినరల్స్ అండ్ మైనింగ్, సయ్యద్ ఒవైస్ అలీ, హిరాకుండ్ నేచురల్ రిసోర్సెస్ సంస్థలు సాంకేతికంగా అర్హత కలిగిన బిడ్డర్లుగా నిల్చాయి. అటు కాంక్రియా గెరా పసిడి గనికి హిందుస్తాన్ జింక్, జేకే సిమెంట్ తదితర సంస్థలు టెక్నికల్ అర్హత సాధించాయి. 2024 మార్చిలో పసిడి గనుల వేలం ప్రక్రియ ప్రారంభమైంది.

మొజాంబిక్ లిథియం బ్లాకుల్లో దెక్కన్ గోల్డ్ మైన్స్‌కు వాటాలు: ఆఫ్రికా దేశం మొజాంబిక్‌లో అయిదు లిథియం బ్లాకుల్లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసినట్లు దెక్కన్ గోల్డ్ మైన్స్ (డీజీఎంఎల్) వెల్లడించింది. ఇందుకోసం మొజాంబిక్‌కు చెందిన మాగ్నిఫికా గ్రూప్‌తో కలిసి దెక్కన్ గోల్డ్ మొజాంబిక్ ఎల్‌డీఏ (డీజీఎంవోజెడ్) పేరిట జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు వివరించింది.

ఆహార ధరల తీవ్రత

- టోకు ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26%
- 13 నెలల గరిష్టం



న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26 శాతంగా నమోదైంది. గడచిన 13 నెలల్లో ఈ స్థాయి టోకు ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఫుడ్ ఆర్టికల్స్‌లో పాటు, విద్యుత్, క్రూడ్ పెట్రోలియం, సహజ వాయువు, కొన్ని తయారీ ఉత్పత్తుల ధరలూ పెరిగినట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సూచీ వరుసగా రెండు నెలల నుంచి పెరుగుతూ వస్తోంది. ఫిబ్రవరిలో 0.20% ఉన్న డబ్ల్యూపీఐ, మార్చిలో 0.53 శాతానికి ఎగసింది. గత 2023 ఏప్రిల్‌లో సూచీ 0.79 శాతం పెరిగింది.

అధికారిక గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- ఫుడ్ ఆర్టికల్స్ ధరలు మార్చిలో 6.88 శాతం పెరిగితే, ఏప్రిల్‌లో 7.74 శాతం ఎగశాయి. ఇదే కాలంలో కూరగాయల ధరలు 19.52 శాతం నుంచి 23.60 శాతానికి ఎగశాయి. ఆలూ ధరలు 52.96 శాతం నుంచి 71.97 శాతానికి పెరిగాయి. ఇక ఉల్లి ధరలు మార్చిలో 56.99% పెరిగితే, ఏప్రిల్‌లో 59.75 % ఎగశాయి.
- ఫ్యూయల్ అండ్ పవర్ బాస్కెట్ విభాగంలో ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.38 శాతంగా ఉంది. మార్చిలో ఈ విభాగంలో అసలు పెరుగుదల లేకపోగా మైనస్ 0.77 శాతంగా (క్షీణత) నమోదైంది.
- సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం ఏప్రిల్‌లో పెరక్కపోగా, 0.42 శాతం క్షీణించింది. అయితే మార్చిలో ఈ క్షీణ రేటు 0.85 శాతం ఉండడం గమనార్హం.

ఎయిర్‌టెల్ వీక్ సిగ్నల్స్

క్యూ4లో రూ. 2,072 కోట్లు ● షేరుకి రూ. 8 డివిడెండ్



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ గత ఆర్థిక సంవత్సరం(2023-24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 2,072 కోట్లకు పరిమితమైంది. వాటాదారులకు షేరుకి రూ. 8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం పైగా పుంజుకుని రూ. 37,599 కోట్లను అధిగమించింది. నైజీరియన్ కరెన్సీ నైరా విలువ తగ్గింపు పనితీరుపై ప్రభావం చూపినట్లు కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ పేర్కొన్నారు. దీంతో రూ. 2,544 కోట్లకు పైగా ఫారెక్స్ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 8% మెరుగై రూ. 209కు చేరింది.

దేశీయంగా గుడ్: దేశీయంగా క్యూ4లో ఎయిర్‌టెల్ ఆదాయం 13 శాతం ఎగసి రూ. 28,513 కోట్లను తాకింది. 4జీ, 5జీ కస్టమర్ల సంఖ్య 13 శాతం ఎగసి 25.27 కోట్లను తాకింది. మొత్తం కస్టమర్ల సంఖ్య 5 శాతం బలపడి 35.22 కోట్లకు చేరింది. పూర్తి ఏడాదికి ఎయిర్‌టెల్ నికర లాభం 10 శాతంపైగా నీరసించి రూ. 7,467 కోట్లకు పరిమితమైంది. 2022-23లో రూ. 8,346 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8% బలపడి రూ. 1,49,982 కోట్లను అధిగమించింది.

షేరు బీఎస్‌ఈలో స్వల్ప నష్టంతో రూ. 1,285 వద్ద ముగిసింది.

పీవీఆర్ ఐనాక్స్ నష్టాలు తగ్గాయ్



న్యూఢిల్లీ: పీవీఆర్ ఐనాక్స్ మార్చి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను భారీగా తగ్గించుకుని రూ. 130 కోట్లకు పరిమితం చేసుకుంది. 2022-23 క్యూ4లో రూ. 334 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,143 కోట్ల నుంచి రూ. 1,256 కోట్లకు పుంజుకుంది. మొత్తం వ్యయాలు రూ. 1,364 కోట్ల నుంచి రూ. 1,481 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి పీవీఆర్ ఐనాక్స్ నికర నష్టం కేవలం రూ. 33 కోట్లకు పరిమితమైంది. 2022-23లో రూ. 336 కోట్ల నష్టం నమోదైంది. ఆదాయం రూ. 3,751 కోట్ల నుంచి రూ. 6,107 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో పీవీఆర్ ఐనాక్స్ షేరు బీఎస్‌ఈలో 1.5 శాతం నష్టంతో రూ. 1,298 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్/ 100కు రూ.లలో)

15-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550-00
చిత్తూరు	618-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
హైదరాబాద్	545-00
వరంగల్	547-00

సాగర్ సిమెంట్స్ డివిడెండ్ 70 పైసలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాగర్ సిమెంట్స్ బోర్డు 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 70 పైసల డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.88 కోట్ల నుంచి రూ.11 కోట్లకు పడిపోయింది. టర్నోవర్ రూ.802 కోట్ల నుంచి రూ.752 కోట్లకు వచ్చి చేరింది. 2023-24లో రూ.2,559 కోట్ల టర్నోవర్‌పై రూ.53 కోట్ల నికరనష్టం వాటిల్లింది. దాచేపల్లి ప్లాంటు క్లింకర్, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు కంపెనీ 2024-25లో రూ.255 కోట్లు, 2025-26లో రూ.215 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఎండీగా ఎస్.ఆనంద్ రెడ్డి, జేఎండీగా ఎస్.శ్రీకాంత్ రెడ్డిని తిరిగి నియమిస్తూ కంపెనీ నిర్ణయం తీసుకుంది. 2024 అక్టోబర్ 31 నుంచి మూడేళ్లు ఈ పదవిలో ఉంటారు.

బీఎస్‌ఈలో మంగళవారం షేరు ధర 0.02% పెరిగి రూ. 214.25 వద్ద స్థిరపడింది.

వాహన విక్రయాల్లో ఏప్రిల్ శుభారంభం

- గతేడాదితో పోలిస్తే 25% జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా హోల్‌సేల్ వాహన విక్రయాల్లో ఏప్రిల్ శుభారంభం చేసింది. అన్ని విభాగాల్లో కలిపి గత నెలలో 21,36,157 యూనిట్లు తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరాయి. 2023 ఏప్రిల్‌తో పోలిస్తే ఇది ఏకంగా 25 శాతం అధికం కావడం విశేషం. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) ప్రకారం.. ఏప్రిల్‌లో అన్ని వాహన విభాగాలు మెరుగైన హోల్‌సేల్ విక్రయాలను నమోదు చేయడం గమనార్హం. ప్యాసింజర్ వెహికిల్స్ 1.3 శాతం వృద్ధితో 3,31,278 యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్యాసింజర్ కార్స్ 23.4 శాతం క్షీణించి 96,357 యూనిట్లు, యుటిలిటీ వెహికల్స్ 21 శాతం దూసుకెళ్లి 1,79,329 యూనిట్లను తాకాయి. వ్యాన్స్ అమ్మకాలు 15 శాతం పెరిగి 12,060 యూనిట్లుగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు ఏకంగా 31 శాతం ఎగసి 17,51,393 యూనిట్లకు చేరుకున్నాయి. మోటార్‌సైకిల్స్ 34.4 శాతం దూసుకెళ్లి 11,28,192 యూనిట్లు, స్కూటర్స్ 25.2 శాతం అధికమై 5,81,277 యూనిట్లను తాకాయి. త్రిచక్ర వాహనాలు 14.5 శాతం ఎగసి 49,116 యూనిట్లు నమోదు చేశాయి.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఇండియన్ నేవీలో అగ్నివీర్(ఎంఆర్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్(ఎంఆర్) ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీరులుగా ఎంపికైన వారికి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది.

» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** అభ్యర్థి 01.11.2003 నుంచి 30.04.2007 మధ్యలో జన్మించి ఉండాలి.
» **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్-1(ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్ట్), స్టేజ్-2(రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష-పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం హిందీ /ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 50 బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 50 మార్కులు ఉంటాయి. సైన్స్, మ్యాథమేటిక్స్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి పదో తరగతి స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.
» **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ నెలలో శిక్షణ ప్రారంభమవుతుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.05.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 27.05.2024.
» **శిక్షణ ప్రారంభం:** 2024 నవంబర్ నెలలో
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

డీఆర్‌డీవో-చెస్, హైదరాబాద్‌లో 25 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోకి చెందిన సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్ అండ్ సైన్సెస్(సీహెచ్ఈఎస్ఎస్).. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఇంజనీర్స్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 25.
» **శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
» **విభాగాలు:** గ్రాడ్యుయేట్(డిగ్రీ), టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్.
» **అర్హత:** సంబంధిత విభాగాన్ని అనుసరించి బీఈ/బీటెక్, డిప్లొమా కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్ పోస్టులకు రూ.8000.
» **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, విద్యార్హత మార్కుల శాతం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
» **ప్రకటన వెలువడిన తేది:** 11.05.2024.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in/drdo

భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు(మ్యూజిషియన్) పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్నివీర్ వాయు (మ్యూజిషియన్) (01/2025) ఖాళీల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి మెట్రిక్యులేషన్/పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థులు సంగీతంతోపాటు సంబంధిత వాయిద్య పరికరం వాయించడంతో ప్రావీణ్యం కలిగి ఉండాలి. సంగీతానుభవ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 02.01.2004 నుంచి 02.07.2007 మధ్య జన్మించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రొఫీషియన్సీ టెస్ట్, ఇంగ్లిష్ రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 22.05.2024.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 05.06.2024.
» **రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు:** 03.07.2024 నుంచి 12.07.2024 వరకు
» **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

నైపర్‌లో.. పీజీ, పీహెచ్‌డీ

» నైపర్‌లో ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు
» నైపర్-జేఈఈ ర్యాంకు ఆధారంగా ప్రవేశం
» పీజీ, పీహెచ్‌డీల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్
» ఫార్మా రంగంలో కెరీర్ అవకాశాలు

ఫార్మసీలో ఉన్నత విద్యకు ఉత్తమ వేదికలు.. నైపర్ క్యాంపస్‌లు! ఫార్మా కోర్సులను అందించడంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేస్తే..ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు! నైపర్‌లో ప్రవేశం పొందాలంటే.. నైపర్-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది!! తాజాగా 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి నైపర్-జేఈఈ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నైపర్ జేఈఈకి అర్హతలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు, పీజీ స్పెషలైజేషన్స్, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..



నైపర్ జేఈఈ 2024

ఫార్మా రంగంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. ఈ విద్యాసంస్థలు ఇండస్ట్రీ, రీసెర్చ్ ల్యాబ్స్‌తో ఒప్పందాల ద్వారా ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యమిస్తూ .. ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నాయి. ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏటా నైపర్-జేఈఈ నిర్వహిస్తున్నారు.

ఏడు క్యాంపస్‌లు.. 990 సీట్లు

దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఏడు నైపర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వాటిలో ఎంఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ స్థాయిల్లో మొత్తం 990 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోర్సులు-స్పెషలైజేషన్లు

- మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఫార్మసీ)-మెడిసినల్ కెమిస్ట్రీ, నేచురల్ ప్రొడక్ట్స్, ట్రెడిషనల్ మెడిసిన్, ఫార్మాస్యూటికల్ అనాలసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మస్యూటిక్స్, ఫార్మకోఇన్ఫర్మాటిక్స్, రెగ్యులేటరీ అఫైర్స్.
- మాస్టర్ ఆఫ్ ఫార్మసీ (ఎంఫార్మ్)-ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ఫార్ములేషన్స్), ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ రీసెర్చ్.
- మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఫార్మసీ)-బయోటెక్నాలజీ/ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ), ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ/మెడిసినల్ కెమిస్ట్రీ), మెడికల్ డివైసెస్.
- మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఫార్మసీ)-ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్.

అర్హతలు

- **నైపర్-జేఈఈ (పీజీ):** సదరు పీజీ ప్రోగ్రామ్‌ను అనుసరించి బీఫార్మసీ/బీవీఎస్సీ /ఎంబీబీఎస్ /బీడీఎస్/బీటెక్ (బయో టెక్నాలజీ)/ఎమ్మెస్సీ తత్సమాన కోర్సుల్లో 6.75 సీజీపీఏ లేదా అంతకు సమానమైన పర్సంటేజీతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు జీప్యాట్/గేట్/నెట్‌లో అర్హత సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **నైపర్-జేఈఈ(పీహెచ్‌డీ):** ఆయా విభాగాలను అనుసరించి ఎంఎస్,ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సులను సదరు స్పెషలైజేషన్లతో 6.75 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 6.25 సీజీపీఏ లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. దీంతోపాటు జీప్యాట్/గేట్/సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌లో అర్హత సాధించాలి. ఎండీ, ఎంవీఎస్సీ, ఎండీఎస్, ఫార్మ్-డి ఉత్తీర్ణులకు జీప్యాట్/నెట్/గేట్ నిబంధన నుంచి మినహాయింపు లభిస్తుంది.

200 మార్కులకు పరీక్ష

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నైపర్ జేఈఈ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. పరీక్షను రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు. సెక్షన్-ఎలో 50 ప్రశ్నలు జీకే, జనరల్ ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాల నుంచి అడుగుతారు. సెక్షన్-బిలో 150 ప్రశ్నలు బీఫార్మసీ లేదా ఎంఫార్మసీకి సంబంధించి ఉంటాయి. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో మెరుగైన ర్యాంకు పొందాలంటే.. అభ్యర్థులు బీఫార్మసీ స్థాయిలోని అకడమిక్స్‌పై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, బయో టెక్నాలజీ, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్ విభాగాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. మొత్తం 200 ప్రశ్నల్లో 70 శాతం మేర ప్రశ్నలు ఈ విభాగాల నుంచే అడుగుతున్నారు. కొన్ని ప్రశ్నలు జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించినవి ఉంటున్నాయి.

ఎంబీఏకు జీడీ/పీఐ

నైపర్ క్యాంపస్‌లలో ఎంబీఏ ఫార్మా మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి నైపర్ -జేఈఈలో ఉత్తీర్ణతతోపాటు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలోనూ రాణించాల్సి ఉంటుంది. నైపర్-జేఈఈకి 85 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ రెండింటికీ కలిపి 15 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఉమ్మడి కౌన్సెలింగ్

నైపర్-జేఈఈలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఒక క్యాంపస్ నైపర్-జేఈఈని నిర్వహిస్తుంది. ఆ క్యాంపస్ ఆధ్వర్యంలోనే ఉమ్మడి కౌన్సెలింగ్ జరుగుతుంది. అందుబాటులో ఉన్న సీట్లు, కటాఫ్ మార్కులు తదితరాల ఆధారంగా ప్రవేశ జాబితా రూపొందిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత గడువులోపు తమకు సీటు లభించిన క్యాంపస్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

స్టయిఫండ్

నైపర్-జేఈఈ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు నైపర్ క్యాంపస్‌లు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12,400 స్టయిఫండ్ లభిస్తుంది. ఈ స్టయిఫండ్ కొనసాగాలంటే.. ప్రతి సెమిస్టర్‌లోనూ తప్పనిసరిగా జీపీఏ ఆరు పాయింట్లు ట్రాక్ రికార్డ్‌ను కొనసాగించాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 24
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్, పరీక్ష తేదీ:** ఇంకా వెల్లడించలేదు
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://niperguwahati.ac.in/niperjee

నైపర్ జేఈఈ- పీహెచ్‌డీ

నైపర్ క్యాంపస్‌లలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నైపర్ -జేఈఈ ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసేటప్పుడే పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే నైపర్-జేఈఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో 170 ప్రశ్నలు-85 మార్కులు ఉంటాయి. కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

మలిదశలో ఇంటర్వ్యూ

ఎంట్రెన్స్‌లో పొందిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 15. ఇందులో అభ్యర్థులకు సదరు స్పెషలైజేషన్‌లో పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలు తదితరాలను పరిశీలిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే పీహెచ్‌డీలో ప్రవేశం లభిస్తుంది.

సీటు పొందితే.. స్టయిఫండ్

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున; మూడు, నాలుగేళ్లు నెలకు రూ.35 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది. దీంతోపాటు హెచ్ఆర్ఏ కూడా అందుతుంది.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బీఫార్మసీలో పొందిన నైపుణ్యం పరీక్షలో బెస్ట్ స్కోర్‌కు దోహదపడుతుంది. అదేవిధంగా జీప్యాట్ కోసం కొనసాగించిన సన్నద్ధత సైతం పరీక్షలో రాణించేందుకు ఉపయోగపడుతుంది. ఫార్మకాలజీలో రిసెప్టర్స్,వాటి రకాలు, మెకానిజమ్ ఆఫ్ యాక్షన్, ఔషధాల వర్గీకరణ, క్లినికల్ ట్రయల్స్‌పై అవగాహన, ప్రీ-క్లినికల్ ట్రయల్స్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. డ్రగ్ డిస్కవరీకి సంబంధించి ముఖ్యంగా వాటి ప్రాముఖ్యతలు, రియాక్షన్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

క్లుప్తంగా...

ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య

- రెండు గంటలు ఆలస్యం
- విమానంలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు



విమానంలో ఉన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయం నుంచి కొచ్చిన్ బయలుదేరాల్సిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి మంగళవారం ఉదయం 9.55కు విమానం బయలుదేరాల్సి ఉండగా, టేకాఫ్ తీసుకునే సమయంలో సమస్యను గుర్తించిన పైలట్ దానిని నిలిపివేశారు. విమానంలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, అనుచరులు మువ్వా విజయబాబు, బ్రహ్మయ్యలున్నారు. ఎన్నికలు ముగియడంతో వీరు శబరిమలకు వెళుతున్నారు. తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి కూడా విమానంలో ఉన్నారు. మరమ్మతుల అనంతరం విమానం 11.40 గంటలకు బయలుదేరి 1.11 గంటలకు కొచ్చిన్ చేరుకుంది.

సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: సీబీఎస్‌ఈ పదవ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య సత్తాచాటింది. తమ విద్యాసంస్థ 496 టాప్ మార్కులతో ఆలిండియా నంబర్‌వన్‌గా నిలిచిందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో అత్యధిక మార్కులు 495 ఇద్దరు విద్యార్థులు సాధించారన్నారు. 8 మంది విద్యార్థులు 494 ఆపైన మార్కులు పొందినట్లు చెప్పారు. ఓవరాల్‌గా శ్రీచైతన్య స్కూల్‌లోని 92% బ్రాంచీలు 100% ఉత్తీర్ణత సాధించాయని, ఇక స్కూల్ ఉత్తీర్ణత శాతం 99.5 అని వెల్లడించారు. 791 మంది విద్యార్థులు వ్యక్తిగత సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధించారన్నారు. ఇంతటి విజయాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో నారాయణ రికార్డు

సాక్షి, హైదరాబాద్: సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో నారాయణ రికార్డు సృష్టించింది. 500 మార్కులకు 498 మార్కులతో అగస్త్య రేమాని సంచలనం సృష్టించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 9 మంది విద్యార్థులు 495 కు పైగా మార్కులు సాధించారని, 49 మంది 490కి పైగా మార్కులు పొందారని వెల్లడించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాల్లోని 138 కు పైగా బ్రాంచీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకేతర సిబ్బందిని నారాయణ డైరెక్టర్ కె.పునీత్ అభినందించారు.

20 నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీల్లో ప్రవేశానికి సంబంధించిన దోస్త్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ఈనెల 20 ఉంచి మొదలవుతుందని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి తెలిపారు. వాస్తవానికి ఈ ప్రక్రియ మంగళవారం నుంచి మొదలవాల్సి ఉంది. అయితే ఈనెల 30వ తేదీ వరకు దోస్త్ ఆప్షన్లకు అవకాశం ఉందని వెల్లడించారు.



సుద్దాలలో నరికిన చెట్టు వద్ద చిన్నారి బ్లెస్సీ

సీఎం సార్.. చెట్లను కాపాడండి

కోనరావుపేట(వేములవాడ): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో హరితహారంలో భాగంగా పెరిగిన పచ్చని చెట్లను నరికేస్తున్నారని విద్యార్థిని ప్రకృతి బ్లెస్సీ ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణాలతో పాటు పల్లెల్లో రోడ్డుకిరువైపులా విద్యుత్ తీగలకు చెట్లు అంతరాయం కలిగిస్తున్నాయంటూ నరికేస్తున్నారని పేర్కొంది. తమ పైఅధికారుల సూచనలతో చెట్లను నరికేస్తున్నామని విద్యుత్ సిబ్బంది చెబుతున్నారని, విద్యుత్‌కు అంతరాయం కలిగితే కొమ్మలు తొలగించాలి తప్ప పూర్తిగా చెట్లను నరికేయొద్దని చెప్పింది. 'సీఎం సార్.. చెట్లను కాపాడమనండి' అనే ప్లకార్డును ప్రదర్శిస్తూ విజ్ఞప్తి చేసింది.

కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం

రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధ, గురువారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. పశ్చిమ విదర్భ, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోంది. దీనికి తోడుగా రాష్ట్రానికి తూర్పు దిశ నుంచి బలమైన గాలులు వీస్తు న్నా యి. దీని ప్రభావంతో రాష్ట్రంలో రెండ్రోజులు కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు నమో దయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వివరించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులు, గాలులతో కూడిన వానలు కురిసే అవకాశమున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మంగళ వారం రాష్ట్రంలో చాలాచోట్ల సాధారణ ఉష్ణోగ్రతలే నమోదయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. గరిష్ట ఉష్ణోగ్రత నిజామా బాద్‌లో 41.2 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 22.5 డిగ్రీ సెల్సి యస్‌గా నమోదైంది. గురువారం నుంచి రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతాయని వాతావరణ శాఖ నిపుణులు తెలిపారు.

మంగళవారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం
నిజామాబాద్	41.2
ఆదిలాబాద్	40.3
రామగుండం	40.0
ఖమ్మం	40.0
భద్రాచలం	39.8
మహబూబ్‌నగర్	39.0
నల్లగొండ	39.0
మెదక్	38.8
హకీంపేట్	37.2
హైదరాబాద్	37.2
దుండిగల్	37.0
హన్మకొండ	37.0



పాలనపైనే దృష్టి

- నేటి నుంచి సచివాలయానికి వెళ్తా.. ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించి పనిచేస్తా
- విలేకరులతో సీఎం రేవంత్ ఇష్టాగోష్టి.. లోక్‌సభ ఎన్నికల్లో 13 సీట్లు గెలుస్తామని అంచనా
- భవిష్యత్తులో బీఆర్‌ఎస్ నిలబడుతుందో లేదో చూడాలి.. ఈ ఎన్నికల్లో మోదీ గాలి లేదు..
- కేంద్రంలో బీజేపీ సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు
- రైతు రుణమాఫీ కోసం రైతు సంక్షేమ కార్పొరేషన్
- రేషన్‌షాపుల్లో పేదలకు అవసరమైన వస్తువులు ఇచ్చే ఆలోచన

సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలో ఎన్నికలు ముగిశాయి. రాజకీయం అయిపోయింది. ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతి విమర్శలకు సమయం అయిపోయింది. నా విమర్శకులు ఏం మాట్లాడినా నేను పట్టించుకోను..' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చెప్పారు. బుధవారం నుంచి సచివాలయానికి వెళ్తానని.. పాలనపై, ప్రజల సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి పెడతానని తెలిపారు. రైతు రుణమాఫీ, తడిచిన ధాన్యం కొనుగోళ్లు, విద్యార్థుల పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, హాస్టళ్లకు సన్నబియ్యం లాంటి కార్యక్రమాల అమలు పనిని ప్రారంభిస్తానని వివరించారు. మంగళవారం జూబ్లీహిల్స్‌లోని తన క్యాంపు కార్యాలయంలో రేవంత్ విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలతో పాటు పలు అంశాలపై తన ఆలోచనలు పంచుకున్నారు.

ఒక్క మెదక్‌లోనే బీఆర్‌ఎస్ పోటీలో ఉంది

లోక్‌సభ ఎన్నికల్లో 13 స్థానాల్లో విజయం సాధిస్తాం .మహబూబ్‌నగర్ పార్లమెంటులో 50 వేల మెజార్టీతో గెలవబోతున్నాం. కంటోన్మెంట్ అసెంబ్లీలో 20 వేల మెజార్టీతో గెలుస్తాం. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఏం చేసిందన్న దానిపైనే ఫలితం ఆధారపడి ఉంటుంది. బీఆర్‌ఎస్ బలవంతంగా మాకు బీజేపీని ప్రత్యర్థిగా సృష్టించింది. బీఆర్‌ఎస్ వ్యవస్థనంతటినీ తీసుకెళ్లి బీజేపీకి ఔట్‌సోర్సింగ్ చేశారు. భవిష్యత్తులో బీఆర్‌ఎస్ నిలబడుతుందా లేదా అన్నది చూడాలి. ఆ పార్టీకి ఐదారు చోట్ల డిపాజిట్లు రావు. ఒక్క మెదక్‌లోనే పోటీలో ఉంది. ఈ ఎన్నికల్లో మోదీ గాలి లేదు. దేశ వ్యాప్తంగా బీజేపీకి 220కి ఓ పదిశాతం ఎక్కువో, తక్కువో వస్తాయి. కేంద్రంలో సొంతంగా అధికారంలోకి రాదు. 12 సీట్లు గెలిచి ప్రధాని రేసులో ఉంటానన్న కేసీఆర్ ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ అయినా మాకేం అభ్యంతరం లేదు. మా ప్రభుత్వం పడిపోవాలంటే బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసే ప్రయత్నం చేయాలి కదా. అలా జరిగితే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరూ బీజేపీ వైపునకే వెళ్లాలని ఏముంది? సగం మాతో కూడా రావచ్చు. అలాంటప్పుడు బీఆర్‌ఎస్ పార్టీనే మిగలదు.

రైతు రుణాల బాధ్యత తీసుకుంటాం

రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ)కి అన్ని విషయాలు చెప్పాం. రైతులకు ఏ బ్యాంకులో ఎంత రుణం ఉందో లెక్కలు తీయమని చెప్పాం. ఈ రుణాలకు మేం బాధ్యత తీసుకుంటాం. రైతు సంక్షేమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, దానికి ఆదాయం చూపించి రుణాలపై బ్యాంకర్లను ఒప్పిస్తాం. రైతులను అప్పుల నుంచి విముక్తులను చేస్తాం.

అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయాలు

బీఆర్‌ఎస్ గత పాలనలో వివాదాస్పదమైన అన్ని అంశాలపై అసెంబ్లీలో లేదంటే అఖిలపక్షం ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకుంటాం. రైతు సంఘాలతో సమావేశమై అభిప్రాయాలు తీసుకుంటాం. రైతుకు పెట్టుబడి, గిట్టుబాటు ధరలు కల్పించడంపై నా ఫోకస్ 100 శాతం ఉంటుంది. రైతుబంధు ఇవ్వలేదన్నారు. మే ఆరోతేదీ కల్లా 100 శాతం వేసి చూపించాం. గతంలో డిసెంబర్ వరకూ వేసేవాళ్లు. రైతుబంధు కొత్త నిబంధనలపై ఆషామాషీగా నిర్ణయాలు తీసుకోబోం.

రేషన్‌షాపుల్లో సంస్కరణలు

రేషన్‌షాపుల ద్వారా గతంలో మేం 9 వస్తువులిచ్చేవాళ్లం. ఇప్పుడు బియ్యం మాత్రమే ఇస్తున్నారు. తాజాగా రైతులు పండించే అన్ని పంటలను గిట్టుబాటు ధర కంటే కొంచెం ఎక్కువే ఇచ్చి కొనుగోలు చేసి వాటిని ఉత్పత్తుల కింద మార్చి రేషన్‌షాపుల ద్వారా పేదలకు తక్కువ ధరకు ఇచ్చే ఆలోచన చేస్తున్నాం. వడ్లు కొని మేమే సన్న బియ్యం తయారు చేసి పేదలకిస్తాం. ఇక్కడ పండే దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐకిస్తాం. మిల్లర్లు ఎక్కడైనా తేడా చేస్తే లోపల వేస్తా. రైతుకు, వినియోగదారుడికి మధ్య వారధిగా ప్రభుత్వం ఉంటుంది.

పదేళ్లలో వందేళ్ల ప్రణాళికలు

పదేళ్లు ఇక్కడే ఉంటా. 2024–34 వరకు తెలంగాణ రాష్ట్రమే నా ప్రపంచం. ఈ పదేళ్లలో వందేళ్లకు సరిపడా ప్రణాళికలు రూపొందించి భావితరాలకు అందించడమే నా బాధ్యత. కొత్తగా మంత్రి పదవులు రెండయితే గ్యారంటీ వస్తాయి. నేనైతే అధిష్టానాన్ని నాలుగు భర్తీ చేసుకునేందుకు అనుమతి అడుగుతున్నా. అనుమతి లభిస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు ఒక్కొక్కటి చొప్పున వస్తాయి.

యూటీ.. ఓ విఫల ప్రయోగం

హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతం (యూటీ) చేస్తారనే చర్చ చేస్తున్న వారికి మెదడు లేనట్టే. తలకు మాసినోళ్లు చేసే చర్చ అది. యూటీ ఎందుకు చేస్తారు? అదో విఫల ప్రయోగం.

ఏపీతో సానుకూల వైఖరితోనే ముందుకు..

ఏపీ నుంచి ఎవరు సీఎం అయినా వారితో కలిసి పనిచేస్తా. సానుకూల వైఖరితోనే ముందుకెళ్తా.

సీఎం చిట్‌చాట్‌లో మరికొన్ని కీలకాంశాలు

- ఆరోగ్యానికి, తెల్ల రేషన్‌కార్డుకు సంబంధం లేకుండా చేస్తాం. రేషన్‌కార్డు లేకపోయినా ఆరోగ్యశ్రీ వర్తింజేస్తామన్న దానికి కట్టుబడి ఉన్నాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత అన్ని వర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తాం.
- కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) సిఫారసులు చూసిన తర్వాత కేబినెట్‌లో చర్చించి ఏం చర్యలు తీసుకోవాలో నిర్ణయం తీసుకుంటాం.
- రిటైర్ అయిన 1,000కి పైగా అధికారులు పలు హోదాల్లో ఉన్నారు. వారిపై ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత చర్యలుంటాయి.
- జీవో 59పై కూడా కోడ్ ముగిసిన తర్వాత సమీక్షించి నిర్ణయం తీసుకుంటాం.
- ఆకస్మిక తనిఖీలు, పర్యటనలు ఉంటాయి.
- రీజనల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) తెలంగాణకు అతి పెద్ద ఆస్తి కాబోతోంది. మూసీపై కూడా పెట్టుబడి పెట్టి ఆదాయాన్ని ఆర్జిస్తాం.
- వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం. ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తాం.
- హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జంట జలాశయాలకు శాశ్వత ప్రాతిపదికన గోదావరి జలాలు తెస్తాం.
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల మెట్రోకు నష్టం జరుగుతుందని, అమ్ముకోవాలని నిర్వహణ సంస్థ భావిస్తే అమ్ముకోమనండి.
- జిల్లాల పునర్వ్యవస్థీకరణపై కమిషన్ ఏర్పాటు చేస్తాం. వాలంటీర్లు, ఇందిరమ్మ కమిటీల ఏర్పాటుపై అధ్యయనం చేస్తాం.

హయ్యర్ పెన్షన్ కోసం ఎంప్లాయీ ఖాతా నుంచి ఈపీఎస్‌కు చెల్లింపు

సాక్షి, హైదరాబాద్: భవిష్యనిధి హయ్యర్ పెన్షన్ డిమాండ్ నోటీసుల్లో పేర్కొన్న మొత్తాన్ని ఈపీ ఎస్‌కు బదిలీ చేసే క్రమంలో ఆ మొత్తం సర్దుబాటుపై ఆర్టీసీ స్పష్టతనిచ్చింది. డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని ఆర్టీసీ ఉద్యోగి భవిష్య నిధి ఖాతాలోని ఎంప్లాయర్ పద్దు నుంచి మాత్రమే బదలాయిస్తూ వస్తున్నారు. కానీ, కోవిడ్ సంక్షోభ కాలంలో

ఆర్టీసీ యాజమాన్యం అంగీకారం

చాలా మంది ఉద్యోగులు భవిష్యనిధిని విత్‌డ్రా చేసుకోవటంతో అంతమొత్తం ఖాతాలో లేకుండా పోయింది. ఇలాంటి సమయంలో తక్కువపడే మొత్తాన్ని ఎంప్లాయీ ఖాతా నుంచి సర్దుబాటు చేసేలా అవకాశం ఇవ్వాలన్న ఉద్యోగుల డిమాండ్‌కు సంస్థ అంగీకరించింది. తక్కువపడే మొత్తాన్ని ఎంప్లాయీ పద్దు నుంచి బదలాయించేందుకు అంగీకరించింది. తాజాగా సంస్థ తమ డిమాండుకు అంగీకరించి ఎంప్లాయీ ఖాతా నుంచి సర్దుబాటు చేసేందుకు ముందుకు రావటంతో ఉద్యోగులకు వెసులుబాటు కలిగిందని ఎస్‌డబ్ల్యూఫ్ ప్రధాన కార్యదర్శి వీఎస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు.

నాన్ వెజ్ రేటు తగ్గి.. వెజ్ రేటు పెరిగి..




సగటున ప్లేట్ మీల్స్ రేటు అంచనాలను విడుదల చేసిన క్రిసిల్
2022 డిసెంబర్ నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు నెలవారీగా లెక్కలు

మనం ఇంట్లో తినే భోజనానికి సగటున అయ్యే ఖర్చెంత? వెజ్‌కు, నాన్ వెజ్‌కు మధ్య తేడా ఎంత? ఈ ఖర్చు ఏమేర పెరుగుతోంది? అప్పుడప్పుడూ ఇలాంటి ప్రశ్నలు మదిలో మెదులుతుంటాయి కదా.. అందుకోసమే ప్రఖ్యాత క్రిసిల్ సంస్థ ప్రతినెలా వెజ్, నాన్ వెజ్ భోజనానికి అయ్యే సగటు ఖర్చులను లెక్క తీస్తూ ఉంటుంది. అలా తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది.

సరుకులు, చికెన్ ధరల ఆధారంగా..

మార్కెట్లో ఎప్పటికప్పుడు మారే ధరల ఆధారంగా.. ఇంట్లో వండుకునే భోజనం సగటు ఖర్చును లెక్కించారు. దీన్ని వెజ్ థాలీ, నాన్‌వెజ్ థాలీగా వేర్వేరుగా లెక్కించారు. నూనెలు, వంటగ్యాస్, మసాలాలు వంటివి రెండింటిలోనూ వాడుతారు. వీటికితోడు నాన్ వెజ్‌కు సంబంధించి చికెన్, గుడ్ల ధరలను అదనంగా లెక్కించారు. వెజ్‌కు సంబంధించి టమాటా, బంగాళదుంపలు, పప్పులు, కూరగాయల ధరలను లెక్కలోకి తీసుకున్నారు.



తగ్గుతూ వస్తున్న నాన్ వెజ్ ఖర్చు!

క్రిసిల్ సంస్థ గత ఏడాదిన్నర కాలానికి సంబంధించి ప్రతినెలా అంచనాలను విడుదల చేసింది. 2023 ఏప్రిల్ నాటి ధరలతో ఈ ఏడాది ఏప్రిల్ నాటి ధరలు, వెజ్–నాన్‌వెజ్ థాలీల ఖర్చులను పోల్చింది. ఈ ఏడాది కాలంలో వెజ్ థాలీ ఖర్చు ఎనిమిది శాతం మేర పెరగ్గా.. నాన్‌వెజ్ థాలీ ఖర్చు 4శాతం మేర తగ్గింది. ఉల్లిపాయలు, టమాటా, బంగాళదుంపలు, కొన్నిరకాల కూరగాయలు, పప్పుల ధరలు పెరగడంతో వెజ్ ఖర్చు పెరిగిందని.. చికెన్ ధరలు కాస్త తగ్గడంతో నాన్‌వెజ్ ఖర్చు కాస్త తగ్గిందని క్రిసిల్ నివేదిక వెల్లడించింది.

– సాక్షి సెంట్రల్ డెస్క్



కాడెద్దుకు ఎంత కష్టం..

నీటికోసం వెళ్లిన కాడెద్దు బురదలో చిక్కుకుని విలవిల్లాడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి శివారు చెరువులో నీటికోసం వెళ్లిన కాడెద్దు బురదలో చిక్కుకుపోయింది. గంటపాటు నరకయాతన అనుభవించింది. దీనిపై స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వెంటనే కాడెద్దు యజమాని, రైతు మొండయ్య స్థానికుల సహాయంతో ట్రాక్టర్‌కు తాడు కట్టి దాన్ని బయటికి లాగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

– టేకుమట్ల





పోరు ముగిసింది.. షికారు మొదలైంది

కరీంనగర్ టౌన్: పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో.. ఇన్నాళ్ల క్షణం తీరిక లేకుండా గడిపిన బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రస్తుతం సేదదీరుతు న్నారు. తన మేనల్లుడు శ్రీనిక్‌బాబుతో కలిసి మంగళవారం స్కూటీపై కరీంనగర్ రోడ్లపై షికారు చేశారు. ఐస్‌క్రీం పార్లర్‌కు వెళ్లి స్నాక్స్ తిన్నారు. మిత్రులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కాలక్షేపం చేశారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ మరోసారి పార్లమెంట్‌కు వెళ్తానని ధీమా వ్యక్తం చేశారు.

వానాకాలం సాగు.. 1.34 కోట్ల ఎకరాలు

ఈ ఏడాది ఖరీఫ్ పంటల ప్రణాళిక ఖరారు.. 60 లక్షల ఎకరాల్లో పత్తి... 66 లక్షల ఎకరాల్లో వరి.. పత్తి సాగు పెద్దఎత్తున ప్రోత్సహించేలా కసరత్తు

సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం 1.34 కోట్ల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ మేరకు పంటల ప్రణాళికను విడుదల చేసింది. ఆ ప్రణాళిక ప్రకారం రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి ఉంచనున్నారు. ఈ వానాకాలం అత్యధికంగా 66 లక్షల ఎకరాల్లో వరి, ఆ తర్వాత పత్తి 60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని పేర్కొంది. గతేడాది వానాకాలం సీజన్‌లో 1.26 కోట్ల ఎకరాల్లో అన్ని రకాల పంటలు సాగయ్యాయి. ఈసారి 8 లక్షల ఎకరాల్లో అధికంగా పంటల సాగు జరుగుతుందని అంచనా వేసింది.

- గతేడాది 65 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా, ఈసారి 66లక్షల ఎకరాల్లో నాట్లు పడనున్నాయి.
- గతేడాది 44.77 లక్షల ఎకరాల్లో పత్తి సాగుకాగా, ఈసారి అదనంగా మరో 15.23 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యేలా ప్రోత్సహించనున్నారు.
- వరిసాగు కంటే పత్తినే ప్రోత్సహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. అవసరమైతే వరిని తగ్గించి, పత్తినే 70 లక్షల ఎకరాలకు పెంచే ఆలోచన కూడా చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



19.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరం

సాగుకనుగుణంగా విత్తన ప్రణాళికను కూడా వ్యవసాయశాఖ విడుదల చేసింది. ఈ వానాకాలం సీజన్‌కు 19.39 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నిర్ణయించింది.

- అత్యధికంగా 16.50 లక్షల క్వింటాళ్లు వరి విత్తనాలే కావడం గమనార్హం. పత్తి విత్తనాలు 54 వేల క్వింటాళ్లు అవసరం, సోయాబీన్ విత్తనాలు 1.49లక్షల క్వింటాళ్లు రైతులకు అందుబాటులోకి తెస్తారు. మొక్కజొన్న విత్తనాలు 48 వేల క్వింటాళ్లు, కంది విత్తనాలు 16,950 క్వింటాళ్లు, వేరుశనగ విత్తనాలు 13,800 క్వింటాళ్లు, పెసర విత్తనాలు 4,480 క్వింటాళ్లు సిద్ధం చేశారు.
- జొన్న, సజ్జ, రాగి, మినుములు, ఆముదం, పొద్దు తిరుగుడు విత్తనాలను సిద్ధం చేయాలని నిర్ణయించారు. కొంత మేరకు అందు బాటులో ఉంచామని, మిగిలిన వాటిని త్వరలో రైతులకు అందజేస్తామని అధికారులు వెల్లడించారు.
- పత్తి విత్తనాలను పూర్తిస్థాయిలో ప్రైవేట్ కంపెనీలే అందుబాటులోకి తీసుకొస్తాయి. అయితే కొన్ని కంపెనీల విత్తనాలనే రైతులు కోరుకుంటారు. ఆ మేరకు ఆయా కంపెనీల విత్తనాలను అందుబాటులో ఉంచాలని కంపెనీలను వ్యవసాయశాఖ ఆదేశించింది.
- ఈసారి 24.40 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు వానాకాలం కోసం సిద్ధం చేయనున్నారు. అందులో 10.40 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా, 10 లక్షల మెట్రిక్ టన్నులు ఎన్‌పీకేను రైతులకు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు.

2024 వానాకాలం సీజన్ పంటల ప్రణాళిక

పంట	ఎకరాలు
వరి	66,00,000
పత్తి	60,00,000
మొక్కజొన్న	6,00,000
కంది	5,65,000
సోయాబీన్	4,96,866
పెసర	56,000
జొన్న	38,000
వేరుశనగ	23,000
మినుము	20,000
ఆముదం	3,500
సజ్జ	1000
నువ్వులు	500
రాగి	320
కుసుమ	165
పొద్దుతిరుగుడు	60
మొత్తం	1,34,35,175

రైతుభరోసా.. రుణమాఫీ.. పంటల బీమా..

- ఈసారి వానాకాలం సీజన్ నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రైతుభరోసా ద్వారా అధికంగా పెట్టు బడిసాయం అందజేయనుంది. ఈ వానాకాలం సీజన్‌కు ఎకరాకు రూ.7,500 ఇవ్వనుంది. అయితే సాగయ్యే భూములకే ఇవ్వాలని, సీలింగ్ విధించాలని నిర్ణయించారు. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు ఖరారు చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. మరోవైపు కౌలుదారులకు కూడా రైతుభరోసా ఇస్తారు. రైతులకు రూ. 2 లక్షల పంట రుణమాఫీని ఆగస్టు 15వ తేదీ నాటికి చేస్తామని స్వయానా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు కూడా ఖరారు దశలో ఉన్నాయి. ఈ వానాకాలం సీజన్ నుంచే రైతులకు పంటల బీమాను పునరుద్ధరిస్తారు. ఈ విషయంలో త్వరలో మార్గదర్శకాలు ఖరారు చేస్తారు. ఇప్పటికే ఆయా కంపెనీలతో చర్చలు జరిపారు. మరోవైపు జిల్లాల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నారు. ఏ జిల్లాలో ఏ పంటలకు బీమా అవసరం? ఎలా అమలు చేయాలి? జిల్లాను బట్టి పంటల బీమా ప్రీమియం నిర్ణయించే విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై సమాచారం తీసుకుంటున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.